www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 6-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 81
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి తె. 4.26 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు తె. 4.48 తదుపరి పుష్యమి; వర్జ్యం: సా. 4.27-6.05; దుర్ముహూర్తం: ఉ. 5.49-7.33; అమృతఘడియలు: రా. 2.19-3.58; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.49

గ్యాస్ బైక్ వచ్చేసింది!



ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్‌ను విడుదల చేసిన బజాజ్ ఆటో సంస్థ

'ఫ్రీడమ్ 125' పేరుతో మార్కెట్లోకి.. ప్రాథమిక వేరియంట్ 95 వేలు

2 కిలోల గ్యాస్, 2 లీటర్ల పెట్రోల్‌తో 330 కి.మీ. ప్రయాణించొచ్చు

కిలోమీటరుకు దాదాపు రూపాయి ఖర్చు

2





చంద్రబాబుకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం

బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ దాకా ర్యాలీ

విమానాశ్రయంలో గజమాలతో సన్మానం

2

సీఎం అయ్యాక తొలిసారి హైదరాబాద్ వచ్చిన చంద్రబాబుకు కేరింతలతో అభిమానుల స్వాగతం

భయపడొద్దు.. రండి!

జగన్ భూతాన్ని మళ్లీ రానివ్వం ఎలా నియంత్రించాలో తెలుసు

పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు భరోసా

ఆంధ్ర పునర్నిర్మాణమే ధ్యేయం

ఆ దిశగానే ప్రధాని, కేంద్ర మంత్రులతో చర్చలు

గత ఐదేళ్ల నష్టం నుంచి బయటికి రావాలి

రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు సహకరించాలని కోరాం

రాజధాని, పోలవరం ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

అభివృద్ధే లక్ష్యం.. కులగణన బదులు నైపుణ్య గణన

విశాఖ ఉక్కుకు మెరుగైన యాజమాన్యంపై చర్చిస్తున్నాం.. నేను ఇన్వెస్టర్లకు అనుకూలం

నా హయాంలోనే కియా వచ్చింది

ఈ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమా రాలేదు

ఇప్పుడు పలువురు సీఈవోలు సంప్రదిస్తున్నారు

ఢిల్లీలో మీడియాతో సీఎం ఇష్టాగోష్ఠి

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ దుష్పరిపాలన వల్ల రాష్ట్రానికి సరిదిద్దలేనంత నష్టం జరిగిందని, అమరావతి, పోలవరం విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. మళ్లీ జగన్ వస్తారేమోనని కొందరు భయపడుతున్నారని.. ముఖ్యంగా ఆ భూతాన్ని చూసి రాష్ట్రానికి వచ్చేందుకు పారిశ్రామికవేత్తలు భయపడుతున్నారని తెలిపారు. అయితే దానిని ఎలా నియంత్రించాలో తమకు తెలుసని.. దాని గురించి భయపడాల్సిన అవసరం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక, రక్షణ, ఆరోగ్య మంత్రులతో భేటీల అనంతరం.. హైదరాబాద్ బయల్దేరి వెళ్లే ముందు మధ్యాహ్నం 3 గంటలకు జాతీయ, ప్రాంతీయ మీడియాతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. దాదాపు గంటసేపు మనసు విప్పి మాట్లాడారు. ఎవరు ఎన్ని

మిగతా 11వ పేజీలో...

వచ్చేస్తాం అమరావతికి

ఇప్పటికే 80% సంస్థలు రెడీ

104 కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు సంస్థల నుంచి సంసిద్ధత

11

ఔటర్, ఇన్నర్.. రైట్ రైట్!

ఖర్చు ఎంతైనా రాజధానికి అద్భుత రహదారి.. సీఎంకు గడ్కరీ హామీ



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో బాబు

ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేదాకా చేయూతనివ్వండి

రాజధాని అభివృద్ధికి సాయం చేయండి

పోలవరం నిధులకు త్వరగా ఆమోద ముద్ర

అదనపు రుణాలకు అవకాశమివ్వండి

కేంద్ర ఆర్థిక మంత్రికి చంద్రబాబు వినతి

ఆర్థిక భరోసాకు నిర్మలా సీతారామన్ హామీ

రాజ్‌నాథ్, జేపీ నడ్డాలతోనూ సీఎం భేటీ

11

'నీతి' సీఈవో, సీఐఐ, ఫిక్కీ ప్రతినిధులతోనూ చర్చలు

పదేళ్ల పంచాయితీకి పరిష్కారం!

విభజన సమస్యలపై ఇద్దరు సీఎంల భేటీ నేడే



రేవంత్‌తో చర్చల్లో రెండు రాష్ట్రాల ప్రయోజనాలకు ప్రాధాన్యం: బాబు

పదేళ్లుగా పరిష్కారంకాని పంపకాలపై ప్రధానంగా దృష్టి

ఆస్తుల విభజన, విద్యుత్ బకాయి,జల వాటాలే అజెండా

షెడ్యూల్ 9లోని 89 సంస్థల విలువ 1,63,122 కోట్లు

ఏపీకి రావాల్సిన విద్యుత్ బకాయిలు రూ.7,703 కోట్లు

వడ్డీని తీసేసి అసలైనా చెల్లించాలంటున్న ఏపీ

రెండు రాష్ట్రాల మధ్య తెగని ఉద్యోగుల బదిలీ అంశం

కృష్ణాజలాల వాటాల వివాదానికి ఇకపైనా తెర పడేనా?

విభజన జరిగిన పదేళ్లలో సీఎంల భేటీ ఇదే తొలిసారి

చంద్రబాబు చొరవతో పడిన తొలి అడుగు

హైదరాబాద్ ప్రజాభవన్‌లో రేవంత్‌తో చర్చలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న విభజన సమస్యలు ఇకనైనా పరిష్కారమవుతాయా? తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య చర్చలు సానుకూల ఫలితాలు లభిస్తాయా? రాష్ట్ర విభజన జరిగిన పదేళ్ల తర్వాత జరుగుతున్న కీలక భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది! పెండింగ్ అంశాల పరిష్కారంపై కలిసి మాట్లాడుకుందామంటూ చంద్రబాబు చేసిన ప్రతిపాదనకు రేవంత్ అంగీకరించిన నేపథ్యంలో... హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శనివారం సాయంత్రం 6 గంటలకు ముఖ్యమంత్రులిరువురూ భేటీ కానున్నారు. విభజన అంశాలే అజెండాగా ఈ సమావేశం జరగనుంది. ఇందులో మూడు అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అవి... 1) విభజన చట్టం షెడ్యూల్ 9లో ఉన్న 91 సంస్థలు, షెడ్యూల్ పరిధిలో ఉన్న 142 సంస్థలు, విభజన చట్టంలో ప్రస్తావనకు రాని 12 సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజన. 2) విద్యుత్ బకాయిలు. 3) జల పంపకాలు

ఆస్తుల పంచాయితీ..

విభజన చట్టంలోని షెడ్యూల్ 9లోని 91 సంస్థలో ఎస్‌సీసీఎల్, ఏపీఎస్ఎఫ్‌సీల విభజన కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. మిగిలిన 89 సంస్థల ఆస్తుల విలువ సుమారుగా (భూములు, భవనాలు) రూ.1,06,199 కోట్లు (ఏపీ వాటా రూ.46,949 కోట్లు, తెలంగాణ 35,231 కోట్లు, హెడ్‌క్వార్టర్స్ రూ.24019 కోట్లు), చరాస్తులు రూ.9,893, యంత్రాలు, ఇతర పరికరాలు రూ.39,421 కోట్లు, బ్యాంకు ఖాతాల్లో, ఎఫ్‌డీల్లో ఉన్న సొమ్ము -రూ.7,609 కోట్లు (ఏపీ- 3,588 కోట్లు,

మిగతా 2వ పేజీలో...

'ఇంటర్వ్యూల' వెనుక ఎవరు?



అక్రమాలు జరుగుతున్నాయంటూ రద్దు చేసిన జగన్

మూడేళ్లకు తిరిగి ఇంటర్వ్యూల పునరుద్ధరణ

అదే రోజు గ్రూప్-1 నోటిఫికేషన్.. ఎవరి ఆదేశాలతో తిరిగి తెచ్చారు?

ఎవరి మేలు కోసం నిర్ణయం వెనక్కి.. 99% మార్కులపై మౌనం

"గ్రూప్-1 పోస్టుల భర్తీలో పారదర్శకత లోపించింది. ఇంటర్వ్యూలతో కావాల్సిన వారికి ఎక్కువ మార్కులు వేసుకుంటున్నారు. నా ప్రభుత్వంలో అలాంటి అక్రమాలకు చోటుండదు. మొత్తం ఇంటర్వ్యూల వ్యవస్థను రద్దు చేస్తాం. పూర్తి పారదర్శకంగా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేస్తాం" 2019లో అధికారంలోకి వచ్చిన కొత్తలో సీఎంగా జగన్ ప్రకటన ఇది. ఈ ప్రకటన చేసి ఇంటర్వ్యూలను రద్దు చేసిన అప్పటి ప్రభుత్వం.. అనూహ్యంగా 2022 సెప్టెంబరు 30న వాటిని పునరుద్ధరించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో ఈ అంశం మరోసారి ప్రధానంగా చర్చకు వస్తోంది. అప్పుడు ఎందుకు ఇంటర్వ్యూలు వద్దన్నారు.. ఆ తర్వాత వాటిని తిరిగి ఎందుకు తెరపైకి తెచ్చారు? దీని వెనుక ఎవరున్నారు? ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆనాడు అధికారంలోకి రాగానే వైఎస్ జగన్మోహన్ రెడ్డి తొలిగా తీసుకున్న నిర్ణయాల్లో ఇంటర్వ్యూల రద్దు ఒకటి. ఇంటర్వ్యూలంటే అక్రమాలేనని ఆనాడు ఆయన 'రద్దు' నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఆ తర్వాత ఆయన హయాంలోనే మళ్లీ ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టారు. దేశ వ్యాప్తంగా కీలకమైన ఉద్యోగాల భర్తీలో పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూలు) ఉన్నందున తిరిగి ప్రవేశపెడుతున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ క్రమం అంతా పొంతన లేకుండా కనిపిస్తోంది కదా! 'రద్దు' అని జగన్ ఎందుకు చెప్పారు? ఆ తర్వాత... మళ్లీ ఎందుకు ప్రవేశపెట్టారు? ఎవరి ఆదేశాలతో ఇంటర్వ్యూలను పునఃప్రవేశపెట్టారు? రద్దు చేయమన్న జగనే మళ్లీ వాటిని

మిగతా 3వ పేజీలో...

బాబు వచ్చినా 'మారలేదు'!

ఐఏఎస్ పోస్టింగ్‌ల తీరుపై సర్వత్రా విస్మయం

జగన్‌తో అంటకాగిన వాళ్లకే మళ్లీ అందలం

"జగన్మోహన్ రెడ్డి స్వార్థానికి, ధనదాహానికి కొందరు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. మేము అధికారంలోకి వస్తాం. అలాంటి అధికారుల ఆట కట్టిస్తాం!"

...ఎన్నికల ముందు చంద్రబాబు చేసిన ప్రకటనలు, జారీ చేసిన హెచ్చరికలు!

...సీన్ కట్ చేస్తే

ఎన్నికల ఫలితాలు వచ్చి నెల రోజులైనా... కొత్త సర్కారు కొలువుదీరి 20 రోజులు దాటినా పరిస్థితి మారలేదు. జగన్ సర్కారుతో అంటకాగిన అధికారులు అందలం వీడలేదు. పైగా... వైసీపీకి అడు గులకు మడుగులొత్తి, తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న వారిని పిలిచి చక్కటి పోస్టింగులు ఇచ్చేస్తున్నారు. ఈ చిత్రంపై బ్యూరోక్రాట్లలోనే తీవ్రమైన విస్మయం, అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఐదేళ్లు అష్టకష్టాలు పడిన వాళ్లకు దక్కని న్యాయం

గత ప్రభుత్వంలో కీలక స్థానాల్లో సాయిప్రసాద్

ఇప్పుడు ఆయనకే జల వనరుల శాఖ అప్పగింత

బాబును విమర్శించిన ప్రద్యుమ్నకే పేషీలో చోటు

సాయిరెడ్డి చెప్పినట్టల్లా విన్న సృజనకు ఎన్టీఆర్ జిల్లా

జవహర్‌రెడ్డికి అసైన్డ్ అప్పగించిన నాగలక్ష్మికి గుంటూరు

పెద్దిరెడ్డి సన్నిహితులందరికీ నేడూ మంచి పోస్టులు

విపక్షంలో ఉండగా చేసిన హెచ్చరికలు ఉత్తుత్తివేనా?

లోకేశ్ 'రెడ్‌బుక్'లో రాతలు చెరిగిపోయాయా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2019లో జగన్ అధికారంలోకి రాగానే... చంద్రబాబు హయాంలో కీలక పోస్టింగుల్లో ఉన్న వారందరినీ పక్కన పడేశారు. జిల్లా స్థాయిలో ఎస్పీలు, కలెక్టర్లతో మొదలుకుని రాష్ట్రస్థాయిలో కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శుల వరకూ ఎవ్వరినీ వదిలిపెట్టలేదు. చివరికి... తటస్థంగా వ్యవహరిస్తూ, పద్ధతిగా పని చేసిన వారినీ జగన్ పక్కనపెట్టేశారు. 'వీళ్లంతా టీడీపీ' అనే ముద్ర వేసి అప్రాధాన్య పోస్టుల్లోకి నెట్టేశారు. ఆ అధికారులను ముప్పుతిప్పలు పెట్టారు. ఒకరకంగా చెప్పాలంటే ఐదేళ్లపాటు ఈ అధికారులంతా తీవ్ర

మిగతా 12వ పేజీలో...



చుట్టూ.. గనుల గజదొంగలే

కీలక స్థానాల్లో పెద్దిరెడ్డి, వెంకటరెడ్డి మనుషులే

గనుల శాఖలో అక్రమాలెలా బయటికొస్తాయి?.. వారిని కదల్చకుండా నిజాల నిగ్గెలా?

గత ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహారం.. బొగ్గు, ఇసుక, బెరైటీస్‌లో అక్రమాలు

ఎన్నికల తర్వాత కీలక నోట్‌ఫైల్స్ మాయం.. అయినా కొత్త ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో గనుల శాఖలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. అడ్డగోలుగా నిబంధనలు అతిక్రమించి భారీ అవినీతికి పాల్పడ్డారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వస్తే ఐదేళ్లలో జరిగిన అక్రమాలు, అన్యాయాలను బయటకు తీస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం వచ్చినా గనుల శాఖలో ఎక్కడి దొంగలు అక్కడే ఉన్నారు. నాటి గనుల మంత్రి పెద్దిరెడ్డి, డైరెక్టర్‌గా పనిచేసిన వెంకటరెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి సొంత మనుషులు ఇంకా గనుల శాఖలో అత్యంత కీలకమైన స్థానాల్లో ఉన్నారు. వాళ్లు లేకపోతే వ్యవస్థలే నడవవన్నట్లుగా వ్యవహారం సాగుతోంది. ఇప్పటికే కాంట్రాక్టర్ల సెక్యూరిటీ డిపాజిట్లు దారి మళ్లాయి. సుప్రీం కోర్టులో కేసు ఉండగానే జేపీ వెంచర్స్‌కు 120 కోట్ల బ్యాంక్ గ్యారెంటీలు వెనక్కి ఇచ్చేశారు. నో డ్యూ సర్టిఫికెట్లు ఇచ్చారు. ఎన్నికల తర్వాత కీలకమైన నోట్‌ఫైల్స్ మాయం చేశారు. బెరైటీస్ అక్రమాల ఆనవాళ్లు కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అంతా సొంత మనుషులే కాబట్టి ఒక్క ఆధారం కూడా బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆనవాళ్లు చెరిపేస్తుంటే కూటమి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? చుట్టూ దొంగలను పెట్టుకుని అక్రమాలను ఎలా కనిపెడతారు? ఈ పరిస్థితుల్లో అసలు నిజాలను సర్కారు బయటకు తీయగలదా? తోడేళ్ల మంద నుంచి నిజాలను కాపాడగలదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జగన్ పాలనలో ఇసుకను అంగడి సరుకుగా మార్చారు. తొలుత ఎండీసీ నియంత్రణలో ఇసుక వ్యాపారం

మిగతా 12వ పేజీలో...

నీట్ రద్దు చేయొద్దు

నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులకు రద్దుతో తీవ్రనష్టం


భారీగా అవకతవకలు జరిగిన దాఖలాల్లేవు

ఇప్పటికే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాం

సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం

సర్కారు బాటలోనే రద్దును వ్యతిరేకించిన ఎన్‌టీఏ

ఆగస్టు 11న నీట్-పీజీ



న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ పరీక్షను రద్దు చేయొద్దని.. అలా చేస్తే నిజాయితీగా పరీక్ష రాసిన లక్షలాది విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. నీట్ పరీక్ష నిర్వహణలో భారీ మొత్తంలో అవకతవకలు జరిగినట్లు ఆధారాలు లేవని.. ఆ పరీక్షను

మిగతా 2వ పేజీలో...



ప్రధాని నివాసం నుంచి వెళ్తున్న సునాక్, అక్షత

దేశాన్ని పునర్నిర్మిస్తా

ఎన్నికల్లో విజయానంతరం కీర్ స్టార్మర్ ప్రకటన

యూకే ప్రధానిగా కీర్ స్టార్మర్



ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం.. మొత్తం 650 స్థానాల్లో 412 గెలుపు

కన్జర్వేటివ్‌ల ఘోర ఓటమి.. 121 సీట్లకు పరిమితం.. పద్నాలుగేళ్ల పార్టీ పాలనకు తెర

సునాక్ రాజీనామా.. ఓటమికి తనదే బాధ్యతంటూ క్షమాపణ

దెబ్బకొట్టిన అసమ్మతి, అస్థిరత, ప్రభుత్వ వ్యతిరేకత

తెలుగువారు ఉదయ్ నాగరాజు, చంద్ర కన్నెగంటిల ఓటమి

రికార్డు స్థాయిలో 26 మంది భారత సంతతి వ్యక్తుల విజయం

2

చిత్తూరు కార్పొరేషన్ కూటమి వశం!

మేయర్, డిప్యూటీ మేయర్ సహా టీడీపీలోకి 18 మంది వైసీపీ కార్పొరేటర్లు

ఇప్పటికే జనసేనలో చేరిన నలుగురు

12

25 మంది కార్పొరేటర్లు, ఇద్దరు ఎక్స్ అఫిషియో సభ్యులతో పాలన కూటమి చేతికి

పిన్నెల్లికి 2 రోజుల పోలీసు కస్టడీ

నెల్లూరు సెంట్రల్ జైలులోనే విచారణ

11

గ్యాస్ బైక్ వచ్చేసింది!

» బజాజ్ నుంచి ప్రపంచంలోనే తొలి సీఎన్‌జీ బైక్

పుణె, జూలై 5: ఇప్పటిదాకా మనం గ్యాస్‌తో నడిచే కార్లను మాత్రమే చూశాం. ఇకపై గ్యాస్‌తో నడిచే బైక్‌లు కూడా అందుబాటులోకి రానున్నాయి. బజాజ్ ఆటో సంస్థ ఈ విప్లవాత్మక పరిణామానికి నాంది పలికింది. ప్రపంచంలోని మొట్టమొదటి సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) బైక్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఫ్రీడమ్ 125 పేరిట దీనిని ఆవిష్కరించింది. కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమక్షంలో బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ ఈ వాహనాన్ని పుణెలోని కంపెనీ ప్లాంట్‌లో ఆవిష్కరించారు. గ్యాస్‌తోపాటు పెట్రోల్‌తో కూడా నడిచేలా రెండు ఆప్షన్లతో కూడిన ట్యాంక్‌తో ఈ బైక్‌ను రూపొందించారు. ఈ బైక్ ప్రారంభ ధర రూ.95 వేల నుంచి ఉంటుంది. మూడు వేరియంట్లతో దీనిని మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. డిస్క్ ఎల్‌ఈడీ, డ్రమ్ ఎల్‌ఈడీ, డ్రమ్ వేరియంట్లలో ఫ్రీడమ్ 125 బైక్ లభిస్తుంది. డిస్క్ ఎల్‌ఈడీ బైక్‌లు ఐదు రంగుల్లో, నాన్ ఎల్‌ఈడీ డ్రమ్ వేరియంట్ బైక్ రెండు రంగుల్లోనూ లభిస్తాయి. డ్రమ్ వేరియంట్ బైక్ ధరను రూ.95 వేలుగా నిర్ణయించగా, డ్రమ్ ఎల్‌ఈడీ బైక్ ధర రూ.1.05 లక్షలు, డిస్క్ ఎల్‌ఈడీ బైక్ ధర రూ.1.10 లక్షలుగా నిర్ణయించారు. ఇక ఫీచర్ల విషయానికొస్తే.. 125 సీసీ ఇంజిన్ కలిగిన ఫ్రీడమ్ 125 బైక్‌లో 2 లీటర్ల సామర్థ్యం కలిగిన పెట్రోల్ ట్యాంక్, 2 కిలోల సీఎన్‌జీ ట్యాంక్ ఉంటాయి. 2 కిలోల సీఎన్‌జీతో 200 కిలోమీటర్ల దూరం, 2 లీటర్ల పెట్రోల్‌తో 130 కిలోమీటర్ల దూరం కలిపి మొత్తం 330 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. బైక్ రన్నింగ్‌లో ఉండగానే గ్యాస్ నుంచి పెట్రోల్‌కు, పెట్రోల్ నుంచి గ్యాస్‌కు మార్చుకునే స్విచ్ ఏర్పాటు కూడా ఉంటుంది. ఆవిష్కరణ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ.. సాధారణ పెట్రోల్ బైక్‌ల సగటు వ్యయం కిలోమీటరుకు రూ.2.25 అవుతుందని, కానీ.. సీఎన్‌జీ బైక్‌తో ఈ ఖర్చు కిలోమీటరుకు రూ.1కి తగ్గనుందని అన్నారు. ముడి చమురును దిగుమతి చేసుకునే అవసరాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించుకునే అవకాశం ఫ్రీడమ్ 125 బైక్ ద్వారా కలుగుతుందన్నారు.

ఫ్రీడమ్ 125 బైక్‌ను తొలుత మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో మాత్రమే అందుబాటులోకి తేనున్నట్లు.. ఆ తర్వాత దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ విక్రయించనున్నట్లు బజాజ్ ఆటో కంపెనీ తెలిపింది. బజాజ్ షోరూమ్‌లతో పాటు కంపెనీ వెబ్‌సైట్ ద్వారా కూడా ఈ వాహనాన్ని బుక్ చేసుకోవచ్చునని పేర్కొంది.

ట్రూ కాలర్ లేకున్నా.. కాలర్ పేరు

» ఈనెల 15 నుంచి ట్రాయ్ కొత్త విధానం

న్యూఢిల్లీ, జూలై 5: ట్రూ కాలర్‌ను ఉపయోగించకుండానే మనకు ఫోన్ చేసిన వారి పేరును తెలుసుకునే సదుపాయాన్ని ట్రాయ్ అందుబాటులోకి తీసుకువస్తోంది. మన ఫోన్లో అవతలి వాళ్ల ఫోన్‌నంబర్ సేవ్ చేసి లేకపోయినా, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్లు వచ్చినా.. వారి పేర్లు మన మొబైల్ స్క్రీన్‌పై కనిపించేలా 'పేరు వెల్లడి సేవ' (నేమ్ ప్రజెంటేషన్ సర్వీస్)ను ప్రవేశపెట్టనుంది. ఈ నెల 15వ తేదీన ఈ సేవలను యాక్టివేట్ చేయనుంది. సిమ్ కార్డు కొన్నప్పుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా కాలర్ల పేర్లు కనిపిస్తాయని సమాచారం. ఫోన్ ఎవరు చేస్తున్నారో గుర్తించడానికి ప్రస్తుతం చాలా మంది 'ట్రూ కాలర్' యాప్‌ను ఉపయోగిస్తున్నారు. అయితే, దీని వల్ల సమాచార భద్రతపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలోనే ట్రాయ్ ఈ సదుపాయాన్ని తీసుకువస్తోంది.

లోకం తీరు



అవయవదాత.. స్ఫూర్తిప్రదాత

» బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి ఏడుగురికి కొత్త జీవితం

» రోడ్డు ప్రమాదంలో గాయపడిన న్యాయవాది ప్రసాద్



అవయవాలను తరలిస్తున్న సిబ్బంది

మంగళగిరి సిటీ, జూలై 5:ఐ గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణానికి చెందిన న్యాయవాది, టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి మునగపాటి ప్రసాద్(40) అవయవదానంతో స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. ఏడుగురికి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. మంగళగిరి పట్టణంలోని అన్నపూర్ణ డీలక్స్ సెంటర్‌కు చెందిన మునగపాటి ప్రసాద్ ఈ నెల 2న తెనాలి రోడ్డులో ద్విచక్ర వాహనంపై పెదవడ్లపూడి నుంచి మంగళగిరి వైపు వస్తూ ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఆయనను చినకాకాని ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించి బతికించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. దీంతో గురువారం సాయంత్రం ప్రసాద్ బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. అంతటి విషాదంలోనూ ఆయన కుటుంబసభ్యులు ప్రసాద్ అవయవాలు దానం చేయాలని నిర్ణయించారు. భార్య సంధ్యారాణి అనుమతితో ఈ విషయాన్ని వైద్యులకు తెలియజేశారు. ఎన్నారై మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్గాన్ డొనేషన్ విభాగాధిపతి డాక్టర్ మస్తాన్ సాహెబ్ పర్యవేక్షణలో వైద్య బృందం ప్రసాద్ శరీరం నుంచి గుండె, కాలేయం, కిడ్నీలు, ఊపిరితిత్తులు, నేత్రాలను సేకరించారు. గుండెను తిరుపతిలోని పద్మావతి ఆస్పత్రికి, ఒక కిడ్నీని ఎన్నారై ఆస్పత్రిలోని రోగికి, మరో కిడ్నీని ఆయుష్ ఆస్పత్రికి, ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి, కాలేయాన్ని తాడేపల్లి మణిపాల్ ఆస్పత్రికి, కళ్లను పెదకాకాని శంకర నేత్రాలయానికి తరలించారు. ప్రసాద్ మృతి పట్ల మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రసాద్ బ్రెయిన్ డెడ్‌కు గురైన విషాద సమయంలోనూ అవయవదానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రావడం గొప్ప విషయమని లోకేశ్ పేర్కొన్నారు.

16 ఏళ్ల యువతికి.. ప్రసాద్ గుండె

తిరుపతి (వైద్యం), జూలై 5: రోడ్డు ప్రమాదంతో బ్రెయిన్ డెడ్ అయిన న్యాయవాది మునగపాటి ప్రసాద్ గుండెను 16 ఏళ్ల యువతికి అమర్చారు. మంగళగిరి నుంచి ప్రత్యేక ఏర్పాట్ల మధ్య తిరుపతి చేరుకున్న గుండెను అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన స్పందన అనే యువతికి అమర్చినట్లు తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

సీనియర్ పాత్రికేయుడు ఉపేంద్రబాబు మృతి

» 'ఆంధ్రజ్యోతి'లో డిప్యూటీ ఎడిటర్‌గా పదవీ విరమణ



గారపాటి ఉపేంద్రబాబు

కంకిపాడు, జూలై 5: సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి మాజీ డిప్యూటీ ఎడిటర్ గారపాటి ఉపేంద్రబాబు(88) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఉపేంద్రబాబు 1935లో కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని కాసరనేనివారిపాలెంలో జన్మించారు. 1961లో బీఏ ఆనర్స్ పూర్తి చేశారు. అనంతరం జర్నలిజం మీద మక్కువతో ఆంధ్రజ్యోతి దినపత్రిక ప్రారంభంలోనే సబ్ ఎడిటర్‌గా విధుల్లో చేరారు. సంస్థలో సుదీర్ఘకాలం సేవలు అందించి డిప్యూటీ ఎడిటర్ స్థాయికి చేరుకుని పదవీవిరమణ చేశారు. ప్రముఖ పాత్రికేయులు నార్ల వెంకటేశ్వరరావు, నండూరి రామమోహనరావు, తుర్లపాటి కుటుంబరావు, పొట్లూరి వీరభద్రరావు, విద్వాన్ విశ్వం తదితరులతో కలసి ఉపేంద్రబాబు పనిచేశారు. విలువలతో కూడిన పాత్రికేయం గురించి నిరంతరం తపించేవారు. ఆయనకు భార్య విద్య కుమారుడు అజయ్, కుమార్తె అమల ఉన్నారు. కొంత కాలంగా గారపాటి అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్వగ్రామంలోనే మరణించిన ఉపేంద్రబాబు అంత్యక్రియలు శుక్రవారం విజయవాడలో జరిగాయి. ఉపేంద్రబాబు మృతికి ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ కె.శ్రీనివాస్ తమ సంతాపం ప్రకటించారు.

జర్నలిస్టు నాయకులు, ప్రజా ప్రతినిధుల నివాళి

ఉపేంద్రబాబు మృతి సమాచారం అందుకున్న వివిధ పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు కాసరనేనివారిపాలెంలోని ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో జ్యోతిచిత్రకి ఎడిటర్‌గా గారపాటితో పని చేసిన పొట్లూరి వెంకట్రావు, సత్యనారాయణ, ఢిల్లీలో విశాలాంధ్రలో పనిచేసిన సీనియర్ జర్నలిస్టు జి.రవికుమార్, నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్టు సెక్రటరీ జనరల్ ఎన్ కొండయ్య కోశాధికారి అమరయ్య ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, ఏపీ బ్రాడ్‌కాస్టింగ్ జర్నలిస్టు అసోసియేషన్ కన్వీనర్లు వి.శ్రీనివాసరావు, మునిరాజు, ఏపీయూడబ్ల్యూజే అర్బన్ అధ్యక్షుడు చావా రవి, విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జయరాజ్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు గారపాటి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

యూకే ప్రధానిగా కీర్ స్టార్మర్

ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం

» మొత్తం 650 స్థానాల్లో 412 గెలుపు

» కన్జర్వేటివ్‌లకు ఘోర ఓటమి

» 121 సీట్లకే పరిమితం.. సునాక్ రాజీనామా



విజయానందంలో భార్యను ముద్దాడుతున్న కీర్ స్టార్మర్



10 డౌనింగ్ స్ట్రీట్ నుంచి వెళ్లిపోతున్న సునాక్ దంపతులు

లండన్, జూలై 5: ఇంగ్లిష్ గడ్డపై రాజకీయం మారింది..! మార్పు కావాలి నినాదం పనిచేసింది..! అంచనాలను నిజం చేస్తూ.. యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించింది. పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం అధికారాన్ని చేజిక్కించుకుంది. సవాళ్లను అధిగమిస్తూ సాగిన ఆ పార్టీ నేత కీర్ స్టార్మర్ (61) ప్రధానిగా నియమితులయ్యారు. భారత సంతతికి చెందిన రిషి సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్‌తో కూడిన బ్రిటన్ పార్లమెంటులో దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్ ఇందులో మొత్తం 650 ఎంపీ సీట్లున్నాయి. యూకే కాలమానం ప్రకారం గురువారం ఉదయం 7 గంటల (భారత్‌లో 11.30కు)కు మొదలైన పోలింగ్ 10 గంటల వరకు సాగింది. 4.60 కోట్ల మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ వెంటనే లెక్కింపు చేపట్టారు. శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మెజారిటీ మార్క్ 326 సీట్లు. లేబర్ పార్టీ 412 స్థానాల్లో గెలుపొందింది. కన్జర్వేటివ్ పార్టీ 121 సీట్లతో సరిపెట్టుకుంది. అనంతరం సునాక్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌కు వెళ్లి రాజు చార్లెస్-3ని కలిసి ప్రధాని పదవికి రాజీనామా సమర్పించారు. కాగా, 23,059 ఓట్ల ఆధిక్యంతో రిచ్‌మండ్-నార్త్ ఆల్లర్‌టన్ నుంచి సునాక్, 18,884 ఓట్ల తేడాతో లండన్‌లోని హోల్‌బోర్న్-సెయింట్ పాన్‌క్రాస్ సీటు నుంచి స్టార్మర్ ఎంపీగా గెలిచారు. ప్యాలెస్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసిన ఆయనను. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చార్లెస్ కోరారు. తదనంతరం స్టార్మర్.. యూకే 58వ ప్రధానిగా బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో రాజు సమక్షంలో ప్రమాణం చేశారు. స్టార్మర్‌కు భారత ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. సంబంధాలు బలోపేతం అయ్యేలా సహకరిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐదేళ్లలో ముగ్గురు ప్రధానులు (బోరిస్ జాన్సన్, లిజ్ ట్రస్, రిషి సునాక్), సొంత పార్టీ నాయకులే విమర్శలకు దిగడంతో కన్జర్వేటివ్ ప్రభుత్వం ప్రజల్లో చులకనైంది. ఎన్నడూ లేనంతగా ఓటమి పాలైంది. కొవిడ్ సమయంలో జాన్సన్ పార్టీలు, లిజ్ ట్రస్ 'మినీ బడ్జెట్' ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీశాయి. అప్పటినుంచే పతనం మొదలైంది. ఇక 2019లో 371 సీట్లు నెగ్గిన ఆ పార్టీ ఇప్పుడు అందులో మూడో వంతుకు పరిమితమైంది. 23.7 శాతం ఓట్లే సాధించింది. నాడు 201 సీట్లు నెగ్గిన లేబర్ పార్టీ.. ఇప్పుడు 33.7 శాతం ఓట్లు తెచ్చుకుంది. ఇక నిగెల్ ఫరేజ్ స్థాపించిన రిఫార్మ్ యూకే పార్టీ 15 శాతం ఓట్లు సాధించి కన్జర్వేటివ్‌లను దెబ్బకొట్టింది.

కూలీ కొడుకు ప్రధాని

కీర్ స్టార్మర్ నిరుపేద నేపథ్యం నుంచి వచ్చారు. 1962 సెప్టెంబరు 2న లండన్‌లో జన్మించారు. ఈయన తల్లి పరిశ్రమలో కూలీ. న్యాయవిద్య చదివిన స్టార్మర్ హక్కుల కేసులను వాదించేవారు. సంస్కరణలను ఇష్టపడే ఈయన రాజకీయాల్లోకి వచ్చింది 2015లోనే. ఆ ఏడాదితో పాటు 2019లో ఉత్తర లండన్ ఎంపీగా గెలిచారు. గత ఎన్నికల్లో 211 సీట్లు మాత్రమే నెగ్గిన లేబర్ పార్టీకి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, 'మార్పు' నినాదంతో పునరుత్తేజం చేశారు. సేవ, మౌలిక సదుపాయాలకు పెద్దపీట, తక్కువ ధరలకు ఇళ్ల నిర్మాణం, దేశానికే మొదటి ప్రాధాన్యం వంటి కీలక హామీలతో ప్రజల మనసు గెలిచారు.

ఓటమికి నాదే బాధ్యత: రిషి

ఫలితాలు చూసి రిషి సునాక్ నిరాశకు గురైనా వెంటనే తేరుకున్నారు. భార్య అక్షతామూర్తితో కలిసి 10 డౌనింగ్ స్ట్రీట్ వద్ద మీడియాతో మాట్లాడారు. "ప్రధానిగా శక్తివంచన లేకుండా పనిచేశా. అయినా, ప్రజలు మార్పు కోరుకున్నారు. వారి అసంతృప్తి, ఆగ్రహం నన్ను తాకాయి. ఈ తీర్పును స్వాగతిస్తున్నా. పార్టీ ఓటమికి నాదే బాధ్యత. సహచర ఎంపీల్లో చాలామంది ఓటమి బాధించింది. అందుకే కన్జర్వేటివ్ పార్టీ సారథ్యం నుంచి కూడా తప్పుకొంటున్నా" అని ప్రకటించారు. సునాక్ 2022 అక్టోబరులో యూకే ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరు తెలుగు వారి ఓటమి!

26 మంది భారత సంతతి ఎంపీల గెలుపు

యూకే సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీలుగా పోటీ చేసిన ఇద్దరు తెలంగాణ వ్యక్తులు పరాజయంపాలయ్యారు. లేబర్ పార్టీ నుంచి నార్త్ బెడ్‌ఫోర్డ్‌షైర్ నియోజకవర్గంలో బరిలో దిగిన ఉదయ్ నాగరాజు కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి రిచర్డ్ ఫుల్లర్ చేతిలో 5 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడారు. నాగరాజు స్వస్థలం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ఈయన బంధువు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ చేశారు. నిజామాబాద్ జిల్లా కోటగిరికి చెందిన డాక్టర్ చంద్ర కన్నెగంటి (కన్జర్వేటివ్) స్టోక్ ఆన్ ట్రెంట్ సెంట్రల్ నియోజకవర్గంలో 6,221 ఓట్లతో మూడో స్థానానికి పరిమితం అయ్యారు. ఈయనపై లేబర్ పార్టీ అభ్యర్థి గారెత్ స్నెల్ విజయం సాధించారు. లండన్‌లో వైద్యుడిగా పనిచేస్తున్న చంద్ర.. గతంలో స్టోక్ ఆన్ ట్రెంట్‌లో కౌన్సిలర్, మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కాగా, యూకే ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 26 మంది భారత సంతతి వ్యక్తులు ఎంపీలుగా ఎన్నికయ్యారు. వీరిలో అధికులు తాజా ఎన్నికల్లో అధికారం కైవసం చేసుకున్న లేబర్ పార్టీ వారే కావడం విశేషం. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన మాజీ హోం మంత్రులు ప్రీతి పటేల్, సుయెల్లా బ్రేవర్మన్ మరోసారి విజయం సాధించారు. మరో మాజీ మంత్రి క్లెయిర్ కౌటిన్హో కూడా నెగ్గారు. కన్జర్వేటివ్ పార్టీ తరఫున గగన మహీంద్ర (సౌత్‌వెస్ట్ హెర్ట్ ఫోర్డ్‌షైర్-), శివానీ రాజా (లీసెస్టర్ ఈస్ట్), సీమా మల్హోత్రా (వాల్‌సాల్), వాలెరీ వాజ్ (బ్లోక్స్ విచ్), కీత్ వాజ్, లీసా నాండీ, సిక్కు ఎంపీలు ప్రీత్‌కౌర్ గిల్, తన్‌మంజిత్ సింగ్ దేహి, నవేందు మిశ్రా, రథిమా విటోమ్ విజయ బావుటా ఎగురవేశారు. కాగా, లేబర్ పార్టీ నుంచి 12 మంది భారత మూలాలున్న ఎంపీలు పార్లమెంటులో తొలిసారి అడుగుపెడుతుండడం గమనార్హం.

నీట్ రద్దు చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రద్దు చేసి కొత్తగా పరీక్ష నిర్వహించడం హేతుబద్ధం కాదని స్పష్టం చేసింది. అలా నిజాయతీగా పరీక్ష రాసిన లక్షలాది విద్యార్థుల ప్రయోజనాలను కాపాడడానికి తాము కట్టుబడి ఉన్నామని పేర్కొంది. నీట్ యూజీ ప్రశ్నాపత్రాల లీకేజీ సహా పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై.. కేంద్ర విద్యా శాఖ శుక్రవారం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. నీట్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తునకు సీబీఐని ఆదేశించినట్లు అందులో పేర్కొంది. అలాగే.. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో పరీక్షలను సమర్థంగా, సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కోర్టుకు తెలిపింది. కేంద్రం బాటలోనే.. ఎన్‌టీఏ కూడా నీట్ పరీక్ష రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కాగా.. నీట్ అక్రమాలపై దాఖలైన పిటిషన్లపై.. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ నెల 8న విచారణ జరపనుంది.

ఆగస్టు 11న నీట్-పీజీ పరీక్ష

న్యూఢిల్లీ, జూలై 5: వాయిదా పడ్డ నీట్-పీజీ పరీక్షను ఆగస్టు 11న నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ శుక్రవారం ప్రకటించింది. ఈ పరీక్షను రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తామని పేర్కొంటూ నోటిఫికేషన్ విడుదల చేసింది.

హత్రాస్‌పై రాజకీయం చేయను

బాధితులకు వీలైనంత అధికంగా, త్వరగా పరిహారం అందించాలి

» యూపీ ప్రభుత్వానికి రాహుల్ విజ్ఞప్తి

» బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నేత



హత్రాస్, జూలై5: హత్రాస్ తొక్కిసలాట ఘటనను రాజకీయం చేయాలని తాను భావించటంలేదని, అయితే, ఈ విషాదం వెనుక ప్రభుత్వ యంత్రాంగ పరంగా పలు లోపాలున్నాయని కాంగ్రెస్ అగ్ర నాయకుడు, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు వీలైనంత ఎక్కువగా, త్వరగా పరిహారం అందించాలని యూపీ ప్రభుత్వాన్ని కోరారు. హత్రాస్ బాధితులను రాహుల్ శుక్రవారం పరామర్శించారు. వేకువజామునే ఢిల్లీ నుంచి బయల్దేరి వెళ్లిన రాహుల్ ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్, హత్రాస్‌ల పరిధిలోని బాధిత కుటుంబాలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, పలువురు బాధితులు ఇంకా షాక్ నుంచి తేరుకోలేదని.. పోలీసులు, అధికారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవటం వల్లనే తొక్కిసలాట జరిగిందని వారు చెప్పారని తెలిపారు. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారు నిరుపేదలని, వారికి వీలైనంత అధికంగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నానని రాహుల్ పేర్కొన్నారు. ఇచ్చే పరిహారం కూడా ఆర్నెళ్ల తర్వాతో, ఏడాది తర్వాతో కాకుండా త్వరగా అందిస్తే బాధితులకు సహాయం చేసినట్లవుతుందన్నారు. కాగా ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల పరిహారాన్ని యూపీ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రాహుల్ పర్యటన నేపథ్యంలో స్థానికంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. హత్రాస్ ఘటనను పార్లమెంటులో లేవనెత్తుతానని, పరిహారం త్వరగా అందేలా కృషి చేస్తానని రాహుల్ తమకు హామీ ఇచ్చారని బాధితులు పేర్కొన్నారు.

భోలేబాబాకు రూ.100 కోట్ల ఆస్తులు

జాబితాలో ఆశ్రమాలు, స్థిరాస్తులు, ఖరీదైన వాహనాలు

హత్రాస్, జూలై5: హత్రాస్‌లో తొక్కిసలాటకు కారణమైన భోలేబాబాకు దాదాపు రూ.100కోట్ల ఆస్తులు ఉన్నట్లు వెల్లడైంది. పలు ఆశ్రమాలు, నివాసాలు, ఇతర స్థిరాస్తులు, వాహనాల రూపంలో ఇవి ఉన్నట్లు తేలింది. వీటిలో ముఖ్యమైనది యూపీలోని మొయిన్‌పురిలో ఉన్న ఆశ్రమం. ఇది ఫైవ్‌స్టార్ హోటల్ స్థాయిలో ఉంటుంది. దీన్ని కట్టిన స్థలమే రూ.4కోట్ల విలువ చేస్తుందని సమాచారం. భోలేబాబాగా పేరొందిన సూరజ్‌పాల్ ఉండేది ఈ ఆశ్రమంలో నిర్మించిన నివాసంలోనే. ఆశ్రమానికి ఆనుకొని ఉన్న 16 ఎకరాలకుపైగా స్థలాన్ని సూరజ్‌పాల్ లీజుకు తీసుకున్నాడు. ఆగ్రా, కాన్పూర్, గ్వాలియర్ తదితర ప్రాంతాల్లో భోలేబాబా ఆశ్రమాలున్నాయి. అనేక ఖరీదైన, లగ్జరీ కార్లు ఆయనకున్నాయి. ఇటీవల సత్సంగ్ తర్వాత అలాంటి ఓ వాహనంలో ఆయన వెళ్లిపోతుంటే ఆ మార్గంలో మట్టి కోసం జనం ఎగబడటంతో తొక్కిసలాట జరిగి 121మంది మరణించారు.

పదేళ్ల పంచాయితీకి పరిష్కారం!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రూ.3049 కోట్లు, ఫ్రోజెన్-రూ.972 కోట్లు). ఇవి మొత్తం రూ.1,63,122 కోట్లు.. హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న ఆస్తుల్లో 6%అంటే రూ.1,463 కోట్లు విలువైనవి ఏపీలో, మిగిలిన 94 శాతం అంటే, రూ.22,556 కోట్ల విలువైనవి తెలంగాణలో ఉన్నాయి. ఇందులో ఏపీ ప్రభుత్వం 58%,(రూ.14,002కోట్లు) క్లెయిమ్ చేయగా, షీలా భిడే నిపుణుల కమిటీ రూ.7,127 కోట్లు(30%) మాత్రమే ఏపీ కోసం సిఫారసు చేసింది. తెలంగాణ ప్రభుత్వం 88%(రూ.21,028 కోట్లు) క్లెయిమ్ చేయగా నిపుణుల కమిటీ రూ.16,891 కోట్లు(70%) సిఫారసు చేసింది. కమిటీ ఇచ్చిన ప్రతిపాదనల్లో 68% సంస్థల విభజనకు తెలంగాణ ప్రభుత్వం 2019 అక్టోబరులో అంగీకారం తెలిపింది. ఏపీ ప్రభుత్వం మొత్తం 89 సంస్థల విభజనకు అంగీకారం తెలిపింది. ఎస్‌సీసీఎల్(సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్) విభజన సమస్య, ఏపీ స్టేట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విభజన సమస్య కేంద్ర ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇక.. ఏపీ విభజన చట్టం కిందకురాని 12 సంస్థలు సెక్షన్ 64 పరిధిలోకి వస్తాయి. ఈ సంస్థలను జనా భా ప్రాతిపదికన విభజించలేదు. నగదు, చరాస్థులు మాత్రమే విభజించాలని, చరాస్థులు పూర్తిగా తమకే చెందుతాయని తెలంగాణ వాదిస్తోంది. కేంద్ర న్యాయశాఖను సంప్రదించాక ఈ 12 సంస్థల విభజనపై ఒక నిర్ణయం తీసుకుంటామని 2022 సెప్టెంబరు 27న జరిగిన సమావేశంలో కేంద్ర హోం శాఖ తెలిపింది. ఈ సమస్యపై అటార్నీ జనరల్ అభిప్రాయాన్ని కేంద్ర హోం శాఖ పరిశీలిస్తోందని 2023 మే 5వ తేదీన కేంద్ర న్యాయశాఖ వెల్లడించింది. హోం శాఖ నిర్ణ యం వెల్లడించాల్సి ఉంది. షెడ్యూల్ 9, షెడ్యూల్ 10 లో ఉన్న సంస్థల విభజనతోపాటు ఇతర ఆస్తుల విభజన కోసం నిష్పాక్షికంగా వ్యవహరించే ఒక రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జీని నియమించాలంటూ ఏపీ ప్రభుత్వం..సుప్రీంకోర్టులో 2022లో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఆ అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం; ఏపీ వేసిన పిటిషన్ ప్రాథమిక హక్కులకు విరుద్ధం కావున కొట్టేయాలంటూ కేంద్రం కౌంటర్ వేశాయి. వీటికి ఏపీ ప్రభుత్వం సమాధానం ఇస్తూ అఫిడవిట్లు వేసింది. జూలై 9న అది విచారణకు రానుంది.

పాత లెక్కలు తేలేనా?

ఏపీజెన్కో 2014 జూన్ 2 నుంచి 2016 జూన్ 10వ తేదీ వరకు తెలంగాణ డిస్కమ్‌లకు విద్యుత్ సరఫరా చేసింది. దీనికి సంబంధించి అసలు బిల్లు రూ.3,442 కోట్లు, వడ్డీ రూ.4,261 కోట్లు మొత్తం రూ.7,703 కోట్లు రావాలి. అసలు బిల్లును వాయిదాల రూపంలోనైనా తక్షణమే చెల్లింపులు చేయాలని ఏపీ కోరుకుంటోంది. ప్రస్తుతం ఏపీలో ఉన్న 1888 ఉద్యోగులను తెలంగాణ కు, తెలంగాణలో ఉన్న 1447 మంది ఉద్యోగులను ఏపీకి బదిలీ చేసే అంశం కూడా పెండింగ్‌లో ఉంది. తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ వాడుకున్న క్యాష్‌క్రెడిట్‌పై 2024 జూన్ 30 నాటికి జమ అయిన వడ్డీ రూ.138 కోట్లు చెల్లించాలి. 2014-15లో క్లెయిమ్ చేసిన ఆహార సబ్సిడీ రూ.842 కోట్లలో తెలంగాణ వాటా 276 కోట్లు. వ్యాట్, ఆర్‌డీ సెస్, లోనుపై వడ్డీని ఏపీకి తెలంగాణ చెల్లించాలి. 15 ఈఏపీ ప్రాజెక్టులకు సంబంధించిన అప్పులను రెండు రాష్ట్రాల మధ్య పంచాలి. షెడ్యూల్ 9లో ఉన్న సంస్థలకు సంబంధిం చి షీలా భిడే నిపుణుల కమిటీ ఇచ్చిన 89 సంస్థల విభజన పూర్తిచేయాల్సి ఉంది. కృష్ణా జలాల విషయం లో అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ హయాం లో ఏరోజూ ఏకాభిప్రాయం కుదరలేదు. గతంలో కేం ద్ర జలశక్తి మంత్రిగా ఉమాభారతి అధ్యక్షతన అపెక్స్ కమిటీ సమావేశం 2016 సెప్టెంబరు 21న జరిగింది. బచావత్ ట్రైబ్యునల్ కేటాయింపుల మేరకు 811 టీఎంసీలలో 512 టీఎంసీలను ఏపీ, 299 టీఎంసీలను తెలంగాణ వినియోగించుకోవాలని ఉమాభారతి సూచించారు. అప్పటి ఏపీ సీఎం చంద్రబాబు ఈ విషయంలో పెద్దన్న పాత్రను పోషిస్తారని ఉమాభారతి తెలిపారు. 2020 అక్టోబరు 5న కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కమిటీ సమావేశానికి అప్పటి ఏపీ సీఎం జగ న్, తెలంగాణ సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో ఏపీ డిమాండ్లను జగన్ లేవనెత్తకపోవడంతో.. సమావేశమంతా తెలంగాణ వైపు ఏకపక్షంగా సాగింది. అసలు పేచీ విషయానికి వస్తే.. 512 టీఎంసీలను ఏపీకి.. 299 టీఎంసీలు తెలంగాణకు బచావత్ ట్రైబ్యునల్ కేటాయించింది. కానీ, తెలంగాణ నదీ పరీవాహక ప్రాంత విస్తీర్ణం.. కరువు, జనాభా ప్రాతిపదికన 70.80% జలాలను తమకు కేటాయించాలని తెలంగాణ కోరుతోంది. కాగా, పెండింగ్‌లోని విభజన అంశాలపై చర్చకు సీఎం చంద్రబాబు టీసీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బాబు లేఖకు స్పందించిన రేవంత్.. ఆహ్వానిస్తూ లేఖ రాశారు.

హైదరాబాద్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం

బేగంపేట/బంజారాహిల్స్, జూలై 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన చంద్రబాబుకు శుక్రవారం బేగంపేట విమానాశ్రమంలో టీ-టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.20కు చంద్రబాబు హైదరాబాద్‌కు చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి బయటకు రాగానే కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున డప్పుల మోతలు, కోలాటాలు, నృత్యాల నడుమ నినాదాలు చేశారు. క్రేన్‌తో భారీ గజమాల వేసి అభిమానాన్ని చాటుకున్నారు. వారికి అధినేత అభివాదం చేశారు. కటౌట్లు, బ్యానర్లు, పార్టీ జెండాలతో ఈ ప్రాంతమంతా పసుపుమయమైంది.

ఇవే తెలంగాణ డిమాండ్లు?

హైదరాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజా భవన్‌లో శనివారం రెండు తెలుగు రాష్ట్రాల సీఎంల మధ్య చర్చలు సాగనున్నాయి. ఈ చర్చల్లో ప్రధానంగా ఆరు అంశాలు చర్చకు రానున్నట్లు టీ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అవి..

1. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కలుపబడ్డ 7 మండలాలు తిరిగీ తెలంగాణలో చేర్చాలి.
2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 1000కి.మీ మేర విస్తారమైన తీరప్రాంతం (కోస్టల్ కారిడార్)ఉంది. తెలంగాణకు ఈ తీరప్రాంతంలో భాగం కావాలి.
3. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తిరుపతి వేంకటేశ్వర స్వామి. తెలంగాణకు కూడా టీటీడీలో భాగం కావాలి.
4. కృష్ణా జలాల్లో 811 టీఎంసీల నీటి లభ్యత ఉంది. అంతర్జాతీయ నీటి పంపిణీ సూత్రం ప్రకారం క్యాచ్‌మెంట్ ఏరియా నిష్పత్తిలో నీటి పంపకాలు జరగాలి. అదేవిధంగా తెలంగాణకు 558 టీఎంసీ నీటిని కేటాయింపు చేయాలి.
5. తెలంగాణ విద్యుత్ సంస్థలకు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలు రూ.24,000 కోట్ల బకాయిలు సత్వరమే చెల్లించాలి. దానిలో భాగంగా ఆంధ్రాకు ఏమైనా చెల్లించాల్సి ఉంటే, వాటిని చెల్లించడం జరుగుతుంది.
6. తెలంగాణకు ఓడరేవులు లేవు. అందువల్ల విభజనలో భాగంగా ఆంధ్రాలోని కృష్ణపట్నం, మచిలీపట్నం, గంగవరం పోర్టుల్లో భాగం కావాలి

సాగర కాలుష్యంతో మత్స్య సంపదకు ముప్పు

» పారిశ్రామిక కాలుష్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తించాలి

» పీసీబీ అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష



అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణ నిబంధనలు పారిశ్రామిక ప్రగతికి అవరోధం కాకుండా, పర్యావరణహితంగా పరిశ్రమలు నిర్వహించేలా నిర్వాహకులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం మంగళగిరిలోని తన నివాసంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు అనుసరిస్తున్న విధానాలతో పాటు జల, వాయు, శబ్ద కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు పవన్‌కు వివరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... 'స్వచ్ఛమైన గాలి, నీరు పొందడం ప్రజల హక్కు. తీరం వెంబటి పరిశ్రమలు వ్యర్థాలను సముద్రంలోకి వదలడం వల్ల మత్స్యకారులు డీప్-సీలోకి వెళ్లి వేటాడాల్సి వస్తోంది. దీనివల్ల మత్స్య సంపదతో పాటు జలచరాలు నాశనమవుతున్నాయి. వీటిపై పీసీబీ అధికారులు దృష్టి పెట్టాలి' అని ఆదేశించారు. పరవాడ ఫార్మా సంస్థల వల్ల తాడి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ ప్రస్తావించారు. కాకినాడ జిల్లా గురజనాపల్లిలో వీరభద్ర ఎక్స్‌పోర్టు అనే సంస్థ పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్న అంశంపై చర్చించారు. ఈ సంస్థ వ్యర్థ జలాలను పంట కాలువల్లో వదిలి పెడుతున్నందున షోకాజ్ నోటీస్ ఇచ్చి, 15 రోజుల్లో వివరణ తీసుకోవాలని పవన్ ఆదేశించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా వ్యవహరించాలన్నారు.




దొంగతనం చేసిన వాహనంతో వైసీపీ నాయకుడు షేక్ మీరా (వృత్తంలో ఉన్న వ్యక్తి), నాటి మంత్రి రోజాతో మీరా (ఫైల్) (కుడి వైపు కళ్లజోడు పెట్టుకున్న వ్యక్తి)

నాటి స్వచ్ఛాంధ్ర డైరెక్టర్.. నేడు బైకు దొంగ!

» విశాఖలో బైక్ విక్రయిస్తూ వైసీపీ నేత అరెస్టు

గూడెంకొత్తవీధి, జూలై 5: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, వైసీపీ నాయకుడు షేక్ మీరా ద్విచక్ర వాహనం దొంగిలించి పోలీసులకు పట్టుబడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరలవుతోంది. చింతపల్లి మండలానికి చెందిన షేక్ మీరా సుమారు పదేళ్ల కిందట ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టులో పనిచేసేవాడు. రూ.2 లక్షల అవినీతికి పాల్పడడంతో ఉద్యోగం నుంచి తొలగించారు. అప్పటి నుంచి వైసీపీ కార్యకర్తగా తిరిగేవాడు. ఈ క్రమంలో మీరాను పాడేరు తాజా మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ పదవికి సిఫారసు చేశారు. దీంతో మూడేళ్లుగా మీరా కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నాడు. జీకే వీధి మండలంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పిండి రాము చింతపల్లిలోని తన అద్దె గృహం వద్ద పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని ఈ నెల ఒకటో తేదీన షేక్ మీరా దొంగిలించాడు. దీంతో బాధితుడు చింతపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగిలించిన వాహనాన్ని మీరా విశాఖపట్నంలో విక్రయిస్తుండగా టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం వాహనంతోపాటు నిందితుడు మీరాను చింతపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై చింతపల్లి ఎస్‌ఐ అరుణ్ కిరణ్‌ను వివరణ కోరగా దొంగతనానికి పాల్పడిన మీరాను అరెస్టు చేసి, స్టేషన్ బెయిల్ ఇచ్చామని తెలిపారు.

మహిళలు, చిన్నారులపై నేరాల్లో శిక్షలు ఇక కఠినతరం

» అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ



ఏర్పేడు, జూలై 5: మహిళలు, చిన్న పిల్లలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు కేంద్రం ప్రత్యేక చట్టాలను తీసుకు వచ్చిందని అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ తెలిపారు. ఈ కేసుల్లో శిక్షలను కేంద్ర ప్రభుత్వం మరింత కఠినతరం చేసిందన్నారు. ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై అవగాహన కల్పించేందుకు తిరుపతి సమీపంలోని ఐఐటీలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

జగన్ పాపాలు వెంటాడుతున్నాయి

అవి రైతుల పాలిట శాపాలుగా మారాయి



» అసమర్థ పాలనతో సాగునీటి ప్రాజెక్టులు 20ఏళ్లు వెనక్కి

» ఖరీఫ్‌లో అవాంతరాలు లేకుండా సాగు నీరు అందిస్తాం: మంత్రి నిమ్మల

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో శివారు భూములకు కూడా సాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టుల నిర్వహణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పులిచింతల ప్రాజెక్టులో తగిన స్థాయిలో నీటినిల్వలు లేకపోవడం, పట్టిసీమ ప్రాజెక్టును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన కారణంగా ఇప్పుడు కృష్ణాడెల్టాలో తాగునీటి సమస్య తలెత్తిందని చెప్పారు. పట్టిసీమలో ప్రస్తుతం 15 పంపులు పనిచేస్తున్నాయని, మూడు నాలుగు రోజుల్లో 21 పంపులు పనిచేస్తాయని చెప్పారు. రెండు మూడు రోజుల్లో పట్టిసీమ నీరు కృష్ణాడెల్టాకు చేరే అవకాశం ఉందని, ఈ నీటితో కృష్ణా డెల్టా ప్రజల దాహార్తిని తీరుస్తామని మంత్రి పేర్కొన్నారు. జగన్ నిర్వాకంతో కృష్ణాడెల్టాకు తాగునీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాఖ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించామని తెలిపారు. పెద్దఎత్తున వరద నీరు ప్రాజెక్టులకు వస్తోందని గేట్లు, లాకుల వద్ద భద్రత ముఖ్యమని సూచించారు.

సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

విభజన కంటే ఐదేళ్ల జగన్ పాలనలోనే రాష్ట్రం ఎక్కువగా నష్టపోయిందని నిమ్మల ఆరోపించారు. జగన్ ప్రభుత్వం చేసిన పాపాలు తమను వెంటాడుతున్నాయని, అవి రైతుల పాలిట శాపాలుగా మారాయని నిమ్మల మండిపడ్డారు. జగన్ పాలనలో అనేక ప్రాజెక్టులు నిరుపయోగంగా మారాయని, పంపుసెట్లకు కనీసం గ్రీజ్ కూడా పెట్టలేదన్నారు. సాగునీటి వ్యవస్థను గత ప్రభుత్వం అస్తవ్యస్తంగా మార్చిందని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వ నిర్వాకంతోనే కృష్ణాడెల్టాలో తాగునీటి సమస్య వచ్చిందని, ఈ పరిస్థితికి జగన్ బాధ్యత వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. జగన్ హయాంలో జల వనరుల శాఖ బాగా నష్టపోయిందని, అసమర్థ పాలనతో సాగునీటి ప్రాజెక్టులు 20ఏళ్లు వెనక్కి వెళ్లాయని ఆరోపించారు. 'పులిచింతలలో గతంలో 40 టీఎంసీల నిల్వ ఉంచుకుని వాడుకునే వాళ్లం. ప్రస్తుతం అందులో అర టీఎంసీ నీరు కూడా లేదు. గత ఐదేళ్లుగా నిర్వహణ సరిగా లేక పట్టిసీమ మోటార్లు సరిగ్గా పని చేయడంలేదు. గత ప్రభుత్వంలో కాల్వగట్లకు వేసిన గ్రావెల్‌ను తవ్వేశారన్నారు. గట్లను పటిష్ఠం చేయాలని, గండ్లు పడకుండా చూడాలని ఆదేశించాం. పెండింగ్ ప్రాజెక్టుల పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేస్తాం. పోలవరం ప్రాజెక్టు భద్రత ముఖ్యం కాబట్టి కొత్త డయాఫ్రం వాల్ కట్టాలని దాదాపు నిర్ణయించాం. డయా ఫ్రం వాల్‌కు రిపేర్లు చేయవచ్చనే ప్రతిపాదనలనూ పరిశీలిస్తున్నాం. కొత్తది నిర్మించాలా లేదా అనేదానిపై విదేశీ నిపుణులు నెల రోజుల్లో నివేదిక ఇస్తారు. ప్రస్తుతం 3-4 వందల క్యూసెక్కుల సీపేజ్ వస్తోంది, అందుకే కొత్తది నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. పీపీఏ, జలశక్తిశాఖ పూర్తిగా దీన్ని అధ్యయనం చేశాకే తదుపరి కార్యాచరణ ఉంటుంది' అని మంత్రి స్పష్టం చేశారు.

జగన్ వ్యాఖ్యలపై ఈసీ చర్యలు తీసుకోవాలి

ఈవీఎంలు బద్దలు కొట్టడం తప్పుకాదని మాజీ సీఎం జగన్ మాట్లాడడం దారుణమని మంత్రి నిమ్మల మండిపడ్డారు. ఇటువంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడమేనని, ఆయన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోకుండా ప్రజలనే జగన్ తప్పుపడుతున్నారని, ఆయన ఇలాగే ఉంటే మొన్న మూడంకెల్లో రెండే మిగిలాయని, భవిష్యత్తులో రెండు నుంచి ఒక సంఖ్య మాత్రమే మిగులుతుందని అని నిమ్మల ఎద్దేవా చేశారు.

మీ నిర్వాకంతోనే 'అన్నమయ్య' కొట్టుకుపోయింది

» జలవనరుల శాఖ ఇంజనీర్లపై మంత్రి నిమ్మల ఆగ్రహం

'మీ నిర్వాకం.. అలక్ష్యం వల్లే అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది' అని జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులపై మంత్రి నిమ్మల రామానాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖరీఫ్‌కు సాగునీటిని అందించేందుకు శుక్రవారం వెలగపూడి సచివాలయంలో చీఫ్ ఇంజనీర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య డ్యామ్ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఆ సమయంలో అక్కడి చీఫ్ ఇంజనీరు ఎవరని మంత్రి నిలదీశారు. డ్యామ్ నిండిపోయినా కింద వైసీపీ నేతలు ఇసుక తవ్వుతూ లారీల్లోకి ఎక్కిస్తుంటే గేట్లు ఎత్తకుండా జాప్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ పొక్లెయిన్‌లను, ట్రాక్టర్లను కాపాడేందుకు ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రాజెక్టు కొట్టుకుపోయి వరదలో చిక్కుకొని 34 మంది ప్రాణాలు కోల్పోయారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎగువ నుంచి క్యూసెక్కుల వారీగా వరద వేగాన్ని గుర్తించే వీలుందని, అయినా అన్నమయ్య డ్యామ్ విషయంలో ఇలాంటి లెక్కలను ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ప్రాజెక్టులకు మరమ్మతులు కూడా చేయలేదని కనీసం గ్రీజు రాసి మెయింటెనెన్స్ కూడా చేయనందుకే పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు తెగిపోయాయని నిమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వహణకూ అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఇంజనీర్లకు మంత్రి సూచించారు. నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ గేట్ల యాజమాన్య నిర్వహణపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. పట్టిసీమ పంప్ లీకేజీపై యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ పనులు ఐదు గంటలలోనే పూర్తిచేయడంతో ఇంజనీర్లను ఆయన అభినందించారు.

శ్రీవారి నగలపై హైకోర్టు జడ్జితో విచారణ చేపట్టాలి

» బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

తిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి నగల భద్రతపై భక్తుల్లో అనుమానాలున్నాయని, వీటిపై హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి కోరారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ల జగన్ ప్రభుత్వంలో ధార్మికక్షేత్రమైన తిరుమలను అధర్మానికి నిలయంగా చేశారని ఆరోపించారు. ప్రసాదాలు, గదులు, దర్శన టికెట్లు, ఇంజనీరింగ్ పనుల్లో రూ.వందల కోట్ల రూపాయలను కమీషన్ల పేరిట దండుకున్నారంటూ భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఇంజనీరింగ్ పనుల్లో 10 నుంచి 15 శాతం కమీషన్లు తీసుకున్నారని, అయినా టీటీడీ విజిలెన్స్ ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఎస్పీ స్థాయి అధికారి ఉండి కూడా ఎందుకు మౌనంగా ఉన్నారు, ఎవరు మౌనంగా ఉండమన్నారని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఎందుకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదన్నారు. గతంలో జరిగిన అవినీతి, అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ విచారణ జరుగుతోందని, కానీ వారికి అధికారుల నుంచి సహకారం అందలేదని సమాచారముందన్నారు. త్వరలో సీఎంను కలిసి వీటన్నింటినీ వివరిస్తామని చెప్పారు. గతంలో శ్రీవారి ఆభరణాలపై వాద్వా, జస్టిస్ జగన్నాథ కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి రిపోర్టులు ఇచ్చాయని, మళ్లీ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో శ్రీవారి ఆభరణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి భక్తుల్లో కలిగిన అనుమానాలను తొలగించాలని కోరారు.

పట్టిసీమ వాల్వ్ లీక్.. అడ్డుకట్ట

» నారుమళ్లను ముంచెత్తిన గోదావరి జలాలు

» తక్షణమే స్పందించిన అధికారులు.. రైతులకు ఊరట




పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నుంచి విడుదలవుతున్న జలాలు, ఫౌంటెయిన్‌లా ఎగిసిపడుతున్న పైపు లీకేజీ

పోలవరం, జూలై 5: ఏలూరు జిల్లాలో పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి రెండు కిలోమీటర్ల దూరంలో పంట పొలాల సమీపంలో శుక్రవారం ఉదయం పైపులైన్లకు ఏర్పాటుచేసిన ఎయిర్ వాల్వ్ ప్లేట్ ఊడి గోదావరి జలాలు ఫౌంటెయిన్‌లా 30 అడుగుల ఎత్తున ఎగజిమ్మాయి. నీరంతా చుట్టుపక్కల వరి ఆకుమడులను ముంచెత్తుతుండడంతో రైతులు అధికారులకు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన పట్టిసీమ ఎత్తిపోతల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పెద్దిరాజు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకూ సిబ్బందితో అవిశ్రాంతంగా కష్టపడి సమస్యను పరిష్కరించి నీటి పంపిణీని పునరుద్ధరించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ రైతులు తమ సాగునీటి అవసరాల కోసం పంపులకు పలుచోట్ల ఏర్పాటుచేసిన ఎయిర్ వాల్వ్ ప్లేట్లకు ఉన్న బోల్టులు ఊడదీసి నీటిని వాడుకుంటున్నారని, ఆ క్రమంలో ఊడదీసిన ప్లేటు బోల్టులు బిగించకపోవడంతో మోటార్ల నీటి ఒత్తిడికి ప్లేటు పూర్తిగా ఊడిపోయి ఇలాంటి పరిస్థితి నెలకొందని, సమస్యను పూర్తిగా పరిష్కరించామని తెలిపారు. రైతులు ఎయిర్ వాల్వ్ బోల్టులు ఊడదీయరాదని, నీటి ఒత్తిడికి ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు.

పట్టిసీమ నుంచి 5,310 వేల క్యూసెక్కుల జలాలు

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 5,310 వేల క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల చేసినట్లు పెద్దిరాజు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో పట్టిసీమ వద్ద గోదావరి నీటిమట్టం 14,751 మీటర్లు నమోదయ్యిందని, ఈ నెల 3న 0.1262 టీఎంసీలు, 4న 0.2574 టీఎంసీల నీటిని విడుదల చేశామని చెప్పారు.

నేతల పనితీరుకు క్యాడర్ సర్టిఫికెట్!

» వారి నుంచే అభిప్రాయ సేకరణ

» ఎన్నికల వేళ ఎవరెలా పనిచేశారో తెలుసుకునే ప్రయత్నంలో టీడీపీ

» దాని ఆధారంగానే నామినేటెడ్ పదవులు

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కింది స్థాయిలో ఏ నాయకులు ఎలా పనిచేశారన్న విషయంపై క్యాడర్ నుంచే అభిప్రాయ సేకరణ జరపాలని టీడీపీ నాయకత్వం నిర్ణయించింది. రాష్ట్ర పార్టీలో సభ్యులుగా ఉన్న సుమారు 35 లక్షల మంది నుంచి ఈ సమాచారం సేకరించాలని భావించింది. పార్టీ నేతలకు పదవులు ఇచ్చే ముందు ఇటీవలి ఎన్నికల్లో వారి పనితీరు ఎలా ఉందో క్యాడర్ అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత పార్టీ అభ్యర్థుల నుంచి సవివర నివేదికలు తెప్పించారు. ప్రత్యేకించి గ్రామ, యూనిట్, క్లస్టర్, మండల స్థాయి నాయకులకు సంబంధించి ఎవరు బాగా పనిచేశారు? ఎవరు పనిచేయలేదు? అనే కీలక విషయాలను ఈ నివేదికల ద్వారా సేకరించారు. దీంతోపాటు ఇతరత్రా వివిధ మార్గాల ద్వారా మరికొంత సమాచారం కూడా సేకరించారు. ఈ సమాచారాన్ని క్యాడర్ నుంచి తీసుకునే అభిప్రాయ సేకరణ ద్వారా సరిపోల్చుకోవాలని నిర్ణయించారు. పార్టీ సభ్యులుగా నమోదైన వారి ఫోన్లకు గూగుల్ ఫారాల ద్వారా కేంద్ర కార్యాలయం నుంచి కొంత సమాచారం పంపిస్తున్నారు. వారి ప్రాంతంలో ఇటీవలి ఎన్నికల్లో బాగా పనిచేసినట్లు తమ వద్ద ఉన్న నాయకుల పేర్లు అందులో సూచిస్తున్నారు. వీటిలో బాగా పనిచేసిన నాయకుడిని గుర్తించాలని సూచిస్తున్నారు. ఇతర నాయకుల పేర్లు అనే కాలం కింద మిగిలిన నాయకుల పేర్లు రాయాలని పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా పార్టీ సభ్యులకు ఈ సమాచారం పంపిస్తున్నారు. ప్రతిస్పందన బాగానే ఉందని, సభ్యుల్లో అనేక మంది ఆ ఫారాలు నింపి పంపిస్తున్నారని టీడీపీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి. "పార్టీ, నామినేటెడ్ పదవుల భర్తీలో ఇప్పటిదాకా నాయకుల సిఫారసులకే ప్రాధాన్యం ఉంటోంది. ఇకపై దాంతోపాటు పార్టీ సభ్యుల ఫీడ్ బ్యాక్ కూడా కీలక పాత్ర వహించబోతోంది. పార్టీ సభ్యుల నుంచి ఏ మేరకు సమాచారం వస్తుంది. ఎంత మంది స్పందిస్తారో కూడా చూడాల్సి ఉంది" అని ఈ కసరత్తులో పాల్గొన్న నేత ఒకరు తెలిపారు.

రాక్షస పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి

» వరసిద్ధుడిని దర్శించుకున్న తుళ్లూరు రైతులు



కాణిపాకం వరసిద్ధుడి ఆలయం వద్ద తుళ్లూరు రైతులు

వైసీపీ రాక్షస పాలన నుంచి రాష్ట్రం విముక్తి పొందిందని రాజధాని ప్రాంతమైన తుళ్లూరు రైతులు అన్నారు. శుక్రవారం సుమారు 150 మంది రైతులు చిత్తూరు జిల్లాలోని కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ప్రజల నిర్ణయంతో రాష్ట్రంలో చీకటి పోయి చంద్రుడి వెలుగులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. - ఐరాల

'ఇంటర్వ్యూల' వెనుక ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలని ఆదేశించారా? లేక తాడేపల్లి ప్యాలెస్‌లో 'మనోళ్ల' కోసం అంటూ ఇంకెవరైనా వాటిని తీసుకొచ్చారా? ఒకవేళ జగన్‌కు తెలియకుండానే పునరుద్ధరించారు అనుకుంటే జీవో జారీ చేశాక అయినా ఎందుకు స్పందించలేదు? అక్రమాలు అన్న ఆయనే చూస్తూ మౌనంగా ఎందుకు ఉండిపోయారు? ఇలా లెక్కలేనన్ని ప్రశ్నలు గ్రూప్-1 ఇంటర్వ్యూల చుట్టూ తిరుగుతున్నాయి. విచిత్రం ఏంటంటే ఇంటర్వ్యూలు పునరుద్ధరించిన రోజే ప్రభుత్వం 2022 గ్రూప్-1 నోటిఫికేషన్ జారీచేసింది. అంటే పక్కా ప్లాన్ ప్రకారమే ఇంటర్వ్యూలను ఆనాడు తిరిగి తీసుకొచ్చారని అర్థమవుతోంది.

సవాంగ్ తడబాటు

రద్దు చేసిన ఇంటర్వ్యూలు ఎందుకు తీసుకొచ్చారని అప్పట్లో ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతం సవాంగ్‌ను ప్రశ్నించగా, ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయారు. ఒక సందర్భంలో దేశమంతా ఇంటర్వ్యూల విధానం ఉందని, ఇంటర్వ్యూలు లేకుండా గ్రూప్-1 లాంటి కీలకమైన ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయలేమని చెప్పారు. మరో సందర్భంలో అది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అని, దానిపై తాను వ్యాఖ్యానించలేనని తెలిపారు. అంటే...ఇందులో ప్రభుత్వ పెద్దల ప్రమేయం ఉందని పరోక్షంగా ఆయన చెప్పారన్నమాట. కానీ మీడియా సమావేశాల్లో దీనిపై మాట్లాడేందుకు ఆయన ఆసక్తి చూపించేవారు కాదు. వివాదాస్పద నిర్ణయం కావడంతో ఏం మాట్లాడితే ఏం జరుగుతుందోనని విషయాన్ని దాటవేసేవారు.

మార్కులపై గప్‌చుప్

ఏపీపీఎస్సీ చైర్మన్ పోస్టుకు రాజీనామా చేసిన సవాంగ్ శుక్రవారం కూడా కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగులు ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. అయితే ఇంటర్వ్యూల్లో మార్కుల వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' సవివరంగా ప్రచురించినా సవాంగ్ సహా అధికారులంతా గప్‌చుప్ అయిపోయారు. కనీసం దానిపై వివరణ ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేకపోయారు. ఏపీపీఎస్సీ చరిత్రలోనే అత్యధిక స్థాయిలో 99 శాతం మార్కులు వేయడంతో దానిపై సమర్థించుకునే వీల్లేకుండా పోయింది. అందులోనూ సవాంగ్ వద్ద పనిచేసిన వ్యక్తికే ఏకంగా 74.5 మార్కులు (మొత్తం మార్కులు 75) వేసినా ఎందుకు వేయాల్సి వచ్చిందో ఆయన చెప్పలేదు. ఈ వ్యవహారం ఎవరి మెడకు చుట్టుకుంటుందోనన్న ఆందోళన ఏపీపీఎస్సీ అధికారుల్లో మొదలైంది.

రహస్య జోన్‌లోకి...

వైసీపీ ప్రభుత్వంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం 'రహస్య జోన్'లోకి వెళ్లిపోయింది. అక్కడ ఏం జరుగుతుందనేది మరెవరికీ తెలియకుండా అప్పటి ప్రభుత్వం కట్టుదిట్టమైన సెక్యూరిటీని ఏర్పాటుచేసింది. మొదట్లోనే సచివాలయాల ఉద్యోగాల వ్యవహారంలో అక్రమాలు జరగడం, దానిని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో కమిషన్ అప్రతిష్ఠపాలైంది. ఆ తర్వాత కమిషన్‌కు చైర్మన్ అయిన గౌతం సవాంగ్.. కమిషన్ కార్యాలయాన్ని పూర్తిగా పోలీసుల అధీనంలోకి తీసుకెళ్లారు. నిరుద్యోగులు, అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు ఎవరూ అటువైపు రాకుండా చర్యలు తీసుకున్నారు. ఇంత పక్కాగా రహస్య చర్యలు తీసుకోవడంతో 2018 గ్రూప్-1 మెయిన్స్‌లో జరిగిన అక్రమాలు హైకోర్టుకు వెళ్లేవరకూ బయటకు రాలేదు. గ్రూప్-1 ప్రశ్నాపత్రాలను గుంటూరు హాయ్‌ల్యాండ్ రిసార్ట్‌లో మూల్యాంకనం చేయించి, ఆ విషయాన్ని న్యాయస్థానంలో దాచిపెట్టి ఏపీపీఎస్సీ అడ్డంగా దొరికిపోయింది.

గుడ్లు, చిక్కీల్లో నాణ్యత ఉండాలి

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు ఇచ్చే గుడ్లు, చిక్కీల్లో నాణ్యత ఉండాలని, ఎక్కడైనా పాడైనవి సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మధ్యాహ్న భోజనంపై శుక్రవారం అధికారులతో సమీక్షించారు. నాణ్యత పరిశీలనకు క్వాలిటీ చెకింగ్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్కడా సరఫరాలో అవాంతరాలు ఉండకూడదని, పెండింగ్ బిల్లులు త్వరలో చెల్లిస్తామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సునాక్ నిష్క్రమణ

బ్రిటన్‌లో 'మార్పు' తీవ్రంగా దూసుకువచ్చింది. పద్నాలుగేళ్లుగా అధికారంలో ఉంటూ, ప్రజల వ్యతిరేకతను అపారంగా పోగేసుకున్న కన్సర్వేటివ్ (టోరీ) పార్టీ గురువారం జరిగిన సాధారణ ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయింది. రెండు తరాల కింద మాత్రమే తరలివెళ్లిన, భారతీయ మూలాలున్న రిషి సునాక్ ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. ఘనవిజయం సాధించిన లేబర్ పార్టీ నాయకుడు కీర్ స్టార్మర్ నూతన ప్రధానిగా నియమితులయ్యారు. ప్రభుత్వ పతనం ఊహించిందే అయినా, ఈ ప్రభంజనం మాత్రం ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. భారతదేశానికి, ప్రపంచానికి ఈ పరిణామం అనేక ప్రభావాలను కలిగించబోతోంది.

భారత్ ఎన్నికలలో 'చార్ సౌ పార్' లాగానే, బ్రిటన్ ఎన్నికలలో లేబర్ పార్టీ 'సూపర్ మెజారిటీ' నినాదం ఇచ్చింది. నిజానికి, అక్కడ ఎంత పెద్ద నిర్ణయాలకైనా సాధారణ మెజారిటీ చాలు. కన్సర్వేటివ్ పార్టీ కూడా లేబర్ సూపర్ మెజారిటీకి వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఇండియాలో నినాదం సఫలం కాలేదు కానీ, బ్రిటన్‌లో స్టార్మర్ మూడింట రెండు వంతుల సంఖ్యకు దగ్గరగా ఘనవిజయం సాధించారు. 650 మంది సభ్యులుండే బ్రిటన్ దిగువ సభలో లేబర్ పార్టీ 412 స్థానాలు సంపాదించింది. ఇది గత సభ కంటె 214 అధికం. కన్సర్వేటివ్ పార్టీ కేవలం 121 స్థానాల్లోనే గెలుపొందింది. గత ఎన్నికలలో సాధించిన విజయాల కంటె ఇది 251 తక్కువ.

అంకెలలో కనిపిస్తున్న విజయాలను బట్టి, బ్రిటన్ పరిణామాన్ని అర్థం చేసుకోలేము. ఇది లేబర్ పార్టీ విజయం కాదని, టోరీల పరాజయమనీ ముందు తెలుసుకోవాలి. కన్సర్వేటివ్ పార్టీ గత ఎన్నికలలో సాధించిన ఓట్ల కంటె 20 శాతం నష్టపోయి, ప్రస్తుతం కేవలం 24 శాతం ఓట్లతో మిగిలింది. కానీ, లేబర్ పార్టీ అన్ని సీట్లు అదనంగా గెలుచుకున్నప్పటికీ, గత ఎన్నికల కంటె కేవలం అదనంగా పొందింది 2 శాతం కంటె తక్కువ ఓట్లే! యూరోపియన్ యూనియన్ నుంచి ఎటువంటి ఒప్పందమూ లేకుండా వైదొలగాలని వాదించి వెలుగులోకి వచ్చిన తీవ్ర మితవాద పార్టీ 'రిఫామ్ యుకె' ఈ ఎన్నికల్లో కేవలం నాలుగు సీట్లు మాత్రమే సాధించింది. అయినప్పటికీ అది చిన్న విజయమేమీ కాదు, పెద్ద ప్రమాదం దాగి ఉన్న విజయం కూడా. గత ఎన్నికల్లో కేవలం 1.7 శాతం ఓట్లు సంపాదించుకున్న ఈ పార్టీ ఈ సారి 14 శాతం ఓట్లు పొందింది. కన్సర్వేటివ్ పార్టీలోని అతిమితవాదులు ఈ పార్టీ వైపు ఆకర్షితులయినట్టు తెలుస్తోంది. ఫాసిస్టు పోకడలున్న 'రిఫామ్ యుకె' నేత నైజిల్ ఫరాజ్ మొదటిసారి పార్లమెంటులోకి అడుగుపెట్టబోతున్నాడు. కన్సర్వేటివ్ పార్టీలో ఉదారవాదం వైపు మొగ్గుచూపే వారు ఈసారి లిబరల్ డెమొక్రటిక్ పార్టీ వైపు మొగ్గినట్టు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కేవలం 8 సీట్లున్న ఈ పార్టీ ఇప్పుడు 71 స్థానాల్లో గెలిచింది. పాలస్తీనాకు అనుకూలంగా నిలబడిన ఐదుగురు స్వతంత్ర సభ్యులు కూడా ఈ ఎన్నికల్లో గెలిచారు. కన్సర్వేటివ్ ఓట్లు చెల్లా చెదురయినట్టు, లేబర్ పార్టీకి కొత్తగా ఓట్లు పెద్దగా రానట్టు కనిపిస్తున్న ఈ ఎన్నికల్లో ఫలితాలు ఇట్లా ఎందుకు వచ్చాయన్న సందేహం కలుగుతుంది. లేబర్ పార్టీ తాను గెలవడానికి అవసరమైన ఓటింగ్ మీదనే ఆయా నియోజకవర్గాలలో గురిపెట్టిందని, అందువల్ల, తన ప్రయత్నాన్ని ఎక్కువ స్థానాల్లో సమానంగా విస్తరించ గలిగిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఎక్కువ ఓటింగ్ శాతం ఉండి, తక్కువ స్థానాలు పొందిన పార్టీల ఓట్లు కొన్ని నియోజకవర్గాలలో కేంద్రీకృతమైనట్టు అర్థం చేసుకోవాలి. నాలుగు స్థానాల్లో మాత్రమే గెలిచిన రిఫామ్ యుకె పార్టీ ప్రభావం అనేక నియోజకవర్గాల్లో విస్తరించింది. బ్రిటన్‌లోని మైనారిటీలు, పూర్వ వలసల నుంచి వచ్చి స్థిరపడినవారు, కొత్తగా వలసవచ్చినవారు, ఆర్థికంగా అణగారినవారు ఈ తీవ్రమితవాద పార్టీ ప్రభావం పెరగడం మీద ఆందోళనగా ఉన్నారు.

ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, అశాంతితో పద్నాలుగేళ్లుగా కునారిల్లుతున్న బ్రిటన్ పౌరులు, తమ నిర్ణయాన్ని స్పష్టంగా, కఠినంగా చెప్పారు. "మీ ఆగ్రహం నాకు తెలుస్తోంది" అని సునాక్ తన వీడ్కోలు ప్రసంగంలో అన్నమాట, ప్రజానిర్ణయం వెనుక కారణాలను అంగీకరించడమే. ఎంతో గంభీరంగా, ఉదాత్తంగా సునాక్ చేసిన ప్రసంగం, అక్కడి వ్యాఖ్యాతలు అవహేళన చేస్తున్నా, భారతీయ ప్రజాస్వామిక విలువల నుంచి చూస్తే, విశేషమే అనిపిస్తుంది. నిజానికి, ఓటమికి కారణం సునాక్ 20 నెలల పాలన కాదు. విశ్వసనీయత కోల్పోతున్న ప్రభుత్వాన్ని నిలబెట్టాలని ఆయన ఏదో ప్రయత్నం చేశారు. కానీ, అది ఒకరి సదుద్దేశాలతో బాగుపడే సంక్షోభం కాదు. అంతకు ముందు కంటె, కన్సర్వేటివ్‌లు అధికారం చేపట్టిన 2010 కంటె పరిస్థితి మెరుగ్గానే ఉందని సునాక్ చెప్పుకున్నారు కానీ, అటువంటి సమర్థనలు అనవసరం.


మధ్యేవాద, ఉదారవాద లక్షణాలున్న లేబర్ పార్టీకి భారతదేశ విధానాలతో కొన్ని సమస్యలున్నాయి. ఇటీవలిదాకా, ఆ పార్టీ కశ్మీర్ స్వయంనిర్ణయాధికార హక్కుని సమర్థించేది. ఈ మధ్యే స్టార్మర్ కశ్మీర్ సమస్య భారత్ పాక్‌ల మధ్య తేలవలసినదని, అంతర్గత సమస్యలను భారత్ ప్రజాస్వామ్యం పరిష్కరించుకోగలదని వ్యాఖ్యానించి, వైఖరిలో మార్పును సూచించారు. ఉక్రెయిన్ యుద్ధం వంటి అంశాలు అంతర్జాతీయంగాను, భారత్‌తో సంబంధాల విషయంలోను అవరోధంగా ఉండేవే. ఈ ఎన్నికల్లో గర్భితమై ఉన్న ప్రజాభిప్రాయాన్ని అర్థం చేసుకుని, బ్రిటన్‌ను సమస్యల నుంచి లేబర్ ప్రభుత్వం గట్టెక్కించగలదని ఆశించాలి.

చంద్రబాబు ఎందుకు గెలిచారు?

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే తిరిగి అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతో పాటు అసలు అరాచక పాలనకు అంతమొందించాలనే నిశ్చయం ప్రజలలో స్పష్టంగా కనిపించింది. జగన్మోహన్‌రెడ్డి పులివెందుల, బెంగుళూరులో జగన్ నివాసాల వద్ద ఆయన పార్టీకి చెందిన కార్యకర్తలే నిరసన తెలపడమే అందుకు నిదర్శనం. పార్టీ కార్యకర్తలు, శాసనసభ్యులు, మంత్రులు జుగుప్సాకరంగా మాట్లాడుతుంటే ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి నివారించకపోగా ముసిముసిగా నవ్వడం వంటి దృశ్యాలు సామాన్య ప్రజలలో వైసీపీ పట్ల, జగన్ పట్ల ప్రజలలో విముఖతను పెంచాయి.

ఓటమి అనంతరం విలేఖరులతో మాట్లాడిన జగన్ అవ్వాతాతలకు ఇచ్చిన పింఛన్లు ఏమయ్యాయి, అమ్మ ఒడి, జగన్న ఆసరా ఏమైంది! నేను ప్రతి నెల బటన్ నొక్కానే... నాకు ఎందుకు ప్రజలు బటన్ నొక్కలేదు అని ఆవేదన చెందారు. బటన్ నొక్కుడు కంటే పెరిగిన నిత్యావసర ధరలు, విద్యుత్ ధరలు, ఇంటి పన్నులు, పొరుగు రాష్ట్రాల కంటే అధిక పెట్రోల్ ధరలతో పాటు రోడ్లపై నడుస్తున్న, ప్రయాణిస్తున్న ప్రతిసారి జగన్ పాలన దుర్మార్గాన్ని సామాన్య ప్రజలకు రహదారులు గుర్తుచేశాయి.

తెలుగుదేశం పార్టీకి ప్రజలు ఓటు వేయడానికి మూడు అంశాలు ప్రధాన కారణం. ఇందులో మొదటిది– రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించగల సత్తా చంద్రబాబుకే వుందని ప్రజల విశ్వసించడం. రెండవది– జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల ప్రజలకు పూర్తిగా విశ్వాసం తగ్గిపోవడం. మూడవది– జగన్ ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన ధరలు, పన్నులతో ప్రజల జీవనం దుర్భరమవడం.



రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించగల సత్తా చంద్రబాబుకే ఉందని ప్రజలు విశ్వసించడం, జగన్మోహన్‌రెడ్డి పాలన పట్ల విముఖత, వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన ధరలు, పన్నులతో సామాన్యుల జీవనం దుర్భరమవడం... ఈ మూడు కారణాలు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి విజయానికి విశేషంగా దోహదం చేశాయి.

మొదటి విషయానికి వస్తే– ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ అభివృద్ధి విషయంలో చంద్రబాబు కృషిని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. రాష్ట్ర విభజనప్పుడు హైదరాబాద్ తమది కాదనే భావన ఆంధ్రులను తీవ్రంగా బాధించింది. తాము కోల్పోయిన హైదరాబాద్ నగరానికి దీటుగా అమరావతి అభివృద్ధి చెందుతుందని ప్రజలు మొదటి సారి చంద్రబాబును ఎన్నుకొన్నారు. అయితే తనకు ఒకసారి అవకాశం ఇవ్వాలంటూ ప్రజలను వేడుకున్న జగన్‌కు అవకాశం ఇస్తే బాగుంటుందనే భావనతో రెండో పర్యాయం ఆయనకు అధికారం ఇచ్చారు. కానీ అందుకు విరుద్ధంగా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి స్వీకరించిన వెంటనే నూతన సెక్రటేరియట్‌కు సమీపంలో రాజధాని అమరావతికి ప్రతీకగా వున్న ప్రజావేదికను కూల్చివేశారు. గడచిన ఐదేళ్ల కాలంలో కూల్చివేతలు, ధ్వంసం చేయడం మినహా ఒక్క నిర్మాణం కూడా జరగలేదు. ఈ అనుభవం నేపథ్యంలో తాము ఎంత పెద్ద తప్పుచేశామో తెలుసుకున్న ప్రజలు హైదరాబాద్ తరహాలో నూతన రాజధాని నగరాన్ని అభివృద్ధి చేయగలిగిన సత్తా తెలుగుదేశం పార్టీకి, ఆ పార్టీ అధ్యక్షునికి మాత్రమే ఉందని నమ్మి అధికారం కట్టబెటారు.

రెండో విషయానికి వస్తే– విశ్వసనీయత తమకే సొంతమనే తరహాలో జగన్ స్వయంగా చెప్పడమే కాకుండా అనుచరులతో ప్రచారం చేసుకొన్నారు. ఒక్కసారి అవకాశం ఇస్తే మీ జీవితాలలో మార్పు తీసుకువస్తానంటూ నమ్మబలికారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ వ్యవహరించిన తీరు అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ప్రతిపక్షాల పరిస్థితి ఎలా ఉన్నా సొంత కుటుంబానికి చెందిన చెల్లెళ్లు జగన్‌కి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. జగన్ ప్రవర్తన, అహంకార ధోరణితో పాటు ప్రభుత్వంలోని కొంతమంది శాసనసభ్యులు, మంత్రుల ప్రవర్తన కారణంగానే ఘోరంగా ఓటమికి గురికావలసి వచ్చిందని వైసీపీ అభిమానులు, కార్యకర్తలు భావించారు. అందుకే జగన్ పర్యటన సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు.

ఇక మూడో అంశానికి వస్తే– చంద్రబాబు విజయానికి మరో కీలకమైన విషయం ఓటర్ల చైతన్యంపై జరిగిన ప్రచారం. గతంలో ఎన్నడూ జరగని స్థాయిలో కొత్త ఓటర్ల నమోదు, ఓటు హక్కు వినియోగం గురించి తీవ్రస్థాయిలో ప్రచారం జరిగింది. దాంతో దేశవ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మంది కొత్తగా ఓటర్లు చేరడమే కాకుండా పోలింగ్‌లో కూడా విస్తృతంగా పాల్గొన్నారు. కొత్త ఓటర్లుగా చేరిన వారందరూ యువతీ యువకులు కావడంతో వారి దృష్టి అంతా కెరియర్, అభివృద్ధిపై ఉంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి చంద్రబాబు కారణమనే భావన ఉండటం, రేపు కొత్త రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయగల సామర్థ్యం అయనకే ఉన్నదనే విశ్వాసంతో కొత్త ఓటర్లలో అత్యధికులు తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమికి ఓటు వేశారు.

ఈ ఎన్నికల్లో మతతత్వ పార్టీగా పేరుపొందిన బీజేపీతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకోవడం నష్టం కలిగిస్తుందని కొంతమంది విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. సీట్ల కేటాయింపు సమయంలో ఇబ్బందులు ఏర్పడిన నేపథ్యంలో బీజేపీతో పొత్తు అనవసరం అనే భావన టీడీపీ కార్యకర్తల్లో కూడా వ్యక్తమైంది. బీజేపీతో పొత్తు విషయమే కాకుండా పవన్ కళ్యాణ్ మద్దతు విషయంలో కూడా చంద్రబాబు ఒక మెట్టు దిగారనే అభిప్రాయం వ్యక్తమైంది. బీజేపీతో పొత్తు వల్ల మైనారిటీలు దూరమవుతారని టీడీపీ కార్యకర్తలు ఆందోళన చెందారు. కానీ ఆచరణ విషయానికి వస్తే ఓటర్లు కుల మతాలకు అతీతంగా అరాచక పాలనను తుదముట్టించాలన్న ఏకైక లక్ష్యంతో ఓటు వేశారు.

ఇదే సమయంలో ఓటింగ్ సరళి, గెలిచిన అభ్యర్థులకు లభించిన మెజారిటీలను బట్టి మూడు పార్టీల కూటమిని ప్రజలు ఆమోదించారని స్పష్టమైంది. ఈ కారణంగానే శాసనసభ్యుల విషయంలో క్రాస్ ఓటింగ్ జరగలేదు. తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతాపార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు మనస్ఫూర్తిగా కూటమి అభ్యర్థులకు ఓటు చేశారు. పవన్‌తో పొత్తు వల్ల కాపు సామాజికవర్గానికి చెందిన యువత తెలుగుదేశం పార్టీకి దగ్గరయ్యారనే అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఇటువంటి అనేక అంశాలకు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అద్దంపట్టాయి.

● అన్నవరపు బ్రహ్మయ్య

రాబోయే ఐదేళ్లూ ఆ పదేళ్ల పాలనే!

కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు నా అనుమానాలను ధ్రువీకరించాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సంబంధించినంతవరకు ఏమీ మారలేదు సుమా! బహుశా ఏదీ మారబోదు కూడా. ఇది సందేహాతీతం. ఇందుకు స్పష్టమైన సూచనలు ఇప్పటికే కనిపించాయి (జూన్ 29న ఇదే కాలమ్‌లో వచ్చిన 'మార్పు మిథ్య, మోదీయే సత్యం!' మరొక మారు చదవండి). ఎన్నికలకు పూర్వం ప్రభుత్వ సాఫల్యాలపై వక్కాణింపులు, బడాయి మాటలు, విధానాలు, కార్యక్రమాలు, పాలనా శైలి, ప్రభుత్వ నడవడి, ప్రతీకార ధోరణులు మొదలైనవాటిని సమర్థించాలని, పునరుద్ఘాటించాలని, కొనసాగించాలని నరేంద్ర మోదీ దృఢంగా ఆదేశించారు మరి.



■ పి. చిదంబరం

'పళని' పలుకు


విషాదమేమిటంటే పార్లమెంటు ఉభయ సభలలో కూడా మోదీ ఆదేశం ప్రభావం కనిపిస్తోంది. ఉత్తమ పార్లమెంటరీ సంప్రదాయం ప్రకారం ఉభయ సభలను అధిక సంఖ్యాకుల అభీష్టం ప్రకారం కాకుండా ఏకాభిప్రాయంతో నడపవలసి ఉంది. 'సభా కార్యకలాపాలను లంచ్ విరామం లేకుండా కొనసాగిద్దామా?' అన్న చిన్న పాటి విషయంపై సభాపతి లేదా అధికార పక్షం వైఖరి ఎలా ఉన్నా ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవడం అనేది ఒక సదాచారంగా ఉన్నది. అయినప్పటికీ, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన వృత్తి విద్యా కోర్సుల ఎంట్రెన్స్ టెస్ట్‌లపై నెలకొన్న వివాదాలను చర్చించాలని వందలాది ఎంపీలు మద్దతునిచ్చిన వాయిదా తీర్మానాలను చర్చకు చేపట్టడానికి ఉభయ సభల సభాపతులూ తిరస్కరించారు. గత ఐదేళ్లలో పార్లమెంటులో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిన వైనాన్ని సభాపతుల నిర్ణయం గుర్తుకు తెచ్చింది. ఎంత శోచనీయం!

పార్లమెంటు ఉభయ సభలలో తొలి చర్చ, పార్లమెంటు వెలుపల తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ ఉద్దేశాలను, పరిపాలనా దిశను స్పష్టం చేశాయి : ఒకే వ్యక్తి ఆదేశాలు, నిర్దేశాల ప్రకారమే దేశ పాలన కొనసాగనున్నది; మోదీ 3.0కు కీలక మద్దతు నిస్తున్న మిత్రపక్షాల (టీడీపీ, జేడీయూ)తో పాటు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు వేటికి కూడా ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించడం మినహా మరెటువంటి పాత్ర ఉండదు; నరేంద్ర మోదీ తన సొంత మంత్రులకు, పార్లమెంటు ఉభయ సభలలోని ప్రతిపక్ష నేతలకు దేశ పాలనా వ్యవహారాలలో పాలు పంచుకునేందుకు ఎటువంటి అవకాశమివ్వబోరు; ఉద్దేశపూర్వకంగా గానీ, అనుద్దేశపూర్వకంగా గానీ తాము చేసిన తప్పులు, పొరపాట్లను మోదీ సర్కార్ ఎటువంటి పరిస్థితులలోను అంగీకరించబోదు; ప్రస్తుత ప్రభుత్వ పాలనలోని సకల లోపాలు, లొసుగులకు బాధ్యత జవహర్‌లాల్ నెహ్రూతో మొదలుకొని పాలించిన గత ప్రభుత్వాలదేనని మోదీ ప్రభృతులు నిక్కచ్చిగా చెప్పడం తప్పక కొనసాగుతుంది; బీజేపీ అధికార ప్రతినిధులు యథావిధిగా కలహశీల, ఆక్షేపణీయ రీతుల్లో వ్యవహరిస్తారు; జీతభత్యాలపై అధికార పక్షానికి అనుకూలంగా సామాజిక మాధ్యమాలలో చెలరేగిపోయేవారు మరింత క్రియాశీలంగా కొనసాగుతారు; దర్యాప్తు సంస్థలపై ఎటువంటి అదుపులు ఉండబోవు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అవి వ్యవహరిస్తాయి.

543 లోక్‌సభ నియోజకవర్గాలలో 240ని మాత్రమే బీజేపీ సొంతంగా గెలుచుకున్నది; దాని నేతృత్వంలోని ఎన్డీఏ గెలుచుకున్న స్థానాలు 292 మాత్రమే. అయినప్పటికీ మరోసారి పాలించడానికి ప్రజలు తమకే అధికారమిచ్చారని మోదీ విశ్వసిస్తున్నారు. ప్రజా తీర్పు తమకే అనుకూలంగా ఉందని ఉద్ఘాటిస్తున్నారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజలు దృఢ శైలాలే కానీ, లక్క పిడతలు కారు' అన్న సత్యాన్ని ఆయన విస్మరిస్తున్నారు. సరే, ఎంపీల విషయమేమిటి? ఇంత స్వల్ప వ్యవధిలో వారి తీరుపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి రావడం కష్టం కానీ కొన్ని ప్రాథమిక సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్‌కు చెందిన ఎన్డీఏ/ బీజేపీ ఎంపీలు భయాందోళనలకు గురవుతున్నారు. ఆ మూడు రాష్ట్రాలలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడమే వారి కలవరపాటుకు ప్రధాన కారణం. ఆ రాష్ట్రాలలో తాము మళ్లీ అధికారానికి రాగలుగుతామా అనే శంక వారిని పీడిస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం బలహీనపడుతోంది. హర్యానాలోని పది లోక్‌సభ సీట్లను బీజేపీ, కాంగ్రెస్ సరిసమానంగా గెలుచుకున్నాయి. హేమంత్ సోరేన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ జార్ఖండ్ హైకోర్టు వెలువరించిన తీర్పు ఆ మూడు రాష్ట్రాలలోని ఇండియా కూటమిలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపింది. అసెంబ్లీ సమరానికి ఆ కూటమి మహోత్సాహంతో సమాయత్తమవుతోంది. పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, కర్ణాటకలో ఎన్డీఏ/ బీజేపీ తీవ్రంగా నష్టపోయాయి. కేరళ, తమిళనాడులో ఆ రెండూ దాదాపుగా అంతర్ధానమయ్యాయి. ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, బిహార్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, అస్సోం, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్ నుంచి ఎన్నికైన ఎన్డీఏ/ బీజేపీ ఎంపీలు ఉల్లాసంగా ఉన్నారు. అయితే తమది 'సంకీర్ణ ప్రభుత్వం' అన్న వాస్తవం వారిని వేదనకు గురి చేస్తోంది. ఈ సంకీర్ణ సర్కార్ ఎంత కాలం మనగలదన్న విషయం కూడా వారిని కలవరపరుస్తోంది.

భారతీయ జనతా పార్టీ ఒక అజేయ శక్తా? ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అజేయుడా? అవునని ఘంటాపథంగా చెప్పుకోవడానికి తాము ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలన్న విషయం బీజేపీకి బాగా తెలుసు. అదే విధంగా కాంగ్రెస్ సైతం నెహ్రూ, ఇందిర నాటి తన పాత వైభవాన్ని సంపూర్ణంగా పునరుద్ధరించుకోవాలంటే బీజేపీ కంటే మరెంతో జనాదరణ పొందవలసి ఉన్నది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో తొమ్మిది రాష్ట్రాలలో కాంగ్రెస్ తన 99+2 సీట్లను సాధించుకున్నది. 170 లోక్‌సభ స్థానాలు ఉన్న మరో తొమ్మిది రాష్ట్రాలలో కేవలం నాలుగు సీట్లను మాత్రమే కైవసం చేసుకున్నది. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే 215 నియోజకవర్గాలలో కాంగ్రెస్ అసలు పోటీ చేయలేదు (ఆ నియోజకవర్గాలలో ఇండియా కూటమిలోని కాంగ్రెస్ మిత్రపక్షాలు పోటీ చేశాయి) కాంగ్రెస్, ఇండియా కూటమి కలసి ఒక బలవత్తరమైన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించివేయగల శక్తి వాటికి లేదు. అటువంటి శక్తి లోక్‌సభలో 16 మంది ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి, 12 మంది సభ్యులు ఉన్న జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి ఉన్నాయి. ఆ రెండు పార్టీలు తమకు సరైన సమయం వచ్చే వరకు వేచివుంటాయి. కేంద్ర బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నాయి. తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని ఆ రెండు పార్టీలు తప్పక డిమాండ్ చేస్తాయి. అయితే అందుకు మోదీ ససేమిరా అంటారని మరి చెప్పనవసరం లేదు. మరి కొద్ది నెలల్లో జరగనున్న మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడే దాకా వేచివుంటాయి.



గత పది సంవత్సరాలుగా తాము అనుసరించిన పాలనా విధానాలు సమర్థనీయమైనవని, భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దేవని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసిస్తారు. అవే విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పార్లమెంటులో ఆయన ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక కేవలం అదే ప్రభుత్వానికే కాకుండా, అదే పాలనకు సైతం దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలి.

సరే, ఈ అనిశ్చిత రాజకీయ పరిస్థితులు ఆర్థిక విధానాలను ఎలా ప్రభావితం చేయనున్నాయి? కొన్ని ఊహలు చేసేందుకు, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు సాహసిస్తున్నాను. 1) తన వైఫల్యాలను నిరాకరించే ధోరణి ప్రభుత్వం తప్పక కొనసాగిస్తుంది: నిరుద్యోగిత పెచ్చరిల్లిపోవడాన్ని, ద్రవ్యోల్బణం, ముఖ్యంగా ఆహార పదార్థాల విషయంలో బాగా పెరిగిపోతుందన్న వాస్తవాన్ని ప్రభుత్వం అంగీకరించదు; కార్మికుల వేతనాలు, ఆదాయాలు స్తంభించిపోవడాన్ని ఒప్పుకోదు; దేశ జనాభాలో కింది స్థాయిలో ఉన్న 20 శాతం మంది పేదరికంలో కునారిల్లుతున్నారన్న కఠోర వాస్తవాన్ని గుర్తించదు; అసమానతలు పెరిగిపోవడాన్ని పట్టించుకోదు. మరి ఇటువంటి వైఖరితో ఉన్న మోదీ సర్కార్ ఆర్థిక విధానాలలో మౌలిక మార్పులకు పూనుకుంటుందా? అలా ఆశించడమే అసంబద్ధం. 2) మౌలిక సదుపాయాలు, బుల్లెట్ రైలు ఇత్యాది ఆడంబరపూర్వక ప్రాజెక్టులలో భారీ మదుపులను మోదీ సర్కార్ కొనసాగిస్తుంది. మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ వ్యయాల పెరుగుదల వల్ల ఆర్థిక లబ్ధి సమకూరుతుంది, సందేహం లేదు. అయితే ప్రైవేట్ పెట్టుబడులు కొరవడుతాయి. వృద్ధి రేటు స్వల్పస్థాయిలో ఉంటుంది. అయితేనేం, ప్రభుత్వం అవిశ్వసనీయ గణాంకాలతో వృద్ధిరేటును ఘనంగా పెంచుతుంది. 3) దక్షిణ కొరియా అభివృద్ధి నమూనాను అనుసరించడాన్ని మోదీ సర్కార్ కొనసాగిస్తుంది. కీలక రంగాలలో గుత్తాధిపత్యం పెరిగిపోతుంది. తత్ఫలితంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఖాయిలాపడతాయి. కొత్త ఉద్యోగాల సృష్టి మందగిస్తుంది. ఏటా లక్షల సంఖ్యలో ఉద్యోగాల మార్కెట్‌లోకి ప్రవేశించే విద్యావంతులు, అనిపుణ యువజనులు తీవ్రంగా నష్టపోతారు. 4) వృద్ధాప్యం మీదబడుతున్న నాయకుని సారథ్యంలో వరుసగా మూడో సారి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్య, ఆరోగ్య భద్రత, పర్యావరణ రక్షణ, వాతావరణ మార్పు నియంత్రణ, వ్యవసాయం, అడవుల అభివృద్ధి, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలు–అభివృద్ధి రంగాలలో మౌలిక మార్పులు సాధించగల ప్రతిభావంతులను ఆకట్టుకుని, వారికి నిర్ణయాత్మక బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువ. మరి ఈ విషయంలో సమర్థంగా వ్యవహరించకపోతే నష్టపోయేది దేశమే కాదూ?

గత పది సంవత్సరాలుగా తాము అనుసరించిన పాలనా విధానాలు సమర్థనీయమైనవని, భారత్‌ను ప్రపంచ అగ్రగామిగా తీర్చిదిద్దేవని ప్రధానమంత్రి దృఢంగా విశ్వసిస్తారు. అవే విధానాలు యథాతథంగా కొనసాగుతాయని పార్లమెంటులో ఆయన ప్రసంగాలు స్పష్టం చేస్తున్నాయి. కనుక కేవలం అదే ప్రభుత్వానికే కాకుండా, అదే పాలనకు సైతం దేశ ప్రజలు సిద్ధంగా ఉండాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కరువుసీమకు ప్రాజెక్టుల తోరణం కడతారా?

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి,

ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మీరు చేసిన వాగ్దానాల అమలుకై ఉత్తర్వులపై సంతకం జేయడం అభినందనీయం. అది మా రాయలసీమ ప్రజలకు తమ డిమాండ్లు నేరువేరుతాయనే నమ్మకాన్ని రెట్టింపు జేసింది. ఆ విశ్వాసంతోనే మీకు ఈ వినతి.

మీరు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా చూస్తారని, ఆ అభివృద్ధిలో కూడా వెనుకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రాధాన్యమిస్తారని సీమ ప్రజలు ఆశిస్తున్నారు. గత ఐదేళ్లుగా ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోని రాయలసీమ ప్రజలు మీపై గంపెడు ఆశలతో మీకు ఎన్నడూ లేనంత శాసనసభ్యులను అందించారు. ముఖ్యంగా కరువుసీమను సస్యశ్యామలం చేసేందుకు మీరు సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. పోలవరం ఆలస్యమవుతుందని, కృష్ణా డెల్టా రైతాంగపు అవసరాలకై, పట్టిసీమను రికార్డు సమయంలో పూర్తిజేసిన ఘనత మీది. తద్వారా అందే అదనపు 45 టిఎంసీల నీటిని రాయలసీమకు కేటాయిస్తానని మాటిచ్చారు. ఈసారి తత్సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల విడుదలకై సీమ ప్రాంత ప్రజలు వేయికళ్ళతో వేచిచూస్తున్నారు.

మీ అఖండ విజయం వల్ల, మీరు రాష్ట్రంలో తిరుగులేని నాయకునిగా ఉద్భవించడమే గాక, కేంద్రంలో కూడా కింగ్ మేకర్ అయ్యారు. కేంద్రంలో మీ పరపతిని వినియోగించి విభజన చట్టంలోని అన్ని హామీలూ అమలయ్యేలా చూడాలని మా ఆకాంక్ష. మీకు అత్యంత ప్రీతిపాత్రమయిన అమరావతి రాజధానికి నిధులు, పోలవరం ప్రాజెక్టు పూర్తిజేయడంతో పాటు, వెనుకబడిన సీమ జిల్లాల అవసరాలు తీర్చే హంద్రీ–నీవా, గాలేరు–నగరి, వెలిగొండ, తెలుగుగంగ ప్రాజెక్టుల నిర్మాణంపై కేంద్రమిచ్చిన హామీలను మీరు మరువరని మా నమ్మకం. ఇక స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడపలో ఉక్కు కర్మాగార నిర్మాణం, రాష్ట్రంలో (విశాఖలో అని ఎక్కడా చెప్పలేదు) ఏర్పాటుజేస్తామన్న రైల్వే జోన్‌ను వెనుకబడిన అనంతపూర్ జిల్లాలోని గుంతకల్‌లో ఏర్పాటుకై మీరు శాయశక్తులా కృషిజేయాలని మా విజ్ఞప్తి. నవనగరాల పేరిట అన్ని రాష్ట్ర, కేంద్ర సంస్థలూ అమరావతీ చుట్టూ కేంద్రీకరిస్తే, అది ప్రాంతాల మధ్య అసూయాద్వేషాలకు దారితీస్తుంది. ఎటూ, రాజధాని అమరావతిలోనే నెలకొల్పబోతున్నారు, కాబట్టి కర్నూల్‌లో హైకోర్ట్ ఏర్పాటుజేయడం సమంజసంగా ఉంటుంది. చివరిగా, మీరు ఎన్నికల ముందు పాలనాపరమైన అనుమతులిచ్చిన గుండ్రేవుల రిజర్వాయర్, ఆర్డీఎస్ కాలువ, వేదవతి ఎత్తిపోతల పథకాలను తిరిగి గాడిలో పెట్టి పూర్తి చేయించాలని, అసంబద్ధంగా, అహేతుకతో విశాఖలో ఏర్పాటు జేసిన కృష్ణానదీ యాజమాన్య బోర్డును కర్నూలుకు తరలించాలని కోరుతున్నాం. చివరిగా, మీరే 'ప్రాజెక్టుల తోరణం' పేరుతో అసెంబ్లీలో సెప్టెంబర్ 4, 2014లో సీమ జిల్లాలకు ఇచ్చిన హామీలను అమలు జేస్తారని ఆశిస్తున్నాం.

— **అరుణ్,** కన్వీనర్, రాయలసీమ విద్యావంతుల వేదిక

ఏపీ సీఐడీ 'దేశాంతర అణచివేత'!

అప్పటి ఏపీ సీఐడీ చీఫ్ ఎన్. సంజయ్ అమెరికన్ చట్టాల గురించి తెలియక అమెరికన్ భూభాగంలో తెలుగు ఎన్నారై సోషల్ మీడియా మీదికి తన 'సైన్యాన్ని' పంపించారో, లేక అమెరికాలో అది చట్టవిరుద్ధమని తెలిసీ చేశారో తెలియదు. అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠపై శ్రద్ధ కనబరచే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమెరికాలో ఏపీ సీఐడీ చీఫ్ 'సోషల్ మీడియా ఆపరేషన్' నిగ్గు తేల్చాలి.

అమెరికా అనేక అంశాల్లో పరస్పర వైరుధ్యాల దేశంగా కనిపిస్తుందన్నది నిజమే. అయితే అక్కడి ప్రజలు అమూల్యమైనవిగా భావించే మతస్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ, గుమికూడి నిరసన తెలిపే స్వేచ్ఛ, సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి ఫిర్యాదు చేసే స్వేచ్ఛ... ఇలా ఎన్నో వ్యక్తిగత హక్కులను, స్వేచ్ఛలను ప్రజలకు కల్పించడంలో మాత్రం అమెరికన్ వ్యవస్థ మిగతా ప్రపంచం కంటే ఎంతో ముందంజ వేసింది. ఈ స్వేచ్ఛలన్నీ అక్కడ కచ్చితంగా అమలు జరుగుతాయి. కనుకనే నిందితులను ఒప్పించడానికి వారిని పోలీసులు లాకప్పులలో శారీరకంగా హింసించే భీకర దృశ్యాలు గాని; ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే జర్నలిస్టులను, ప్రతిపక్షనేతలను పోలీసులు ఇళ్లలోంచి ఈడ్చుకు వచ్చి జైళ్లలో కుక్కే అమానవీయ సంఘటనలు గాని అమెరికాలో కనిపించవు. మీరు ప్రభుత్వాన్ని విమర్శించినందుకో, సోషల్ మీడియాలో మీ అసమ్మతి గళాన్ని వినిపించినందుకో పోలీసులు మిమ్మల్ని అరెస్ట్ చేయడమన్నది కలలో కూడా సాధ్యం కాదు, మీరు వేరే దేశం (ఇండియా) నుంచి తాత్కాలిక వీసాపై అమెరికా చేరుకున్న టూరిస్టులు అయినా సరే! అలా అసమ్మతికి చట్టపరంగా చోటు కల్పించుకున్న అమెరికాలోకి ఆంధ్రప్రదేశ్ సీఐడీ పోలీసులు వచ్చి అక్కడ కొందరు తెలుగు ఎన్నారై యాక్టివిస్టుల సోషల్ మీడియాలో చేసిన అభ్యంతరకర పోస్టులపైన 'దర్యాప్తు జరిపి, సమాచారం సేకరించి, గూఢచర్యం చేసి... వాళ్ళ మీద కఠిన చర్యలు ఉంటాయ'ని బెదిరిస్తే, అక్కడి ప్రజలకు అది ఎంత దిగ్భ్రాంతికరంగా ఉంటుందో వేరుగా చెప్పనవసరం లేదు!

ఇలాంటి చర్యలపై అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) ఏమంటోందో ముందుగా తెలుసుకోండి: 'కొన్ని దేశాల ప్రభుత్వాలు అమెరికాలో నివసిస్తున్న తమ సొంత పౌరులను వేధింపులకు, బెదిరింపులకు గురి చేస్తాయి. విదేశాలలో కుటుంబ సంబంధాలు, ఇతర పరిచయాలు ఉన్న 'నేచురలైజ్డ్' (గ్రీన్ కార్డు ద్వారా పౌరసత్వం పొందిన) యు.ఎస్. సిటిజన్లని, లేదా 'యు.ఎస్. బోర్న్' (యు.ఎస్.లో జన్మించడం ద్వారా పౌరులైన) యు.ఎస్. సిటిజన్లని కూడా ఆ ప్రభుత్వాలు లక్ష్యంగా చేసుకోవచ్చు. ఇది అమెరికా చట్టాలను; వ్యక్తుల హక్కులు, స్వేచ్ఛలను ఉల్లంఘించడమే అవుతుంది... విదేశీ ప్రభుత్వాలు అమెరికాలో ప్రజలను రహస్యంగా వెంటాడటం, వారిని భయభ్రాంతులకు గురి చెయ్యడం, లేదా వారిపైన దాడి చెయ్యడం 'ట్రాన్స్‌నేషనల్ రిప్రెషన్' ('దేశాంతర అణచివేత') కిందకు వస్తుంది. అది చట్టవ్యతిరేకం (ఇల్లీగల్). దానిని అడ్డుకోవడానికి మీరు (ఎఫ్‌బిఐ) సహాయం పొందవచ్చు' అని ఎఫ్‌బిఐ తన అధికారిక వెబ్‌సైట్లో స్పష్టం చేసింది. అయినప్పటికీ ఏపీ సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్ అమెరికాలో ఇంత అడ్వెంచర్ జరపడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఆయన తమ అమెరికన్ ఆపరేషన్ గురించి స్వయంగా చెప్పడం టీవీలో కళ్లారా చూసి, చెవులారా విన్నాను కాబట్టి సరిపోయింది గాని లేకపోతే నమ్మటం కష్టమయ్యేది.

'మేము మా టీమ్స్‌ని (పోలీసు బృందాలను) యూఎస్, యూకే, ఆస్ట్రేలియాలకు పంపించాము. ఆ దేశాల్లో ఉన్న ఎన్నారైల అభ్యంతరకరమైన సోషల్ మీడియా అకౌంట్ల గురించి స్థానిక ఇండియన్ ఎంబసీలను అప్రమత్తం చెయ్యడానికి వీలుగా వారి సోషల్ ఇంటరాక్షన్స్‌ని గమనించడం కోసం మా బృందాలను అక్కడికి పంపించాము. ఆయా దేశాలలో తెలుగు సంతతి ప్రజలు ఎలా స్థిరపడ్డారు, వారు ఉపాధి కోసం ఆయా దేశాలకు వెళ్లారా... లాంటి వివరాలను మా బృందాలు అక్కడ సేకరిస్తాయి' అని ఎన్. సంజయ్ తన నవంబరు 8, 2023 నాటి మీడియా కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. ఆయన అమరావతిలో నిర్వహించిన ఆ సమావేశంలో మరో పోలీసు ఉన్నతాధికారి హర్షవర్ధన్, ఎస్పీ, సైబర్ క్రైమ్ కూడా పాల్గొన్నారు.

'ఈ క్షణంలో మా బృందాలు రెండు చోట్ల యూఎస్, యూకేలలో పనిచేస్తున్నాయి. వేరే పని మీద ఆ దేశాలలో ఉన్న మా బృందాలకు ఈ పనిని (సోషల్ మీడియా ట్రోల్స్‌పై ఇన్ఫర్మేషన్‌ని, ఇంటెలిజెన్స్‌ని సేకరించే కార్యక్రమాన్ని) మేము అప్పగించాము. యూఎస్, యూకేల్లోని సోషల్ మీడియా ట్రోల్స్ అక్కడి ఇండియన్ డయాస్పోరా ప్రజలను ఎంతగా ఇబ్బంది పెడుతున్నాయన్నది ఎత్తి చూపడానికి అక్కడ మావాళ్లు సేకరించే సమాచారాన్ని, ఇంటిలిజెన్స్‌ని వాడుకోవాలని మేము భావిస్తున్నాం. యూఎస్, యూకేల్లోని ఇండియన్ ఎంబసీలకు కూడా మేము లేఖలు రాశాం. వారు కఠిన చర్యలు తీసుకోవడానికి వీలుగా తగిన సమాచారాన్ని మేము వారికి అందజేస్తాం' అని ఎన్.సంజయ్ తెలిపారు. స్పష్టమైన వీడియో ఆధారాలు ఉన్న ఈ బహిరంగ ప్రకటన ద్వారా తాము అమెరికన్ భూభాగంపైన నివసిస్తున్న కొందరి మీద గూఢ చర్యం జరుపుతున్నట్టు, వారిపైన కఠిన చర్యలకు సిఫారసు చేస్తున్నట్టు ఎన్.సంజయ్ స్వయంగా వెల్లడించి అమెరికన్ చట్టాలను ఉల్లంఘించినట్టు తామే బైటపెట్టుకున్నారు.



కొన్ని నియంతృత్వ దేశాల పోలీసులు అమెరికాలో ఇటువంటి 'అడ్వెంచర్లు' చెయ్యడం నానాటికీ పెరుగుతుండడంతో వివిధ అమెరికన్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, అమెరికన్ చట్టసభలు అక్కడి భూభాగంపైన 'దేశాంతర అణచివేతకు' పూర్తిగా అడ్డుకట్ట వెయ్యడంపై ఈ మధ్య దృష్టి పెట్టాయి. అమెరికాలోని చైనా అసమ్మతివాదుల పైన నిఘా పెట్టడానికి చైనా పోలీసులు న్యూయార్క్ నగరంలో ఏకంగా ఒక రహస్య పోలీసు స్టేషన్నే ఏర్పాటు చేసుకున్నారని ఏప్రిల్ 17, 2023న బయటపడడంతో అటు అమెరికన్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, అమెరికన్ కాంగ్రెస్ నాయకులు అప్రమత్తమయ్యారు. ఈ కేసులో చైనా ప్రభుత్వం తరఫున ఆ పోలీసు స్టేషన్ నడుపుతున్న ఇద్దరిని ఎఫ్‌బీఐ అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టింది. సోషల్ మీడియాలో అమెరికా నుంచి చైనాపై నిరసనగళాలు వినిపించేవారిని వేధించి, వారి వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివెయ్యడానికి అమెరికా వెలుపలి నుంచి ప్రయత్నించి అమెరికాలో 'దేశాంతర అణచివేతకు' పాల్పడిన 40 మంది చైనీస్ నేషనల్ పోలీసు అధికారులపైన కూడా ఎఫ్‌బీఐ కోర్టులో చార్జ్‌షీట్ వేసింది.

ఢిల్లీ కోర్టు నుంచి 2012–13లో వచ్చిన ఒక కేసుకు సంబంధించిన వివరాలను కూడా ఇక్కడ పరిశీలించాలి. జాతీయ సమగ్రతకు విఘాతం కలిగిస్తూ వర్గ శత్రుత్వాన్ని ప్రోత్సహించిన ఆరోపణలపై గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఆర్క్యూట్, మైక్రోసాఫ్ట్, యాహూ, బ్లాగ్‌స్పాట్ మొదలైన మొత్తం 11 అమెరికన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌కి 2012లో ఒక ఢిల్లీ న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. అయితే పరస్పర న్యాయ సహాయ ఒప్పందంలోని 'ఆర్టికల్ 3' ప్రకారం ఢిల్లీ కోర్టు విజ్ఞప్తిని తాము అమలు జరపలేకపోతున్నామని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ నుంచి భారత హోం మంత్రిత్వ శాఖకు మార్చి 2013లో సమాచారం అందింది. ఢిల్లీ న్యాయస్థానం చేసిన విజ్ఞప్తి అమెరికన్ రాజ్యాంగం పరిరక్షించే 'ఫ్రీ స్పీచ్ ప్రిన్సిపుల్స్'తో (వాక్ స్వాతంత్ర్యానికి సంబంధించిన ఆదేశిక సూత్రాలతో) ముడిపడి ఉన్నందున, అవి ఎంతో కీలకమైన అంశాలు అయినందున ఆ విజ్ఞప్తిని పరిశీలించలేకపోతున్నామని అమెరికా స్పష్టం చేసింది. అమెరికన్ రాజ్యాంగం భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు ఇచ్చిన నిర్వచనం చాలా విస్తృతమైనదని, అందువల్ల అతికొద్ది నిర్దేశిత సందర్భాల్లో తప్ప భావవ్యక్తీకరణపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌ని తమ రాజ్యాంగం నిషేధించిందని కూడా అమెరికన్ జస్టిస్ డిపార్టుమెంట్ వివరించింది.

జగన్ విధేయ ఏపీ సీఐడీ చీఫ్ ఎన్. సంజయ్ అమెరికన్ చట్టాల గురించి తెలియక అమెరికన్ భూభాగంలో తెలుగు ఎన్నారై సోషల్ మీడియా మీదికి తన 'సైన్యాన్ని' పంపించారో, లేక అమెరికాలో అది చట్టవిరుద్ధమని తెలిసి కూడా చేశారో తెలియదు. అంతర్జాతీయంగా రాష్ట్ర ప్రతిష్ఠ గురించి అత్యంత శ్రద్ధ కనబరచే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమెరికాలో అప్పటి ఏపీ సీఐడీ చీఫ్ ఎన్. సంజయ్ చేసిన 'సోషల్ మీడియా ఆపరేషన్' వెనక నిజానిజాల్ని ఎంతవరకు నిగ్గుతేలుస్తారో చూడాలి. అమెరికాలో ఈ విషయంపై నేను రాసిన పుస్తకం (Operation Observation) మాత్రం ఈ దిశగా తన పని తను చేసుకుపోతుందని భావిస్తున్నాను!

■ ఆర్. కె. మాగంటి
టెక్సస్, యు.ఎస్.ఏ.





శుక్రవారం ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఆషాఢ శోభ

నేటి నుంచి ఇంద్రకీలాద్రిపై ఆషాఢ ఉత్సవాలు

తొలిసారె సమర్పించనున్న దేవస్థాన సిబ్బంది

భక్తులు సారె సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

నేటి నుంచి 16వ తేదీ వరకూ వారాహి నవరాత్రులు

19 నుంచి మూడు రోజులు శాకంబరీ ఉత్సవాలు

వన్‌టౌన్, జూలై 5 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు ఆషాఢమాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈవో కేఎస్ రామారావు పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు లేకుండా సారె స్వీకరణ, అమ్మవారి దర్శనం, పూజాదికాలు, తదితరాలపై పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవో చాంబరులో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సామూహికంగా సారె సమర్పించేందుకు ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్నారు. శనివారం ఉదయం 8 గంటలకు వైదిక కమిటీ, పరిపాలన విభాగ సిబ్బంది, ఇతరులు కనకదుర్గానగర్ నుంచి ఊరేగింపుగా కొండపైకి చేరుకుని ఈవో రామారావు ఆధ్వర్యంలో అమ్మవారికి తొలిసారె సమర్పిస్తారు. కాగా, ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు శాకంబరీ ఉత్సవాలు జరుగుతాయి. 19వ తేదీ ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమై 21వ తేదీ ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి.

వారాహి నవరాత్రులు

ఇంద్రకీలాద్రిపై తొలిసారిగా శనివారం నుంచి 16వ తేదీ వరకు వారాహి నవరాత్రులు నిర్వహించనున్నారు. దేవస్థానం వైదిక కమిటీ అంతర్గతంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. శనివారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, రుత్విక్‌వరణం, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ జరుగుతాయి. సాయంత్రం 4 గంటలకు కలశస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మండపారాధన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేస్తారు. 9 రోజుల పాటు జపాలు, హోమాలు జరుగుతాయి. 15వ తేదీ ఉదయం 10 గంటలకు పూర్ణాహుతితో వారాహి నవరాత్రులు ముగుస్తాయి.

పేటలో మళ్లీ డయేరియా కేసులు!

డీఎంహెచ్‌వో సహా జిల్లా అధికారుల సందర్శన

- నేటి నుంచి హోటళ్లు, టీ స్టాళ్లు మూసివేత
- జగ్గయ్యపేటలో హై అలర్ట్

6లో..

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

రేపే పరీక్ష.. 25 పరీక్షా కేంద్రాలు.. హాజరుకానున్న 7,834 మంది

» కలెక్టర్ సృజన వెల్లడి

6లో..



రోజూ రోజా..

నగరంలో ట్రాఫిక్ పోలీసుల వినూత్న కార్యక్రమాలు

హెల్మెట్ ధరించే వారికి గులాబీలు ఇచ్చి సత్కారం



నగరంలోని ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమాలతో వాహనదారులను ఆకట్టుకుంటున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తున్న వాహనదారులను గుర్తించి వారిని ప్రత్యేకంగా సత్కరిస్తున్నారు. హెల్మెట్ ధరించిన వారితో పాటు సీటుబెల్టు పెట్టుకున్న వాహనదారులను శుక్రవారం గుర్తించారు. వారికి గులాబీలు అందించారు. కొంతమందికి బహుమతులు కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ డీసీపీ కె.చక్రవర్తి ముఖ్య అతిథిగా హాజరు కాగా, ఏడీసీపీ డి.ప్రసాద్, ఏసీపీ జనార్దన్, ఇన్‌స్పెక్టర్లు దుర్గాప్రసాద్, రామారావు, సేఫర్ ఇండియా రోడ్స్ సంస్థ ప్రతినిధి ఓజా, 'వీడు' రోడ్ సేఫ్టీ సంస్థ ప్రతినిధి వాసు పాల్గొన్నారు. ఈనెల 12వ తేదీ వరకూ ఇలా వినూత్నంగా వాహనదారులకు గులాబీలు ఇవ్వాలని నిర్ణయించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పొగ.. పాగా..



విజయవాడలో పట్టుబడిన నకిలీ సిగరెట్ల బాక్సులు

అమరావతికి అటువైపు ఉన్న గుంటూరు, ఇటువైపు ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లాలో పొగ మాఫియా పాతుకుపోతోంది. నకిలీ సిగరెట్ల చెలామణీకి రెండు జిల్లాలు కేంద్ర బిందువులుగా మారుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరుకుకు ఉమ్మడి కృష్ణాజిల్లాను కేంద్రంగా మార్చుకుంటున్నారు. అసలు బ్రాండ్లను పోలి ఉండే నకిలీ సిగరెట్లను తెచ్చి కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు.

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నకిలీ సిగరెట్ల మాఫియా

- » రూ.కోట్లలో నకిలీ సిగరెట్ల వ్యాపారం
- » ఉత్తరాది ముఠాలతో సత్సంబంధాలు
- » ప్రైవేట్ కొరియర్ల ద్వారా వస్తున్న సరుకు
- » పన్నుల చెల్లింపులకు ఎగనామం
- » పట్టుబడిన పాట్నా సరుకు వెనుక ఉన్నదెవరు?

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : రాష్ట్రం మొత్తంలో నకిలీ సిగరెట్లకు కేరాఫ్‌గా కృష్ణా, గుంటూరు జిల్లాలు మారాయి. ఈ మాఫియా తీరుతో అసలు కంపెనీలు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ మాఫియా రెచ్చిపోవడానికి సీజీఎస్టీ, కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ శాఖల అధికారుల నిర్లక్ష్యం ప్రధాన కారణంగా తెలుస్తోంది.

తెరవెనుక ఎవరు?

బిహార్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ఈ నకిలీ సిగరెట్లు ఎక్కువగా తయారవుతాయి. అక్కడి నుంచి సరుకును మన రెండు జిల్లాలకు చెందిన మాఫియా ప్రైవేట్ కొరియర్లలో తెప్పిస్తోంది. నిబంధనల ప్రకారం ఒక పార్శిల్‌ను కొరియర్ చేసినప్పుడు అందులో ఉన్న వస్తువులు ఏమిటన్నది ఆయా సంస్థల ప్రతినిధులు పరిశీలించాలి. అలాంటిది నకిలీ సిగరెట్లు ఏకంగా కొరియర్లలో రాష్ట్రాలు, నగరాలు దాటి రావడం వెనుక సదరు కొరియర్ సంస్థల పాత్ర ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకుముందు ఈ మాఫియా ప్రత్యేకంగా కంటైనర్లను బుక్ చేసుకుని సరుకును తెచ్చేది. ఈ సమాచారం తెలుసుకున్న సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు టోల్‌ప్లాజాల వద్ద తనిఖీలు చేయడంతో ఈ నకిలీ సిగరెట్ల బాగోతం వెలుగులోకి వస్తోంది. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కంటైనర్లు వరుసగా సీజీఎస్టీ, కస్టమ్స్ బృందాలకు పట్టుబడుతుండడంతో మాఫియా కొత్త మార్గాన్ని ఎంచుకుంటోంది. ఉత్తరాది కంపెనీలకు ఇక్కడి నుంచి ఆర్డర్లు ఇచ్చి కొరియర్ సంస్థల ద్వారా రప్పించుకుంటోంది. విజయవాడకు శివారున ఉన్న ముస్తాబాద, గన్నవరం, కేసరపల్లిలో కొరియర్ సంస్థలకు చెందిన గోడౌన్లు ఉన్నాయి. ఇక్కడికి వచ్చిన సరుకును మాఫియా కింద పనిచేసే ఏజెంట్లు తీసుకుంటున్నారు. ఇలా పాట్నా నుంచి డీటీడీసీ కొరియర్‌కు వచ్చిన నకిలీ సిగరెట్లను సెంట్రల్ జీఎస్టీ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ సరుకు మొత్తం విలువ రూ.2.46 కోట్లు ఉంటుందని అంచనా. ఇన్వాయిస్‌లో మాత్రం రూ.8 లక్షలుగా చూపించారు. నకిలీ సిగరెట్లతో పొగప్రియుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాకు పన్నులు చెల్లించకుండా కన్నం వేస్తున్నారు. ఈ ఇన్వాయిస్‌లపై మాత్రం బీడీలు అని రాస్తున్నారు. పాట్నాలోని మెసర్స్ గోల్డ్ స్టెప్ టుబాకో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి ఈ నకిలీ సిగరెట్లు వచ్చాయని అధికారులు నిర్ధారించారు. అసలు ఈ ఆర్డర్‌ను ఎవరు బుక్ చేశారు, ఎక్కడి నుంచి బుక్ చేశారు అనే వివరాలు మాత్రం ఇంకా బయటపడలేదు.

దర్యాప్తు ఏమవుతున్నట్టు?

సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు విదేశీ బంగారం, నకిలీ సిగరెట్లను సీజ్ చేసినప్పుడు హడావిడి చేస్తున్నారు. ఆ తర్వాత దర్యాప్తును పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్మగ్లింగ్ సరుకులను పట్టుకున్నప్పుడు ఒక ప్రకటన విడుదల చేస్తున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. తర్వాత దర్యాప్తు విషయంలో అడుగు ముందుకు పడడం లేదని తెలుస్తోంది. సీజీఎస్టీ, కస్టమ్స్ అధికారులు ఇప్పటి వరకు సీజ్ చేసిన స్మగ్లింగ్ వస్తువుల కేసుల్లో ఇదే జరిగింది. ఇప్పటి వరకు ఫలానా కేసులో అసలు నిందితులను గుర్తించామని, పట్టుకున్నామని ప్రకటించలేదు. ఈ మొత్తం వ్యవహారం ఆయా సంస్థల అధికారుల తీరుపై అనుమానాలకు తావిస్తోంది. సరుకును సీజ్ చేసినా అసలు నిందితులను పట్టుకోవడానికి అధికారులు అడుగులు వేయకపోవడం మాఫియాకు పెద్ద అవకాశంగా మారుతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ కారణంగానే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో నకిలీ మాఫియా వేళ్లూనుకుంటోందని తెలుస్తోంది.

ఆక్సిజన్ ప్లాంట్.. మూలకు..!

రూ.3 కోట్ల విలువైన ప్లాంట్ నిరుపయోగం

- * ప్రారంభించిన రెండేళ్లకే పక్కన పెట్టేశారు
- * రిపేరు చేయించకుండా ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై ప్రేమ
- * ప్రైవేట్ ఆక్సిజన్ వినియోగానికే పెద్దపీట
- * కాంట్రాక్టర్‌కు నెలకు రూ.50 లక్షల చెల్లింపులు
- * విజిలెన్స్ అధికారుల విచారణ



(విజయవాడ-ఆంధ్రజ్యోతి/ప్రభుత్వాసుపత్రి) : కరోనా సమయంలో ఆక్సిజన్ సరఫరాను నిరంతరాయంగా అందించేందుకు ఏర్పాటుచేసిన కొత్త ప్రభుత్వాసుపత్రిలోని ఆక్సిజన్ జనరేషన్ ప్లాంట్ మూలనపడింది. పీఎం కేర్స్ నిధులతో దీన్ని ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఆక్సిజన్ కొనుగోలు చేసి, ట్యాంకర్లలో భద్రపర్చుకుని వినియోగించేవారు. 3వేల లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తిచేసే ఈ ప్లాంట్ ఏర్పాటుతో ప్రైవేట్ సరఫరాదారులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండాపోతుందని అంతా భావించారు. కానీ, కాసుల కక్కుర్తితో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ప్రైవేట్ ఆక్సిజనే ఆధారం

రూ.3 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుచేసినా ప్రైవేట్ కాంట్రాక్టర్లు సరఫరా చేసే ఆక్సిజన్‌పైనే ఆసుపత్రి అధికారులు ఆధారపడుతున్నారు. ప్రైవేట్ కాంట్రాక్టర్లకు నెలకు రూ.25 లక్షల చొప్పున చెల్లిస్తూ ఆసుపత్రి నిధులను దుర్వినియోగపరుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త ఆసుపత్రిలో రోజుకు సుమారు రెండు టన్నులు, పాత ఆసుపత్రిలో సుమారు ఒక టన్ను ఆక్సిజన్ అవసరమవుతుంది. రోజుకు మూడు టన్నుల ఆక్సిజన్ వినియోగమవుతున్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. మొత్తంగా నెలకు రెండు ఆసుపత్రుల్లోనూ వంద టన్నుల ఆక్సిజన్ వినియోగమవుతుందని అంచనా. టన్నుకు సుమారు రూ.40 వేల నుంచి రూ.50 వేల చొప్పున కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు.

ప్రైవేట్ కాంట్రాక్టర్‌పై ప్రేమ

కొవిడ్ సమయంలో రోగులకు ఉపయోగపడేందుకు ఈ ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. 2021 చివరిలో దీన్ని ఏర్పాటు చేయగా, రెండేళ్లకే మూలనపడిపోయింది. ఇదే సమయంలో ప్రైవేట్ కాంట్రాక్టర్ కూడా ఇక్కడ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఏదైనా సాంకేతికలోపం వచ్చినా, అత్యవసరంగా ఆక్సిజన్ కావాల్సి వచ్చినా వినియోగించడానికి దీన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం కారణంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను పక్కన పడేసి, కాంట్రాక్టర్ సరఫరా చేసే గ్యాస్‌పైనే ఆసుపత్రి అధికారులు ఆధారపడుతున్నారు. దీంతో ఆక్సిజన్ కోసం భారీ మొత్తంలో నిధులు వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్న ప్లాంట్‌ను బాగు చేసుకోలేని అధికారులు ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు మాత్రం పెద్దపీట వేస్తున్నారు. కాంట్రాక్టర్ కేవలం ప్లాంట్‌లో గ్యాస్ నింపి వెళ్తుంటారు. విశాఖపట్నానికి చెందిన ఈ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకుని ఆక్సిజన్ సరఫరా చేస్తున్నారు. కాగా, ఆక్సిజన్ ప్లాంట్, గ్యాస్ సరఫరా వివరాలపై ఆసుపత్రి అధికారులు గోప్యత పాటిస్తున్నారు. ఇప్పటికే ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్‌పై ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. వైసీపీ హయాంలో ఆయన అడ్డదారిలో పదోన్నతి సాధించి, కిందిస్థాయి ఉద్యోగులను వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆక్సిజన్ ప్లాంట్.. ప్రైవేటు సరఫరాదారులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఎంతకాలం నుంచి ప్లాంట్‌ను పక్కన పెట్టారు, ఇప్పటి వరకు ప్రైవేట్ వ్యక్తులకు ఎంతమేర చెల్లింపులు జరిపారన్న అంశాలపై ఆరా తీస్తున్నారు.

నలుగురు చిన్నారులు అదృశ్యం

- పరుగులు పెట్టిన పోలీసులు
- ఆరు గంటల్లోనే గుర్తింపు

విజయవాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఒకే ప్రాంతానికి చెందిన నలుగురు చిన్నారులు. అంతా పక్కపక్క ఇళ్లలోనే ఉంటారు. స్కూల్‌కు వెళ్తున్నామని ఇళ్ల నుంచి బయల్దేరారు. ఉన్నట్టుండి కనిపించకుండా పోయారు. ఇలా.. నగరం నుంచి అదృశ్యమైన నలుగురు చిన్నారుల ఆచూకీని ఒక సెల్‌ఫోన్ పట్టించింది. ఆరు గంటల వ్యవధిలో పోలీసులు వారిని సురక్షితంగా విజయవాడకు తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళితే.. భవానీపురంలోని హెచ్‌బీ కాలనీకి చెందిన 16 ఏళ్ల అమ్మాయి ఇంటర్ చదువుతోంది. ఆమె తమ్ముడికి 13 ఏళ్లు. వీరి ఇంటికి కొంతదూరంలో 13 ఏళ్ల అమ్మాయిలు ఇద్దరున్నారు. ఒకే వీధిలో ఉండటంతో అంతా స్నేహితులయ్యారు. వీరంతా శుక్రవారం ఉదయం కలిసి పాఠశాలకు బయల్దేరారు. వారిలో నలుగురు నేతాజీ పబ్లిక్ స్కూల్లో చదువుతున్నారు. పిల్లలు స్కూల్‌కు రాకపోవడంతో ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. 16 ఏళ్ల అమ్మాయి కాలేజీకి కూడా వెళ్లకపోవడంతో ఆందోళన చెందారు. భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పశ్చిమ మండల ఏసీపీ పడాల మురళీకృష్ణారెడ్డి, భవానీపురం ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర రావు ఈ విషయాన్ని పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే ఇద్దరు డీసీపీలతో మొత్తం 15 బృందాలను ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులను పోలీసులు విచారించగా, 16 ఏళ్ల అమ్మాయి వద్ద ఫోన్ ఉందని చెప్పారు. దీంతో వెంటనే సైబర్ క్రైం పోలీసులను అప్రమత్తం చేశారు. సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలోని బృందం ఆ ఫోన్ నెంబర్ ఆధారంగా టవర్ లొకేషన్‌ను తీయించారు. ఈ ఫోన్ నెంబర్ గుంటూరు రైల్వేస్టేషన్‌ను చూపించింది. వెంటనే ఒక బృందం గుంటూరుకు బయల్దేరింది. ఆ ఫోన్‌ను ట్రాక్ చేస్తుండగా, మధ్యలో లొకేషన్ కనిపించలేదు. ఆ అమ్మాయి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసిందని గుర్తించారు. వెళ్లిన నలుగురిలో ఒక బాలుడు గుంటూరు నుంచి తిరిగి విజయవాడకు వచ్చేశాడు. ఆ బాలుడ్ని పోలీసులు విచారించగా, తామంతా కలిసి విజయవాడ రైల్వేస్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కామని, మిగిలిన వారంతా హైదరాబాద్ వెళ్తున్నారని చెప్పాడు. గుంటూరు వెళ్లిన బృందాన్ని అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలని సీపీ ఆదేశించారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ అధికారులను అప్రమత్తం చేశారు. రైలు ప్లాట్‌ఫాం వద్దకు వెళ్లేసరికి పోలీసులు చిన్నారులున్న బోగి వద్దకు చేరుకున్నారు. మొత్తం ముగ్గురు అమ్మాయిలను జీఆర్పీ స్టేషన్‌లో ఉంచారు. అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీస్ కమిషనర్ శనివారం వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక అనివార్యమే..

9న నిర్వహించేందుకు ఏర్పాట్లు

- వైసీపీ రెబల్స్ కార్పొరేటర్లకు బుజ్జగింపులు
- నామినేషన్ల ఉపసంహరణ
- ఆరు పదవులకు ఏడు నామినేషన్లు

వైసీపీ నుంచి ఆరు.. టీడీపీ నుంచి ఒకటి

చిట్టినగర్, జూలై 5 : వీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు అనివార్యమయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఆరు స్టాండింగ్ కమిటీ పదవులకు ఏడు నామినేషన్లు అందాయి. దీంతో ఈనెల 9వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్ జనరల్ డాక్టర్ ఏ.మహేశ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

నామినేషన్లు ఉపసంహరించిన వైసీపీ రెబల్స్

ఈ ఎన్నికను ఏకపక్షం చేయాలని అధికార వైసీపీ ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. సొంతపార్టీలోని ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు వేసి తలనొప్పిగా మారారు. అలాగే, ఒక టీడీపీ కార్పొరేటర్ కూడా నామినేషన్ వేయడంతో ఎన్నిక అనివార్యమైంది. వైసీపీ రెబల్స్‌గా నామినేషన్లు వేసిన ఇద్దరు కార్పొరేటర్లతో పార్టీ పెద్దలు మాట్లాడటంతో వారు ఉపసంహరించుకున్నారు. అయితే, టీడీపీలో ఒకరి నామినేషన్ ఉండటంతో ఎన్నిక జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైసీపీలో ఆరని అంతర్గత పోరు

పోటీలో వైసీపీ నుంచి రెండో డివిజన్ కార్పొరేటర్ - మిగతా 6లో


ఆరోగ్యకేంద్రంలో రోగులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో

జగ్గయ్యపేటలో మళ్లీ డయేరియా!

- డీఎంహెచ్‌వో సహా జిల్లా అధికారుల సందర్శన
- ఆసుపత్రులకు బాధితులు.. పట్టణంలో హై అలర్ట్
- నేటి నుంచి హోటల్స్, టీ స్టాల్స్ మూసివేత

జగ్గయ్యపేట, జూలై 5 : నియోజకవర్గంలో శుక్రవారం డయేరియా కేసులు తిరిగి పెరగటంతో హైఅలర్ట్ ప్రకటించారు. డయేరియా లక్షణాలతో 10 మంది ఆసుపత్రిలో చేరారు. రోజుల వయసు శిశువుతో పాటు బాలింత ఆసుపత్రికి వచ్చారు. వత్సవాయి మండలం భీమవరానికి చెందిన చిక్కు యామిని (4), షేక్ మస్తాన్ బీ (27), కంభంపాడుకు చెందిన పాశం బెనర్జీ (45), జగ్గయ్యపేట మండలం బూదవాడకు చెందిన బాణావత్ బాల్యా (53), కరిశె రాణి (36)గండ్రాయికి చెందిన పాతుల నరసింహారావు (6), షేర్ మహ్మద్‌పేట గ్రామానికి చెందిన బరిగెల నాగేశ్వరి (25), చిల్లకల్లు గ్రామానికి చెందిన సొంపొంగు నవ్య (22), రోజుల శిశువు, పట్టణంలో తొర్రగుంటపాలేనికి చెందిన జి.కోటేశ్వరి (25)లు ఆసుపత్రిలో చేరారు. చిల్లకల్లు, ముక్కపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. చిల్లకల్లు గ్రామంలో వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో సుహాసిని, జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నియంత్రణాధికారి జె.ఉషారాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అమృత, డీడీఎంహెచ్‌వో ఇందుమతి, సామాజిక ఆరోగ్య కేంద్ర సూపరింటెండెంట్ హరీశ్ తదితరులు సందర్శించారు.

మదర్సాలో బాలికల అస్వస్థతపై విచారణ

కృష్ణలంక, జూలై 5 : ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జంగం రాజేంద్రప్రసాద్ శుక్రవారం సింగ్ నగర్‌లోని మదర్సా ఇన్‌స్టిట్యూట్‌ను విచారణ నిమిత్తం సందర్శించారు. ఇటీవల బాలిక మృతిపై విచారణ నిమిత్తం మదర్సాకు వచ్చారు. విచారణలో మదర్సాలో 10 మంది బాలికలు అస్వస్థతకు గురైనట్టు, వారిలో కరిష్మా అనే బాలిక మృతిచెందినట్టు ఆయన గుర్తించారు. ఈ సందర్భంగా మదర్సా సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. ఆడపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎప్పటికప్పుడు వైద్యులతో హెల్త్ చెకప్ చేయించాలని తెలిపారు. ఆహార పదార్థాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా వుంచాలని ఆయన తెలిపారు. అనంతరం ఎంకే బేగ్ స్కూల్‌ను సందర్శించి పిల్లలకు ఇచ్చే ఆహారాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి సిబ్బందికి, విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జె.రాజేంద్రప్రసాద్, నాగమణి, లక్ష్మీప్రసన్న, రాజేశ్వరరావు, జాన్‌సన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మదర్సాలో విచారిస్తున్న ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యులు

అన్నదాతను ఆదుకోండి

- మంత్రి అచ్చెన్నకు టీడీపీ నేతల వినతి



జి.కొండూరు, జూలై 5 : రాష్ట్ర ఆదాయంలో రైతుదే అగ్రభాగమని అలాంటి రైతును వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని.. కూటమి పాలనలో మరల రైతును రాజు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడ్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు జంపాల సీతారామయ్య, కె.విజయబాబులు కోరారు. శుక్రవారం అమరావతిలో మంత్రిని కలిసి రైతుల సమస్యలు, అవసరాలను వినతిపత్రం ద్వారా వివరించారు. ఉద్యాన రైతుల్ని ఆదుకునేందుకు పంటల బీమా తీసుకురావాలని, వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన బిందు, తుంపర్ల సేద్యం రాయితీని తిరిగి పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీలకు 90శాతం రాయతీ ఇవ్వాలని కోరారు. మైలవరం నియోజకవర్గంలో మామిడి ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేసి ఒరుగులు, తాండ్ర, పచ్చళ్లు తయారు చేసుకునే అవకాశం కల్పిస్తే రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. తాడేపల్లిగూడెంలో ఉన్న ఉద్యానపరిశోధన కేంద్రం రీసెర్చ్ స్కాలర్స్‌చే ఈప్రాంత ఉద్యాన పంటలపై పరిశోధన చేయించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. మైలవరం మార్కెట్ యార్డ్‌లో త్వరలో ఒక సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తానని హామి ఇచ్చినట్టు వారు తెలిపారు. ముందుగా మంత్రిని నేతలు దుశ్శాలువా, పూలబొకేతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉయ్యూరు వెంకటనరసింహారావు, సీహెచ్.చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబు, కేశినేని చిన్నిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

ఔటర్ రింగ్, ఫ్లైఓవర్‌లకు అనుమతులపై హర్షం

- చంద్రబాబు, ఎంపీ చిన్ని చిత్రపటాలకు క్షీరాభిషేకం

విద్యాధరపురం, జూలై 5 : ఔటర్ రింగ్ రోడ్డు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం పొందినందుకు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు సీఎం చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ల చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నరసింహచౌదరి, టీడీపీ రాష్ట్ర నేత మాదిగాని గురునాథంలు మాట్లాడుతూ, బాధ్యతలు చేపట్టి నెలరోజులు కాకముందే కేంద్రం నుంచి ఔటర్ రింగ్, ఫ్లైఓవర్‌లకు అనుమతులు తీసుకురావడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబు, కేశినేని చిన్నిలు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడి గ్రీన్ సిగ్నల్ ఇప్పించారన్నారు. వీటి పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై విజయవాడలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతాయని, స్వర్ణయుగ నిర్మాత చంద్రబాబు నాయకత్వంపై ప్రజలు నమ్మకంతో ఎన్నికల్లో చారిత్రక తీర్పు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో చెన్నుపాటి గాంధీ, ఎస్.ఫిరోజ్, సోలంకి రాజుజైన్, గొల్లపూడి నాగేశ్వరరావు, కత్తుల మణికంత తదితరులు పాల్గొన్నారు.

నేడు జూనోసిస్ డే ..



కృష్ణలంక, జూలై 5 : పెంపుడు కుక్కలు చూసేందుకు ఎంత అందంగా కనబడతాయో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే వాటితో పాటు మనుషులకు తీవ్ర ప్రమాదమే. కుక్కపిల్లల పెంపకం నేడు నిత్య జీవితంలో ఒక భాగంగా మారింది. అదే నేపథ్యంలో వాటి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిశుభ్రత, సంరక్షణ విషయాల్లో అప్రమత్తంగా వుండకపోతే ప్రమాదాన్ని కోరి తెచ్చుకున్నట్టే. పశువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కలగజేసి వ్యాధులను అరికట్టి వారిని చైతన్యపరచడమే 'జూనోసిస్ డే' ప్రధాన ఉద్దేశ్యం. ర్యాబిస్ వ్యాధికి మందులేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో 'లూయిస్ పాశ్చర్' అనే శాస్త్రవేత్త 'యాంటీ రేబిస్' వ్యాక్సిన్‌ను కనుగొని ప్రపంచానికి మహోపకారం చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జూలై 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా 'జూనోసిస్ డే' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు

జూనోసిస్ డే సందర్భంగా జూలై 6వ తేదీ అన్ని ప్రభుత్వ పశువుల ఆస్పత్రులలో కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తున్నట్టు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు తెలిపారు. పశుపోషకులకు, పెంపుడుకుక్కల యజమానులకు, పశువుల నుంచి, కుక్కల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై అవగాహనా శిబిరం ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మునేటిలో అనుమానాస్పద మృతి

- మృతుడు ప్రకాశం జిల్లా వాసిగా గుర్తింపు



పెనుగంచిప్రోలు, జూలై 5 : ప్రకాశం జిల్లా చిన గంజాం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన కంపిరి అనిల్ నాయుడు పెనుగంచిప్రోలు మునేటి కాజ్‌వే వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయాన్ని పోలీసులు శుక్రవారం సాయంత్రం గుర్తించారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. కాజ్‌వే సమీపంలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ పి.రాంబాబు సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడు అనిల్‌గా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని జగ్గయ్యపేట సీఐ ఎం.జానకి రామ్ సందర్శించి వివరాలను సేకరించారు. పోస్టుమార్టం అనంతరం జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక అనివార్యమే..

(5వ పేజీ తరువాయి)

అంబడిపూడి నిర్మలకుమారి, మూడో డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 33వ డివిజన్ కార్పొరేటర్ వల్లూరి ఎన్‌డీఎస్ మూర్తి, 41వ డివిజన్ కార్పొరేటర్ ఇర్ఫాన్, 43వ డివిజన్ కార్పొరేటర్ బాపటి కోటిరెడ్డి, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, టీడీపీ నుంచి సీహెచ్ రామ్మోహన్‌రావు ఉన్నారు. కొద్దిరోజుల క్రితం వరకు పార్టీ అధికారంలో ఉండటంతో నోరెత్తని కార్పొరేటర్లు ఇప్పుడు అసంతృప్తి జ్వాలలు రగులుస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ రాగానే మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు గ్రూపులుగా విడిపోయారు. తర్వాత ఐక్యతా సమావేశాలు ఏర్పాటు చేసుకున్నా ప్రసంగాలకే పరిమితమైంది. అయితే, కొందరు కార్పొరేటర్లు వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వీఎంసీతో పాటు ఇతర పదవులను రెడ్డి సామాజికవర్గానికే కేటాయించారన్న అసంతృప్తిలో ఉన్నారు. ముఖ్యంగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కాపు సామాజికవర్గాన్ని దూరంపెట్టి, రెడ్డి సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇచ్చారన్న వాదన వినిపిస్తోంది. సామాజిక న్యాయం అంటే ఇదేనా.. అని ప్రశ్నిస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో ఇప్పటి వరకు వెలంపల్లి సూచించిన వారికే పదవులు ఇచ్చారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసంతృప్తితో ఉన్న కార్పొరేటర్లు టీడీపీ కార్పొరేటర్‌కు ఓటు వేస్తే, స్టాండింగ్ కమిటీలో ఒక సభ్యుడు టీడీపీ నుంచి ఎన్నికయ్యే అవకాశం ఉంటుంది. ఏదేమైనా ఎన్నడూ లేనివిధంగా టీడీపీ కార్పొరేటర్ నామినేషన్‌తో స్టాండింగ్ కమిటీకి ఎన్నిక తప్పనిసరైంది.

తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టండి

- కాలనీల్లో కృష్ణా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- నీరు రంగుమారి వస్తోందని కలెక్టర్‌కు సుల్తానగర్ వాసుల ఫిర్యాదు

మచిలీపట్నం టౌన్, జూలై 5 : తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. బందరు మండలం సుల్తానగరంలో తాగునీటి సరఫరాపై కలెక్టర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్థానిక ప్రజలను నీటి సరఫరాపై ఆరా తీసారు. ఆ సందర్భంగా వాటర్ ట్యాంకును పరిశీలించారు. తాగునీరు ఎలా ఉంటోందని ఆరా తీసారు. నీరు ఆకుపచ్చగా వస్తోందని చిట్టిబొమ్మ దుర్గాప్రసాద్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నీటిని ల్యాబ్ టెస్ట్‌కు పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వాటర్ రిజర్వాయర్లను శుభ్రం చేయించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అతిసార వంటి వ్యాధులు రాకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రయత్నించాలని పంచాయతీ అధికారుకు సూచించారు. పాడైన పైప్‌లైన్ లీకులను గుర్తించి అరికట్టాలన్నారు. మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించి ఫోటోలు పంపాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ శివప్రసాద్‌ను ఆదేశించారు.

తరకటూరు సమ్మర్ స్టోరేజీ పరిశీలన

పట్టిసీమ జలాలు విడుదలైన సందర్భంగా బందరు ప్రజలకు తాగునీరందించేందుకు కలెక్టర్ ముందస్తు ప్రణాళిక రూపొందిస్తున్నారు. మంత్రి రవీంద్ర సూచనల మేరకు జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణ ప్రజల అవసరాలకు కావలసిన నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం తరకటూరు సమ్మర్ స్టోరేజీని పరిశీలించారు. నేరుగా కలెక్టర్ తరకటూరు సమ్మర్ స్టోరేజికి వెళ్లి ప్రస్తుత నీటి మట్టం 1.9 మీటర్లు ఉన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. ఇంకా 12 రోజుల వరకు తాగునీటి నిల్వలు ఉండగా.. మరో రెండు వారాల్లో పట్టిసీమ నీరు బందరు రానున్న దృష్ట్యా ప్రజల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించనున్నారు. పట్టిసీమ జలాలు వచ్చేలోగా తాగునీటి రిజర్వాయర్లు శుభ్రం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశాలు జారీచేశారు. తరకటూరు సమ్మర్ స్టోరేజిని మోటార్లతో నింపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్లుఎస్ అధికారులు ఉన్నారు.


సుల్తానగరంలోని తాగునీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి..

పామర్రు : ప్రజలకు తాగునీరు అందించడంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. బల్లిపర్రు, కనుమూరు గ్రామాల్లో శుక్రవారం మండలస్థాయి అధికారులతో కలిసి గ్రామాల్లో రక్షిత నీటి సరఫరాపై ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుతున్న నీటి సరఫరాపై వివరాలు అడిగితెలుసుకున్నారు. ప్రస్తుత సీజన్లో గ్రామాల్లో మంచినీటి పథకాల్లో తప్పని సరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే గ్రామస్థాయి అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ శివప్రసాద్, డీపీవో నాగేశ్వర్‌నాయక్, ఉయ్యూరు ఆర్డీవో దాసిరాజు, తహసిల్దార్ శ్రీపల్లవి తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ వేగవంతం చేయండి

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బందరుపోర్టు వరకు రోడ్‌కం రైలు మార్గాల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోర్టుకు కనెక్టివిటీ కోసం రోడ్‌కం రైలు మార్గం కీలకమైనదన్నారు. దీనికోసం అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. భూసేకరణలో న్యాయపరమైన చిక్కులు ఎదురు కాకుండా అన్నిజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూములు ఇచ్చిన రైతులకు సకాలంలో పరిహారం అందించాలన్నారు. జేసీ గీతాంజలి శర్మ, ఆర్డీవో ఎం.వాణి, ఏపీ మేరీటైమ్‌బోర్డు డెప్యూటీ కలెక్టర్ వెంకట్రావ్, మెరైన్ విభాగం డీఈ శివయ్య, మచిలీపట్నం తహసీల్దార్ వెంకటేశ్వరరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

యూపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 25 పరీక్షా కేంద్రాలు.. హాజరుకానున్న 7,834 మంది అభ్యర్థులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన వెల్లడి

విజయవాడ లీగల్, జూలై 5 : ఈనెల 7వ తేదీ ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించనున్న ఈపీఎఫ్ఓ-పర్సనల్ అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో యూపీఎస్సీ పరిశీలకులు అశోక్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావులతో కలిసి లైజన్ కమ్ రూట్ ఆఫీసర్లు, పరీక్షా కేంద్రాల సూపర్‌వైజర్లు, సహాయ సూపర్‌వైజర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు పూర్తి స్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విజయవాడలో తొమ్మిది కేంద్రాల్లో ఈపీఎఫ్‌వో, 16 కేంద్రాల్లో ఈఎస్ఐసీ పరీక్షలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈపీఎఫ్‌వో పరీక్షకు 2,401, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు ఈపీఎఫ్ఓ-పర్సనల్ అసిస్టెంట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష నిర్వహణకు 25 మంది లైజన్ కమ్ రూట్ అధికారులు, 25 మంది సూపర్‌వైజర్లు, 25 మంది సహాయ సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరం మేరకు పటిష్ట బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖను, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొనేలా ఆయా రూట్లలో అదనపు బస్సులను నడపాలని ప్రజా రవాణా అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ టీవీల నిఘాకు, 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని, తాగునీరు అందుబాటులో వుంచడం, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు ముఖ్యమన్నారు. సమావేశంలో కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

అత్యంత పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

కృష్ణలంక : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో కార్డుదారులకు సకాలంలో సరుకులు అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, ఎక్కడా రేషన్ బియ్యం దారిమళ్లకుండా గట్టి నిఘా వుంచాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సీజన్ల వారీగా ధాన్యం సేకరణ, మిల్లింగ్, ఎండీయూల ద్వారా సరుకుల పంపిణీ, రేషన్ బియ్యం దారిమళ్లకుండా నిఘా, కేసుల నమోదు, విచారణ తదితరాలపై చర్చించారు. జిల్లాలో సుమారుగా ఆరు లక్షల కార్డులున్నాయని, ప్రతినెలా 374 ఎండీయూల ద్వారా లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్నట్టు వివరించారు. ఖరీఫ్-2024 ధాన్యం సేకరణకు సంబంధించి ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని సిద్ధంగా వుండాలన్నారు. బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు అదుపులో వుండేలా సమన్వయ శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో జి.మోహన్ బాబు పాల్గొన్నారు.


నున్న స్టేషన్‌లో ఉమను పరామర్శిస్తున్న గ్రామస్థులు

వివాహిత న్యాయ పోరాటానికి గ్రామస్థుల మద్దతు

- భర్త, అత్త, మామ సహా ఆరుగురిపై కేసు

విజయవాడ రూరల్, జూలై 5 : అత్త, మామ ఇంట్లోకి రానివ్వడం లేదని అత్తింటి ముందు వివాహిత చేసిన న్యాయపోరాటంపై శుక్రవారం పోలీసులతో పాటు గ్రామస్థులు స్పందించారు. వివాహితకు మద్దతుగా నున్న రూరల్ స్టేషన్‌కు చేరుకున్నారు. వివాహిత ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఆమె భర్త, అత్త, మామతో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నున్న గ్రామం కుమ్మరిబజారుకు చెందిన యనగంటి ఉమ భర్త భార్గవ్ ఆమెను వదిలేసి వెళ్లిపోవడం, అత్త, మామలు కనీసం ఇంట్లోకి రానివ్వకపోవడంతో ఆమె న్యాయపోరాటానికి దిగింది. నాలుగునెలల గర్భిణిగా ఉండి కూడా నాలుగేళ్ల కొడుకుతో అత్తింటి ముందు దీక్ష చేపట్టిన కథనం శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'న్యాయపోరాటం' పేరుతో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన గ్రామ టీడీపీ, వైసీపీ నేతలు, గ్రామస్థులు వివాహితకు మద్దతుగా నిలిచారు. నున్న రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని ఆమె నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. అనంతరం భర్త, అత్త, మామతో పాటు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివాహిత భర్త ఆమెను వదిలేసి కనిపించకుండా తిరుగుతుండటంపై కూడా పోలీసులు దృష్టి పెట్టారు. భర్తను తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది మహిళకు సంఘీభావంగా నున్న రూరల్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. సంబంధిత శాఖ వన్‌స్టాప్ పారా లీగల్ డి. సౌజన్య కేసు వర్కర్ ఎస్.ఆశాలతాజ్యోతి వివాహితతో మాట్లాడి ఆశ్రయం కల్పిస్తామని కోరగా ఆమె నిరాకరించింది. నున్నలోని భర్త, బంధువుల ఇంటి వద్దనే ఉంటానని కోరడంతో ఆమెను అక్కడికి పంపించారు.

వివాహిత ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, జూలై 5 : కుటుంబ కలహాలతో వివాహిత ఇబ్రహీంపట్నం ఫెర్రీలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన వైనమిది. పోలీసుల కథనం ప్రకారం.. గుడివాడ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కట్ట గణేశ్ కొన్నేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం వచ్చి నివాసం ఉంటున్నాడు. ఇటీవల ద్విచక్ర వాహనం కొనుక్కునే నిమిత్తం అతను బ్యాంకులో రూ.45 వేలు దాచుకున్నాడు. అవి తీసుకునేందుకు బ్యాంకు వెళ్లగా బ్యాంకుఖాతాలో కేవలం రూ.12 వేలు మాత్రమే ఉన్నాయి. ఈవిషయంపై అతను భార్య ప్రశాంతి (25)ని ప్రశ్నించాడు. దానికి సమాధానం చెప్పలేక భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంటి పై కప్పులో ఉన్న రాడ్డుకి చున్నితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వారికి మూడేళ్ల పాప ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి డి.విక్టర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం పొందేందుకు 10+2 విద్యార్హతతో పాటు, మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లమో కోర్సు చదివినవారు అర్హులని తెలిపారు. ఈనెల 8వతేదీ నుంచి 28వతేదీవరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రాతపరీక్షతోపాటు అడాప్టబిలిటీ 1, 2దశల్లో ఫిట్‌నెస్ పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

ఆశీలు ఘనం.. వసతులు శూన్యం!

- సమస్యల వలయంలో నాగాయలంక వారపు సంత మార్కెట్
- ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు

నాగాయలంక : నాగాయలంక మార్కెట్‌లో ప్రతీ శని, ఆదివారాలు ఎండు చేపలు, కూరగాయలు అమ్ముకునే వారపు సంతలో మౌలిక సదుపాయాలు లేక వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాకాలంలో వ్యాపారులు ఎండు చేపలు, కూరగాయలు తడవకుండా ఉండేందుకు రక్షణగా 1996లో అప్పటి ఎంపీ టి.శారద ఎంపీ నిధుల నుంచి రూ.1.50 లక్షలు మంజూరు చేయగా, మార్కెట్ ప్రాంగణంలో సిమెంట్ రేకులతో రెండు షెడ్లను, ప్లాట్ ఫారాలను నిర్మించారు. కాలక్రమేణా అందులో ఒక షెడ్‌కి ఉన్న సిమెంట్ పిల్లర్లు పూర్తిగా విరిగిపోయి ప్రమాదానికి అంచున ఉంది. వర్షం వస్తే వ్యాపారులు తమ సరుకులను దాచుకోవటానికి తగిన భద్రత లేకపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సంత మార్కెట్‌లో ఉన్న టాయిలెట్లు శిథిలమవటంతో చేపలు అమ్ముకునే మత్స్యకార మహిళలకు తగిన మరుగు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి సౌకర్యం కూడా పంచాయతీ అధికారులు కల్పించకపోవటంతో వ్యాపారులు వారిపై మండిపడుతున్నారు.



2024-25వ ఆర్థిక సంవత్సరంలో వారపు సంత ఆశీలు పాటను రూ.7.30 లక్షలకు పాటదారుడు పాడుకోగా, ఏడాదికి 52 వారాల్లో ఒక్కొక్క వారానికి సుమారు 14 వేలకుపైగా పంచాయతీకి ఆదాయం వస్తున్నది. వారపు సంత నుంచి గణనీయంగా ఆదాయం వస్తున్నా, సంతకు వచ్చే వ్యాపారులకు తగిన వసతులను పంచాయతీ అధికారులు కల్పించటం లేదని వ్యాపారులు విమర్శిస్తున్నారు. అలాగే పాటదారుడు నిర్ణీత ధరల కన్నా చిరు వ్యాపారులు నుంచి ఎక్కువగా వసూలు చేస్తున్నా అధికారులు, పాలకులు మౌనంగా ఉండటంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. సంత మార్కెట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి, చిరు వ్యాపారుల నుంచి ఎక్కువగా ఆశీలు వసూళ్లను నియంత్రించాలని పంచాయతీ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి జె.పవన్ కుమార్‌ను వివరణ కోరగా, టాయిలెట్లను బాగు చేయిస్తామన్నారు. పాడైన షెడ్డును తిరిగి నిర్మించేందుకు పంచాయతీ రాజ్ ఏఈతో అంచనాలు వేయిస్తామని, సంతలో మంచినీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత పాటదారుడిదేనని తెలిపారు. చిరు వ్యాపారుల వద్ద అధిక ఆశీలు వసూళ్లు చేస్తున్నట్టు తమకు ఫిర్యాదు వస్తే తగిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు.


నాగాయలంక మార్కెట్‌లో శిథిల స్థితిలో షెడ్ పిల్లరు, అధ్వానంగా మరుగుదొడ్డి

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

విశ్వ బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషి చేస్తా

● విరాట్ విశ్వకర్మ ఫెడరేషన్ నగరాధ్యక్షుడు పెదప్రోలు

భవానీపురం, జూలై 5 : విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ అభ్యున్నతికి అన్ని విధాలా కృషి చేస్తానని విద్యాధరపురం చెరువు సెంటర్‌కు చెందిన ఆల్ ఇండియా విరాట్ విశ్వకర్మ ఉమెన్, యూత్ ఫెడరేషన్ నగరాధ్యక్షుడు పెదప్రోలు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. విజయవాడ నగరాధ్యక్షులుగా నూతనంగా నియమితులైన పెదప్రోలు మాట్లాడుతూ ఎలాంటి సమస్య కైనా విశ్వబ్రాహ్మణులు తనను కలవొచ్చని, కుల సర్టిఫికెట్, ఇతర పనుల కోసం 7013614154 నెంబర్‌లో సంప్రదించాలని ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఈ పదవిని అప్పగించిన అసోసియేషన్ ఫౌండర్, జాతీయ కార్యదర్శి జగదీష్ ఆచార్యకు కృతజ్ఞతలు తెలిపారు.

భవానీపురంలో స్పా సెంటర్‌పై టాస్క్‌ఫోర్స్ దాడి

● నిర్వాహకులు, ఇద్దరు విటులపై కేసు

విద్యాధరపురం, జూలై 5: భవానీపురం బైపాస్ రోడ్డు పక్కనే ఒక స్పా సెంటర్‌పై విజయవాడ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి ఇద్దరు విటులు, ఏడుగురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంటున్న భార్యాభర్తలు ఏడాది క్రితం భవానీపురం బైపాస్ రోడ్డు పక్కన ఓ భవనంలోని పై అంతస్తును అద్దెకు తీసుకుని స్పా సెంటర్‌ను ప్రారంభించారు ఇక్కడ వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నాయని టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో గురువారం రాత్రి దాడి చేశారు. స్పా సెంటర్‌లో ఉన్న 9 మందిని భవానీపురం పోలీసులకు అప్పగించారు కాగా కౌన్సెలింగ్ ఇచ్చి యువతులను వదిలివేశారు నిర్వాహకులపైన, ఇద్దరు విటులపైన కేసు నమోదు చేశారు. గతంలోనూ ఇదే స్పా సెంటర్‌పై దాడి చేసి నిర్వాహకులను అరెస్టు చేశారు.



స్కూటీ శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ ఇస్తున్న హేమవతి రాజ్యలక్ష్మి

కేబీఎన్‌లో ముగిసిన మహిళల స్కూటీ శిక్షణ

వన్‌టౌన్, జూలై 5: కేబీఎన్ కాలేజీలో ఉమెన్స్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలకు ఉచిత స్కూటీ శిక్షణ ముగిసింది. శుక్రవారం కాలేజీలో జరిగిన కార్యక్రమంలో టప్పర్‌వేర్ ఏపీ పంపిణీ సంస్థ ఎండీ టీ హేమవతి రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు సమాజంలో ముందుకు సాగాలని ఆమె సందేశమిచ్చారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, విశ్రాంత ఉపాధ్యాయిని టి. విజయలక్ష్మి, సెంటర్ కన్వీనర్ పి. శైలజ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సత్యనారాయణపురం, జూలై 5: సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్‌కేవీ లైన్లు మరమ్మతుల కారణంగా ముత్యాలంపాడు సెక్షన్, శ్రీనగర్‌కాలనీ సబ్‌స్టేషన్ , కేవీ రైల్వే ట్రైనింగ్ సెంటర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి 10 వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బి.వి.సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డు, రైల్వే ట్రైనింగ్ సెంటర్, రైల్వే క్వార్టర్స్ ఏరియా, శ్రీనగర్ కాలనీ ఒకటవ రోడ్డు, జీరోలైన్ , రెండు, మూడో రోడ్డు వరకూ విద్యుత్‌సరఫరా ఉండదని తెలిపారు. **పాయకాపురం:** పాయకాపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్, ప్రశాంతినగర్, నూజివీడు మెయిన్‌రోడ్డు, పాత పాయకాపురం, ఏపీఎస్‌రెడ్డి రోడ్డు, పాత, కొత్త రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, సుందరయ్యనగర్, ఎల్‌బీఎస్‌నగర్, పైపుల రోడ్డు, ఉడాకాలనీ ఏపీఎస్ రెడ్డి రోడ్డు, డాక్టర్స్ కాలనీ, న్యూ రాజీవ్‌నగర్, రాధానగర్, బర్మాకాలనీ, విశాలాంధ్రకాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ. సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. **పటమట:** చెట్లకొమ్మలు నరకడం, విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు జేడీ నగర్, డొంక రోడ్డు, బాహుజీ రోడ్డు, లక్ష్మిపతినగర్ ప్రాంతాల్లోను, ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు న్యూ ఆర్టీసీ కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.



కుమ్మరిపాలెం వద్ద, లేబర్ కాలనీ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్లు, జోజినగర్ వద్ద ఇటీవల మార్చిన బస్‌షెల్టర్ వద్ద కూర్చోవడానికి ఏర్పాట్లు లేక

అక్కరకు రాని బస్‌షెల్టర్లు

- బస్‌షెల్టర్ వద్ద బస్సులు ఆగని వైనం
- ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం
- అవసరం ఉన్నచోట ఏర్పాటు చేయరా ?

భవానీపురం, జూలై 5 : పశ్చిమ నియోజకవర్గంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే చోట్ల బస్ షెల్టర్లు ఉన్నా అవి అక్కరకు రావడం లేదు. అవసరమున్న చోట్ల కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. విద్యాధరపురం ఆర్టీసీ డిపోకు కూతవేటు దూరంలో ఉన్న లేబర్ కాలనీ స్టేడియం వద్ద, జోజినగర్ చర్చి వద్ద ఇటీవల మార్చిన బస్‌షెల్టర్లు ఎందుకు ఉపయోగపడటం లేదు. కుమ్మరిపాలెం రావిచెట్టు సెంటర్ వద్ద బస్‌షెల్టర్ ఉన్నప్పటికీ బస్సులు ఆగడం లేదు. ప్రయాణికులకు ఉపయోగపడేలా కచ్చితంగా బస్సులు నిలుపుదల చేయాలి. కాగా లేబర్‌కాలనీ స్టేడియం వద్ద ఉన్న బస్ షెల్టర్‌ను సితార జంక్షన్ వద్దకు, కుమ్మరిపాలెం వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను ఇంకొంచెం ముందుకు జరిపితే ఇవి ప్రయాణికులకు ఉపయోగపడతాయి. బస్‌షెల్టర్ నుంచి వంద అడుగుల దూరంలో మెయిన్ రోడ్డు వద్ద బస్సులు ఆపడం వలన సమస్యలు తలెత్తుతున్నప్పటికీ ప్రయాణికులకు ఇదే సౌలభ్యంగా ఉండటంతో రోడ్లపైనే నిలబడి బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఇవి ముందుకు జరపడంపై ఆర్టీసీ, వీఎంసీ అధికారులు సమన్వయం చేసుకుని నిర్ణయం తీసుకోవాలని, లేదా ఉన్న వాటిని యథాతథంగా వినియోగించేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అంటున్నారు.

సితార సెంటర్‌లోనే కబేళా వైపు నుంచి సొరంగం, విద్యాధరపురం వెళ్లే ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేవు. చెరువు సెంటర్, నాలుగుస్తంభాల సెంటర్లలోని బస్‌షెల్టర్లు కూడా కనుమరుగయ్యాయి. ఇక్కడ కొత్తవి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అంటున్నారు.

వీఎంసీలో వైసీపీ ఆటలు సాగనివ్వం

● టీడీపీ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్

చిట్టినగర్, జూలై 5: వీఎంసీలో అసమర్థ వైసీపీ పాలనను సాగనివ్వమని టీడీపీ సీనియర్ కార్పొరేటర్ ముమ్మనేని వెంకట ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో అభివృద్ధి జరగలేదని, ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. కార్పొరేషన్ చరిత్రలో ఇంత దుర్మార్గ పాలన ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. ఇకపై వైసీపీ ఆటలు సాగవని, టీడీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలపై నిత్యం ఉద్యమిస్తుందని, ప్రజల సమస్యలతోపాటు అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పాటుపడతారని తెలిపారు. ఇప్పటివరకు వైసీపీ మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు కార్పొరేషన్ చట్టాలను తుంగలో తొక్కి, జగన్ చట్టాలను అమలు చేశారని పేర్కొన్నారు.

మూడున్నర ఏళ్లుగా రాష్ట్రంలో, కార్పొరేషన్‌లో వైసీపీ అధికారంలో ఉన్నా వైసీపీ ఎమ్మెల్యేలు కార్పొరేషన్‌కు రూపాయి నిధులు తీసుకురాలేదని విమర్శించారు. ఇకనైనా కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్లు నగరాభివృద్ధిపై దృష్టి పెట్టి ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతించాలని, లేని పక్షంలో ఇదే విధంగా రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ కార్పొరేటర్లను కూడా ప్రజలు చిత్తుగా ఓడిస్తారని ప్రసాద్ హెచ్చరించారు.

కార్మికులకు టీడీపీ అండ : ఎమ్మెల్యే గద్దె

రాణిగారితోట, జూలై 5: కార్మికులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉండేది టీడీపీ జెండానేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. వారధి ఆటోస్టాండ్‌కు చెందిన పలువురు వైసీపీ ట్రేడ్ యూనియన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో తెలుగునాడు ట్రేడ్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ మొదటి నుంచి కార్మికులకు అండగా ఉంటుందని, కార్మికులకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ టీఎన్‌టీయూసీ అండగా ఉంటుందని అన్నారు. కార్మికులకు అండగా ఉండడమే కాకుండా వారి సంక్షేమానికి ఎన్నో పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత కూడా చంద్రబాబుదేనని అన్నారు. చంద్రన్న బీమా పేరుతో కార్మికుల కోసం ప్రత్యేంగా ఒక పథకాన్ని అమలు చేసిన, చేస్తున్న పనిలో గాయాలైన, దురదృష్టవశాత్తు మరణించినా ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు తక్షణమే నష్ట పరిహారం కూడా అందజేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఉపాధి లేకుండా చేయడమే కాకుండా కార్మికుల సంక్షేమ నిధిలో ఉన్న నగదును మరో పథకాలకు మళ్లించుకున్నారని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని, కార్మికులందరికి ఇక మంచి రోజులు వచ్చినట్టేనని, కార్మికులందరూ చంద్రబాబుకు ఎల్లప్పుడూ అండగా ఉండాలన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘు, బొప్పన భవకుమార్, ముమ్మనేని ప్రసాద్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రాయవరపు అశోక్, వేముల దుర్గారావు, చిన్నా, అమ్ములు, ఆదిబాబు పాల్గొన్నారు.



టీడీపీ కండువా వేసి టీఎన్‌టీయూసీలోకి ఆహ్వానిస్తున్న గద్దె

విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ

లబ్బీపేట: కుటుంబాల స్థితిని మార్చేది విద్య ఒక్కటేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 19వ డివిజన్‌లో కూటమి డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలు. పెన్నులు, పెన్సిళ్లను శుక్రవారం అమరజీవి మదర్ థెరెస్సా ఎలిమెంటరీ స్కూల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అందుకోసమే మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడంతో పాటుగా పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కూటమి నాయకు లందరూ కలిసి విద్యార్థులకు ఈ విధంగా అందించడం అభినందనీయం అని అన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, ఎంఈవో సాంబశివరావు, భాగం సాయిప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు

52వ డివిజన్‌లో శుభోదయం ప్రజాదర్బార్ సమస్యలను ప్రస్తావించిన స్థానికులు

వన్‌టౌన్, జూలై 5: 52వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు శుక్రవారం నిర్వహించిన శుభోదయం ప్రజాదర్బార్‌లో స్థానికులు అనేక సమస్యలను ప్రస్తావించారు. తాగునీరు ఒక్కపూట మాత్రమే వస్తుందని, కొండ ప్రాంతంలో పాములు సంచరిస్తున్నాయని, కొండపై భాగానికి నీరు రావడం లేదని, పైపులు లీకవుతున్నాయని, మెట్ల మార్గం సరిగ్గా లేదని, కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కాలువలకు మరమ్మతులు చేయించాలని ఇలా అనేక సమస్యలను ప్రస్తావించారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి ఈ సమస్యలను తీసుకువెళతానని చెప్పారు.

పల్లా శ్రీనివాస్‌కు గొట్టిపాటి అభినందనలు

పటమట, జూలై 5 : గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ శుక్రవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. గొట్టిపాటి ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీకి, కార్యకర్తలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ పార్టీని పల్లా శ్రీనివాస్ ముందుకు నడిపిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



మృతిని కుటుంబానికి ఆర్థిక సాయం

చిట్టినగర్, జూలై 5: 47వ డివిజన్‌కు చెందిన జనసేన నాయకుడు చిట్ల సతీష్ శుక్రవారం మృతి చెందారు. జనసేన నగర ప్రచార కమిటీ కో- ఆర్డినేటర్ తిరుపతి సురేష్, ఎమ్మెల్యే సుజనా పీఎస్ పత్తిపాటి శ్రీధర్ సతీష్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని, రూ. 20వేలు సాయం అందించారు. గౌరీశంకర్, రత్నకుమారి, మహంకాళి, నరేష్ పాల్గొన్నారు.

2003 డీఎస్సీ అభ్యర్థులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

గంపలగూడెం, జూలై 5: 2003 డీఎస్సీ నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ నవాబ్ జాని, కోసూరి రాజశేఖర్ అన్నారు. ఉపాధ్యాయులు సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ వేతనంతో దూర ప్రాంతాల్లో పనిచేస్తున్న మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించి సొంత మండలాలకు బదిలీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.రాఘవరాజు, ఆవుల రాంబాబు, జయశీలరావు, ఎ.సుధాకర్ రెడ్డి, బొల్లిపోగు కిరణ్ పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు, పక్కనే రోడ్డుపై నిలిపిన లారీలు

ఆక్రమణల తొలగింపు

రాణిగారితోట, జూలై 5: రాణిగారితోట సిమెంట్ గోడౌన్ వద్ద ఉన్న ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. 18వ డివిజన్‌లో సిమెంట్ గోడౌన్ ఎదురుగా వారధి గుంటూరు బస్టాప్ వద్ద ఉన్న ఆక్రమణలు తొలగించాలని వారం క్రింతం టౌన్‌ప్లానింగ్ అధికారులు సంబంధిత వ్యక్తులకు సూచించారు. వారం గడిచినా ఆక్రమణలు తొలగించకపోవడంతో శుక్రవారం అధికారులు టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ఆక్రమణలను తొలగించారు.

ఇకపై ఇక్కడ అనుమతి లేకుండా షాపులు పెడితే తొలగిస్తామని హెచ్చరించారు. అయితే ఇదే ప్రాంతంలో రోడ్డుపై లారీలు నిలుపుదలతో వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఈ సమస్యపై కూడా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన ఆవిష్కరణలకు క్లౌడ్ కంప్యూటింగ్ దోహదం

● క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణుడు గోపిరాజు

ఉంగుటూరు, జూలై 5 : వ్యాపారానికి మరింత సౌలభ్యాన్ని ఇవ్వటంతోపాటు, కొత్త అప్లికేషన్ల రూపకల్పన ప్రక్రియను సులభతరం చేసి, నూతన ఆవిష్కరణలకు మద్దతు ఇవ్వడంలో క్లౌడ్ కంప్యూటింగ్ ఎంతో దోహదపడుతుందని ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి, క్లౌడ్ కంప్యూటింగ్ నిపుణుడు సీహెచ్. గోపిరాజు అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ)సహకారంతో, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫైనలియర్ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ విత్ అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై ఐదురోజుల వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.

వర్క్‌షాపును ప్రారంభించిన ఐటీ విభాగాధిపతి ప్రొఫెసర్ యనమదల వరప్రసాద్ మాట్లాడుతూ, క్లౌడ్ కంప్యూటింగ్ విత్ ఏడబ్ల్యూఎస్ నేర్చుకోవడం వలన కంపెనీలకు వర్చువలైజేషన్, ఆన్ డిమాండ్ వనరులను ఉపయోగించుకోవడంలో తోడ్పాటునందిస్తుందన్నారు. కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్, డీన్ సీహెచ్ శాంతిరాణి, ఆర్ అండ్ డీ డీన్ జి.సాగర్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ త్రివిక్రమరావు ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు వర్క్‌షాపును సందర్శించి విద్యార్థులను అభినందించారు.







ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శనివారం • 6 జూలై 2024

cinema@andhrajyothy.com

పుట్టిన రోజు.. రెండు అప్‌డేట్స్



నందమూరి కల్యాణ్ రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన నటిస్తున్న 21వ చిత్రం లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. తన పిడికిలి బిగించి ఫైర్‌తో, కుర్చీలో కూర్చున కల్యాణ్ రామ్ తన చుట్టూ ఉన్న గూండాలని ఇంటెన్స్‌గా చూస్తున్నట్లు పోస్టర్ పవర్‌ఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో కల్యాణ్‌రామ్ కొన్ని డేర్ డెవిల్ స్టంట్స్ చేయనున్నారు. అలాగే ఫైర్ యాక్షన్ ఎపిసోడ్ ప్రధాన ఆకర్షణగా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి చెప్పారు. సీనియర్ నటి విజయశాంతి పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. సోహైల్ ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

బింబిసారకు సీక్వెల్

అలాగే కల్యాణ్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగానే 'బింబిసార 2' కాన్సెప్ట్ పోస్టర్ విడుదల చేశారు. కల్యాణ్‌రామ్ కెరీర్‌లోనే అత్యంత భారీ విజయాన్ని సొంతం చేసుకున్న 'బింబిసార' చిత్రానికి సీక్వెల్ ఉంటుందని మేకర్స్ ఎప్పుడో ప్రకటించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ఆ చిత్రం వివరాలను వెల్లడించారు. బింబిసార కంటే యుగాల ముందు త్రిగర్తల రాజ్యాన్ని ఏలిన లెజెండ్‌ను చూడడానికి సిద్ధంగా ఉండండి' అని శుక్రవారం అనౌన్స్ చేశారు. స్క్రీన్ మీద ఇప్పటిదాకా ఎవరూ చూడనటువంటి స్థాయిలో త్రిగర్తలను ప్రదర్శించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థ నిర్మించే ఈ చిత్రానికి అనిల్ పాదూరి దర్శకుడు.

రజనీ రాజసం



లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న చిత్రం 'కూలీ'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ సాగుతోంది. నెల రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో పాల్గొనేందుకు రజనీకాంత్ ఇటీవలే హైదరాబాద్ చేరుకున్నారు. శుక్రవారం చిత్రీకరణ మొదలుపెట్టినట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. దీంతో పాటు రజనీకాంత్ స్టైల్‌గా కుర్చీలో కూర్చొని రాజసం ఉట్టిపడే లుక్‌లో ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. అనిరుధ్ రవిచంద్రన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

కూలీలో శ్రుతి ఖాయం

'కూలీ' చిత్రంలో శ్రుతీహాసన్ నటించబోతున్నారనే మాట కొన్నాళ్లుగా మీడియాలో వినిపిస్తోంది. కానీ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. శుక్రవారం శ్రుతీహాసన్ ఈ సస్పెన్స్‌కు తెరదించారు. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తన ఫొటోను పోస్ట్ చేసిన శ్రుతీ 'కూలీ డే 1 షూటింగ్' అని రాసుకొచ్చారు. దీంతో ఈ చిత్రంలో ఆమె నటించడం ఖాయమైనట్లే. శ్రుతీహాసన్ ప్రస్తుతం అడివిశేష్ సరసన 'డెకాయిట్' చిత్రంలో నటిస్తున్నారు.

పవర్‌ఫుల్ పెదకాపు




హాస్య నటుడు అలీ కుటుంబానికి చెందిన సదన్ హీరోగా పరిచయమవుతున్న 'ప్రణయ గోదారి' చిత్రంలో పెదకాపుగా ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నారు సాయికుమార్. ఆయన లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర శాసన సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. తమ మునుగోడు ప్రాంతానికి చెందిన పారుమళ్ల లింగయ్య నిర్మిస్తున్న 'ప్రణయగోదారి' విజయం సాధించాలని రాజగోపాల్‌రెడ్డి కోరుకున్నారు. 'ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. అన్నివర్గాల వారినీ అలరించే అంశాలు చిత్రంలో ఉన్నాయి. గోదారి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాలు ప్రేక్షకులను అలరిస్తాయి. అతి త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత పారుమళ్ల లింగయ్య. పి.ఎల్.విఘ్నేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు.


భవిష్యత్తు కాశీలోకి...











విడుదలై వారమైనా హౌస్‌ఫుల్ కలెక్షన్లతో 'కల్కి 2898 ఏ.డీ' బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. శుక్రవారం చిత్రబృందం మూవీ సెట్స్ టూర్‌కు మీడియాను ఆహ్వానించింది. ఈ సందర్భంగా సినిమాలోని భవిష్యత్తు కాశీ సెట్స్‌తో పాటు.. చిత్రంలో పాత్రధారులు వాడిన వివిధ రకాల ఫ్యూచరిస్టిక్ వెహికల్స్‌ను మీడియాకు ప్రదర్శించింది. భవిష్యత్తు కాశీ నగరం సెట్లు..మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఉన్నాయి. ఈ కాల్పనిక జగత్తును చూడటానికి రెండు కళ్లు సరిపోవు అన్నంత అబ్బురపరిచేలా ఆ నిర్మాణాలు ఉన్నాయి. ఆ కాశీ సెట్లలో సినిమాలో భైరవ క్యారెక్టర్ పోషించిన ప్రభాస్ ఉండే పరిసరాలను.. విరామ ఘట్టానికి ముందు ప్రభాస్ భారీ చక్రాన్ని ప్రజల మీద పడకుండా అడ్డుకునే సన్నివేశానికి సంబంధించిన సెట్ ప్రాపర్టీస్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. అలాగే చిత్రంలో వాడిన వాహనాల నమూనాలు.. భవిష్యత్తులో మనుషులు ప్రయాణానికి, రవాణాకు వాడేందుకు ఎంతో సౌకర్యంగా, ముచ్చటగొలిపేలా.. సాంకేతికంగా ఉన్నతంగా ఉన్నాయి. ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత హంగులతో అత్యంత సహజత్వం ఉట్టిపడేలా నిర్మించిన ఆ సెట్లు నిజంగానే మరో ప్రపంచాన్ని పరిచయం చేసి.. భవిష్యత్తు ఎలా ఉంటుందో కళ్లకు కట్టాయి. ఆ సెట్లలో మరో విశేషం ఏంటంటే.. అశ్వత్థామ పాత్రలో ఆకట్టుకున్న అమితాబ్ విగ్రహం. ఆజానుబాహుడంటే ఎలా ఉంటాడో ఆ విగ్రహాన్ని చూస్తే తెలిసేలా ఉంది.

టికెట్ ధరల పెంపుపై సీఎంతో పవన్ చర్చిస్తానన్నారు



సి. అశ్వనీదత్

కొత్త సినిమాలు విడుదలైన ప్రతిసారీ టిక్కెట్ ధరల పెంచాలని ప్రభుత్వాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ఓ విధానం తీసుకురావాలనేదే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిమతమని నిర్మాత సి. అశ్వనీదత్ అన్నారు. టిక్కెట్ ధరల పెంపు అంశం గురించి ఇటీవల ఆయన ఓ ఇంటర్వ్యూలో వెలిబుచ్చిన అభిప్రాయాలపై కొన్ని ఆపోహలు ఏర్పడిన నేపథ్యంలో శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వాటిపై స్పష్టతనిచ్చారు. 'బడ్జెట్‌ను బట్టి టిక్కెట్ ధరలు ఎంతవరకూ పెంచవచ్చు, అలాగే ధరల పెంపు పది రోజులా?, వారమా? అనేది నిర్మాతలంతా కూర్చొని, చర్చించుకొని వస్తే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారితో స్వయంగా చర్చిస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు' అని తెలిపారు.








డబుల్ ఇస్మార్ట్ ముగించారు

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది కొనసాగింపు. 'డబుల్ ఇస్మార్ట్' చిత్రీకరణ పూర్తయినట్లు యూనిట్ శుక్రవారం ప్రకటించింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ శరవేగంగా జరుగుతున్నట్లు యూనిట్ తెలిపింది. ఈ చిత్రంలో రామ్‌కు జోడీగా కావ్యథాపర్ కథానాయికగా నటిస్తున్నారు. సంజయ్‌దత్ పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించనున్నారు. అలీ, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీకౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: సామ్ కె నాయుడు, జియాని గియోన్నెల్లి.



అడవిలో అందాల భామ

తమిళ హీరో ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున కలయికలో తెరకెక్కుతోన్న మల్టీస్టారర్ 'కుబేర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోంది. రష్మిక మందన్న కథానాయిక. శుక్రవారం చిత్రబృందం రష్మిక ఫస్ట్ లుక్, క్యారెక్టర్ ఇంట్రడక్షన్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌లో రాత్రిపూట డబ్బుతో ఉన్న ట్రాలీ బ్యాగ్‌తో అడవిలో నడుచుకుంటూ వెళ్తున్న రష్మిక లుక్ ఆసక్తికరంగా ఉంది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



హాని చేయాలనే తలంపు లేదు



సమంత

టాలీవుడ్ అగ్ర కథానాయిక సమంత వివాదంలో చిక్కుకున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఓ పోస్ట్ వైద్య వర్గాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. గత వారం సమంత నెబ్యులైజర్‌ను ఉపయోగిస్తున్న ఫోటోను షేర్ చేసి, 'వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చినప్పుడు మందులకు బదులుగా హైడ్రోజన్ పెరాక్సైడ్, డిస్టిల్డ్ వాటర్ కలిపి పీల్చితే మేజిక్‌లాగా పనిచేస్తుంది' అని సూచించారు. అయితే ఈ విధానాన్ని కొంతమంది వైద్యులు సోషల్ మీడియాలో తప్పుపట్టారు. అప్పటికే దెబ్బ తిన్న ఊపిరి తిత్తులలోకి హైడ్రోజన్ పెరాక్సైడ్ ప్రవేశిస్తే, న్యుమోనియా సహా పలు వ్యాధులను కలగజేస్తుంది. కొన్నిసార్లు మరణానికి దారి తీస్తుందని హెచ్చరించారు. 'ఇంతకంటే బుద్ధి తక్కువ పని లేదు. సమంతకు ఆరోగ్యం, విజ్ఞానశాస్త్రం గురించి ఏమీ తెలియదు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందుకు ఆమెను జైలుకు పంపాల'ని ఫిలిప్స్ అనే వైద్యుడు సమంతను ఘాటుగా విమర్శించారు. స్పందించాడు. తనపై విమర్శలు రావడంతో స్పందించిన సమంత, మర్యాదకరమైన భాష ఉపయోగించాలని ఆ డాక్టర్‌ను కోరారు. 'ఇవన్నీ నాకు వైద్యులు చెప్పిన సలహాలే , ఎవరికీ చెడు చేయాలనే తలంపు నాకు లేదు. నన్ను లక్ష్యంగా చేసుకునే బదులు, ఈ విధానాన్ని నాకు సూచించిన డాక్టర్‌తో మీరు చర్చ జరిపితే బావుండేద'న్నారు. సమంత వివరణపై శుక్రవారం డాక్టర్ ఫిలిప్స్ స్పందిస్తూ, బాధితురాలిగా చూపించుకునే ప్రయత్నం మానుకోని, నిజా నిజాలు తెలుసుకొనేందుకు ప్రయత్నం చేయాలని సమంతకు సూచించారు. మానిటైజేషన్ కోసమే కొంతమంది సెలబ్రిటీలు ఇలాంటివి చేస్తున్నారని, వారికి ప్రజల ఆరోగ్యం పట్ల బాధ్యత లేదన్నారు.

ఆడపిల్ల తిరగబడితే...



నటి లావణ్య ప్రధాన పాత్ర పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'ఇజ్జత్'. పరువు హత్యల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రమిది. ఉపేంద్ర ఎస్‌పీ దర్శకత్వంలో శ్రీను కందుల నిర్మిస్తున్నారు. శుక్రవారం దర్శకుడు సునీల్‌కుమార్ రెడ్డి 'ఇజ్జత్' టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేంద్ర మాట్లాడుతూ 'ఒక మధ్య తరగతి అమ్మాయి కథే 'ఇజ్జత్' చిత్రం. పరువు హత్యకు సిద్ధపడిన తల్లీతండ్రులకు ఎదురు తిరిగే ధైర్యవంతురాలిగా కథానాయిక కనిపిస్తుంది. ఒక ఆడపిల్ల తిరగబడితే ఎలా ఉంటుందో చెప్పే చిత్రమే మా 'ఇజ్జత్' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'గతంలో పరువు హత్యల మీద వచ్చిన చిత్రాలకు 'ఇజ్జత్' భిన్నంగా ఉంటుంది. కొత్త తరహా కథనంతో క్వాలిటీ విజువల్స్‌తో నిర్మిస్తున్నాం. ఫస్ట్ కాపీ సిద్ధమవుతోంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేశ్ బొబ్బిలి. సినిమాటోగ్రఫీ: వీఆర్‌కే నాయుడు.

మనకథ విననిది రా...



హర్షరోహన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ముఖ్య పాత్రలు పోషించిన ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'టుక్ టుక్'. సుప్రీత్ కృష్ణ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'వరల్డ్ టూర్ నజభజ జజర కథలెన్నో వినరా.. మనకథ విననిది రా' అనే పాటను శుక్రవారం విడుదల చేశారు. దర్శకుడు సుప్రీత్ రాసిన ఈ పాటకు సంగీత దర్శకుడు సంతు ఓంకార్ స్వరాలు అందించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఉండే సరికొత్త ఫాంటసీ ఎలిమెంట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. చిత్రంలోని ప్రతి సన్నివేశం ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేస్తుంది.' అని చెప్పారు. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ ఈ చిత్రానికి నిర్మాతలు.



పాత సంప్రదాయలను ప్రశ్నించే పౌరుషం

షెరాజ్ మెహ్దీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పౌరుషం.. ది మ్యాన్ హుడ్'. అమెరికాకు చెందిన యూవీటీ హాలీవుడ్ స్టూడియో, శ్రేయ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా ట్రైలర్‌ను ఇటీవల లాస్ ఏంజిల్స్‌లో విడుదల చేశారు. ఉమ్మడి కుటుంబంలో ఎదురయ్యే సమస్యలు, పాత సంప్రదాయాలను ప్రశ్నించేలా సినిమా ఉంటుందని ట్రైలర్ చూడగానే అర్థమవుతుంది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్ రెండూ ఉంటాయని ట్రైలర్ ద్వారా స్పష్టం చేశారు మేకర్స్. సుమన్, మేకా రామకృష్ణ, షెరాజ్, అశోక్ ఖుల్లార్, ఆమని, గీతారెడ్డి, జ్యోతిరెడ్డి, శైలజా తివారి, అనంత్, కనక తదితరులు నటించిన ఈ చిత్రాన్ని అశోక్ ఖుల్లార్, దేవేంద్ర నేగి నిర్మిస్తున్నారు.

గెట్ సెట్ గో!

ఏ మోటర్‌సైకిల్?

బిఎస్6 హిమాలయన్ (441సిసి). ఇది ఆఫ్ రోడ్స్‌కు చాలా బాగా పనికొస్తుంది. ఎత్తైన ప్రదేశాలకు తగిన వాహనం.

అద్దె ఎంత?

నాన్ సీజన్‌లో రోజుకు 1500. సీజన్‌లో రోజుకు 2,500 నుంచి 3,000 ఉంటుంది. నార్త్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకూ వేసవి కాలం. అప్పుడు తాపమానాలు ప్రయాణాలకు అనుకూలం కాబట్టి ఎక్కువ మంది సందర్శిస్తూ ఉంటారు.

డ్రైవింగ్ గేర్ సంగతేంటి?

మోకాళ్లకు నీ ప్యాడ్స్, తలకు హెల్మెట్, ఒంటికి జాకెట్

వెంట తీసుకెళ్లిన ఆహారం?

రెడీ టు ఈట్ ఉప్మా, పోహ. అక్కడ ఎవర్ని అడిగినా వేడి నీళ్లు ఇస్తారు. డబ్బాలో ఉన్న ఉప్మా, లేదా పోహాలో వేడినీళ్లు పోసి, ఐదు నిమిషాలు మూత పెట్టి ఉంచితే అవి తినడానికి రెడీ అయిపోతాయి.

పెట్రోల్ నిల్వ చేసుకున్నారా?

బండిలో ట్యాంకు నిండా పెట్రోల్ నింపినా, ఎక్కువ దూరం సెకండ్ గేర్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది కాబట్టి, మైలేజ్ తగ్గిపోతుంది. అందుకని 10 లీటర్ల పెట్రోల్ క్యాన్‌లు రెండు కొని, వాటి నిండా పెట్రోల్ నింపుకుని వెంట తీసుకెళ్లాను.

ఎలా సిద్ధపడాలి?

ప్రాణాయామం సాధన చేయాలి. నడపబోయే వాహనం మీద పట్టు పెంచుకోవాలి. ముందుగానే వెళ్లబోతున్న ప్రాంతం గురించి లోతుగా పరిశోధించుకోవాలి. లగ్జరీ కంటే భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఊహించని పరిణామాలకు ధైర్యంగా ఎదుర్కోగలిగే ఆత్మస్థయిర్యం పెంచుకోవాలి.

న్యూస్ మేకర్



గడ్డకట్టే చలి, ఇసుక గాలులు, కళ్లు తిరిగే లోయలు... ఇవేవీ ఆమెను వెనక్కి లాగలేదు. బండి జారి కింద పడినా, ఏమాత్రం తొణకకుండా ప్రయాణాన్ని కొనసాగించి పట్టుదలగా గమ్యం చేరిందామె. ఆమే హైదరాబాద్‌కు చెందిన హారిక మందలపు. తాజాగా లడాక్‌లోని ఉమ్లింగ్ లా పాస్‌కు మోటర్‌సైకిల్ నడిపిన హారిక 'నవ్య'తో తన సాహసోపేత ప్రయాణ విశేషాలను ఇలా పంచుకుంది.

లడాక్‌లో.. ఒంటరి ప్రయాణం

ఉమ్లింగ్ లా చూడాలన్నది నా కల. అయితే మోటార్‌సైకిల్ మీద వెళ్లాలనే ఆలోచన ముందు నుంచీ లేదు. కనీసం కార్‌లో అయినా అక్కడకు వెళ్లి రావాలని అనుకుంటూ ఉండేదాన్ని. లేహ్, లడాక్ చూడాలనే కోరికతో స్నేహితురాలితో కలిసి శ్రీనగర్ వెళ్లాను. అక్కడున్న వారం రోజుల్లో చూడవలసిన పర్యాటక ప్రదేశాలన్నీ చూసేశాం. తర్వాత నా స్నేహితురాలు తిరుగు ప్రయాణమైంది. నేను మాత్రం ఉమ్లింగ్ లా చూడాలనే కోరికతో లేహ్‌లోనే ఉండిపోయాను. నాకు మోటర్‌సైకిల్ నడపడం వచ్చు. అలాంటప్పుడు ఉమ్లింగ్ లాకు, కారులో కాకుండా మోటర్‌సైకిల్ మీద ఎందుకు వెళ్లకూడదు? అనే ఆలోచన వచ్చింది. దాంతో మంచి కండిషన్‌లో ఉన్న మోటార్‌సైకిల్ కోసం స్థానికంగా ఉన్న రెంటల్ ఏజెన్సీలను కలిశాను. ఒక చోట కొత్త వెహికల్స్ అద్దెకు ఇస్తున్నారు. వాటిలో ఆఫ్‌రోడ్ జర్నీకి ఉపయోగపడే, హిమాలయన్‌ను ఎంచుకున్నాను. అయితే ఆ మోటర్‌సైకిల్‌ను నేను అంతకు ముందు నడపలేదు. కాబట్టి అలవాటు పడడం కోసం స్థానికంగానే రెండు, మూడు రోజులు ఆ బండి మీద తిరిగి డ్రైవింగ్ మీద పట్టు పెంచుకుని తర్వాతే ఉమ్లింగ్ లాకు బయల్దేరాను.

భయం గుప్పిట్లో...


లేహ్ నుంచి ఉమ్లింగ్ లా 375 కిలోమీటర్లు. కాబట్టి ఎక్కడా ఆగకుండా నేరుగా అక్కడి వరకూ ప్రయాణించడం కష్టం. అందుకే నేను మొదటి మజిలీగా హాన్లేను ఎంచుకున్నాను. అలా గత మే 24న ఉదయం నాలుగున్నరకు బయల్దేరి సాయంత్రానికి హాన్లే చేరుకుని, ఆ మరుసటి రోజు ఉమ్లింగ్ లాకు బయల్దేరాను. చలి ఎక్కువగా ఉండడంతో ఉదయం 7 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12:30కి ఉమ్లింగ్ లా చేరుకున్నాను. అక్కడ తట్టుకోలేనంత చలి, పైగా గాలిలో ఆక్సిజన్ తక్కువ. దాంతో 15 నిమిషాలు గడిపి, తిరుగు ప్రయాణమయ్యాను. హాన్లే నుంచి ఉమ్లింగ్ లా వెళ్లి రావడానికి రెండు రోడ్లు ఉంటాయి. ఒకటి తారు రోడ్డు, ఇంకొకటి ఆఫ్ రోడ్. వెళ్లేటప్పుడు తారు రోడ్డు మీద వెళ్లినా, వచ్చేటప్పుడు ఆఫ్ రోడ్‌ను ఎంచుకున్నాను. నిజం చెప్పాలంటే ఇది నా మొట్టమొదటి రిస్కీ జర్నీ. మనకి మనం ఎంత ధైర్యం చెప్పుకున్నా, ఊహించని ప్రమాదాలు, వాతావరణ పరిస్థితులు మనల్ని భయాందోళనలకు గురి చేస్తూనే ఉంటాయి. ఇలాంటి ప్రయాణాల్లో ఇవన్నీ సహజం.

గుండెలు ఝల్లుమన్నాయి

నాకు ఎత్తైన ప్రదేశాలంటే భయం. ఉమ్లింగ్ లా ప్రయాణమంతా ఎత్తుకే సాగుతూ ఉంటుంది. పైగా రోడ్డు అంచునే లోయ, తల పక్కకి తిప్పి చూస్తే, కళ్లు తిరగడం ఖాయం. ఏటవాలుగా బండిని కిందకు దింపేడప్పుడు, మలుపులు తిప్పేటప్పుడు గుండెలు ఝల్లుమంటూ ఉంటాయి. అయినా ధైర్యాన్ని కూడదీసుకుని వీలైనంత నెమ్మదిగా బండిని నడపడం మొదలుపెట్టాను. వీచే గాలులతో పాటు ఇసుక లేచి, రోడ్డు మీద పడిపోతూ ఉంది. అలా ఒక మలుపులో రోడ్డు మీద పడి ఉన్న ఆ ఇసుక వల్ల మోటర్‌సైకిల్ స్కిడ్ అయి, పడిపోయింది. దాంతో ఇక నా పని అయిపోయింది అనుకున్నాను. విపరీతంగా భయపడ్డాను. కానీ అదృష్టవశాత్తూ బండికీ, నాకూ ఎలాంటి ప్రమాదం జరగలేదు. మళ్లీ బండి లేపి, ప్రయాణాన్ని కొనసాగించాను. తిరిగొచ్చేటప్పుడు చలికి నా కుడి చేయి మొద్దు బారింది. అప్పుడు బండిని ఆపేసి, నాకు తెలిసిన ఆక్యుపంక్చర్ చికిత్సతో సమస్యను సరిదిద్దుకున్నాను. ఇలాంటి అవసరాలకు అక్కరకొస్తుందనే నా జాకెట్‌లో ఆక్యుపంక్చర్ కిట్‌ను ఉంచుకున్నాను. ఈ ప్రయాణంలో నాకూ, బండికీ ఇద్దరికీ ఇంధనాన్ని నిల్వ చేసుకున్నాను. ఆ మార్గంలో హోటళ్లూ, పెట్రోల్ బంకులూ ఉండవు కాబట్టి రెడీ టు ఈట్ ఉప్మా, పోహా లాంటివి ప్యాక్ చేసుకున్నాను. బండి కోసం రెండు పది లీటర్ల క్యాన్స్‌లో పెట్రోల్ నింపుకున్నాను. బండి అద్దెకిచ్చిన అతనే నాకొక రైడర్స్ జాకెట్ ఇచ్చాడు. అది చలికి చాలా బాగా ఉపయోగపడింది.

ఉమ్లింగ్ లా లాంటి ప్రదేశాలకు మోటర్‌సైకిల్ మీద వెళ్లాలంటే ఎంతో ముందుగానే సిద్ధపడాలి. స్వతహాగానే మోటర్‌సైకిళ్లను నడుపుతూ ఉండే నేను వాటి మైనర్ రిపేర్ల గురించి ముందుగానే అవగాహన పెంచుకున్నాను. అలాగే బరువైన బండి కింద పడిపోతే దాన్ని సునాయాసంగా లేపగలిగే టెక్నిక్స్ నేర్చుకున్నాను. బ్రీదింగ్ ఎక్సర్‌సైజెస్ సాధన చేశాను.

మాది హైదరాబాదే! కానీ 2013లో నాన్నగారు పోయాక, అమ్మ హిమ, నేనూ బెంగుళూరులో స్థిరపడ్డాం! అమ్మానాన్న, చిన్నప్పటి నుంచీ నన్నెంతో ధైర్యంగా పెంచారు. ఈ ప్రయాణం గురించి చెప్పినప్పుడు మొదట అమ్మ కంగారుపడినా, తర్వాత ప్రోత్సహించింది. హాన్లే నుంచీ ఫోన్ సిగ్నల్స్ ఉండవు. అప్పటివరకూ అమ్మతో మాట్లాడుతూనే ఉన్నాను. ఇక ముందు విదేశాలకు కూడా రైడింగ్, డ్రైవింగ్ చేయాలని ఉంది. అలాగే ఆక్యుపంక్చర్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కూడా ఉంది. ఈ జర్నీలో హాన్లే వెళ్లే దార్లో కనిపించిన నీలం రంగు ఇండస్ నది, బౌద్ధారామాలను జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేను. లడాక్ మహిళల సోలో ట్రావెలింగ్‌కు ఎంతో సురక్షితమైన ప్రదేశం. అక్కడి ప్రజలు మంచివాళ్లు, వినమ్రంగా ఉంటారు. ఆడదాన్ని అనే కారణంగా అక్కడ నేనెలాంటి ఇబ్బందులూ ఎదుర్కోలేదు. మహిళలు బైక్ మీద ఉమ్లింగ్ లా వెళ్లాలనుకుంటే, స్వీయ శక్తినీ, సామర్థ్యాన్నీ అవసరానికి మించి ఊహించుకోకుండా, వాస్తవికంగా ఆలోచించాలి. గుండెధైర్యం ఉండాలి, కానీ తెగింపు ఉండకూడదు.



● గోగుమళ్ల కవిత

మేకప్

కాస్మటిక్స్ కాలమెంత?

కాస్మటిక్స్ రకం, వాటిని నిల్వ చేసే ప్రదేశం, నిల్వ చేసే విధానాలను బట్టి అవి రెండేళ్ల నుంచీ, మూడు నెలలలోపే కాలం చెల్లిపోతాయి. కాబట్టి ఏ సౌందర్యసాధనాన్ని ఎంత కాలం వాడుకోవచ్చో తెలుసుకుందాం!

ఎక్స్‌పైరీ డేట్ అర్థం?

మేకప్ సామాగ్రి పైన 'పిఎఒ'(పీరియడ్ ఆఫ్ ఓపెనింగ్), కొన్ని నంబర్ల పక్కన 'ఎమ్'(మంత్స్) అనే అక్షరాలు ముద్రించి ఉంటాయి. వీటిని బట్టి ఆ కాస్మటిక్‌ను తెరచిన రోజు నుంచి ఇంకా ఎన్ని నెలలు మిగిలి ఉన్నాయో లెక్కించి, వాడుకోవాలి. అదే వాటి షెల్ఫ్ లైఫ్. కాలం చెల్లిన కాస్మటిక్స్ వాటి నాణ్యతను కోల్పోతాయి. కాబట్టి ఉపయోగించినా ఫలితం ఉండదు. లిప్ లైనర్, ఐ లైనర్ లాంటి వాటిని చెక్కుకుని, వాడుకునే వెసులుబాటు ఉంటుంది కాబట్టి, వాటికి దీర్ఘకాల ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది.

ఇలా కనిపెట్టాలి



మస్కారా, ఐ మేకప్‌ల షెల్ఫ్ లైఫ్ తక్కువ. కన్‌సీలర్లకు 12 నెలలు, ఫ్రాగ్రెన్స్‌లకు ఐదేళ్ల షెల్ఫ్ లైఫ్ ఉంటుంది. అయితే ఈ ఎక్స్‌పైరీ డేట్లు కాస్మటిక్స్ పైన కాకుండా, ప్యాకేజింగ్‌ల మీద ముద్రించి ఉంటాయి. కాబట్టి వాటిని పారేసే ముందు, ఈ డేట్లను గమనించాలి. ఒకవేళ కాస్మటిక్స్ ఎక్స్‌పైరీ డేట్ గురించిన అయోమయం ఉంటే, అవి పాడైపోయాయని నిర్ధారించుకోవడం కోసం వాటిలో ఈ తేడాలను గమనించాలి.

- **వాసన:** వాటి నుంచి మంచి వాసన రావడం లేదంటే వెంటనే వాటిని పారేయాలి.
- **రంగు:** చాలావరకూ కన్‌సీలర్లు గాల్లోని ఆక్సిజన్‌తో రసాయనిక చర్య జరిగి ఆక్సిడైజ్ అవుతాయి. దాంతో లేత నారింజ రంగులోకి మారతాయి.
- **టెక్స్‌చర్:** కాలంతో పాటు కాస్మటిక్స్ టెక్స్‌చర్ కూడా మారుతుంది. అప్లై చేసుకున్నప్పుడు తేడాను గ్రహిస్తే, వాటిని పారేయడమే మంచిది.

ఎప్పుడు పారేయాలి?

- **సీరం:** డ్రాపర్‌ను కలిగి ఉండే ఇలాంటి కాస్మటిక్స్ తరచుగా గాలికి బహిర్గతమవుతూ ఉంటాయి కాబట్టి వీటిని 9 నెలలకు మించి వాడకూడదు. డ్రాపర్ బదులుగా పంప్ లాంటి ఏర్పాటు ఉన్నవి ఏడాది పాటు మన్నుతాయి.
- **ఐ మేకప్:** ఈ కాస్మటిక్స్‌తో కళ్లు మండినా, దురదలు పెట్టినా, ఐ ఇన్‌ఫెక్షన్ మొదలైనా వాటిని వెంటనే పారేయాలి.
- **ఫౌండేషన్:** దీనికి 6 నుంచి 12 నెలల్లోగా కాలం చెల్లుతుంది.
- **పౌడర్ కన్‌సీలర్:** రెండేళ్ల షెల్ఫ్ లైఫ్ కలిగి ఉంటుంది.
- **లిక్విడ్ ఐలైనర్:** దీని షెల్ఫ్ లైఫ్ ఆరు నెలలు
- **ఐబ్రో జెల్:** ఏడాది
- **ఐ షాడో:** రెండేళ్లు
- **బ్లష్:** రెండేళ్లు
- **లిప్‌స్టిక్:** రెండేళ్లు
- **లిప్ గ్లాస్:** ఏడాది.

వాక్కాయ షర్బత్

లవంగార్ద్రక సంయుక్తం సుపిష్టం వారిణాయుతమ్!
కారమర్ద కరైర్మర్ద్య సప్తభాగ సితాన్వితా!!

వాక్కాయని 'వాక కాయ' అంటారు. 'వాకం' అంటే అనుకూలంగా పని చేసేదని. పొదలాగా ఎత్తుగా పెరిగే ముళ్లతో కూడిన అడవి మొక్క ఇది. రోడ్డు పక్కన కూడా పెరుగుతుంది. 'అశోకుడు రహదారులకు ఇరువైపులా చెట్లు నాటించెను' అని చదువుకున్నాం. కానీ ఆధునికత పేరుతో రోడ్డు పక్కన ఇప్పుడు చెట్లు అరుదైపోయాయి. అడవుల్ని కూడా ఇష్టారాజ్యంగా నరికేస్తున్నాం. వీటివల్ల పర్యావరణానికి హాని జరుగుతోంది. విరివిగా దొరికే వాక్కాయ లాంటి ఔషధ గుణాలున్న చెట్లు కనిపించకుండా పోతున్నాయి. వాక్కాయ అందరికీ అనుకూలంగా ఉండే ఫలం. దీనికి 'కలిమి' కాయలనే మరో పేరుంది. 'కలే చెట్టు, కరండ, కలే కాయలు, కలివి కాయలు' అని కూడా వీటిని పిలుస్తారు. కరీంనగర్ జిల్లాలో 'ఊడుగు' పండ్లు అంటారు. ఉత్తరాదిలో 'కరోండా'గా పిలుస్తారు.

పచ్చి కాయలు లేత ఆకుపచ్చ రంగులో, ముదిరినవి తెలుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి. లోపల గుజ్జు ఎర్రగా ఉంటుంది. పండిన తరువాత నలుపు రంగుకు మారుతుంది. అందుకని 'కృష్ణ పాక ఫలం' అంటారు. చెర్రీ పండ్లకు బదులుగా వాక్కాయల్నే ఎర్ర రంగు కలిసిన పంచదార పాకంలో ఉడికించి వాడుతుంటారు. తీపి కలిసిన వాక్కాయ మంచిదే గానీ ఆ ఎర్ర రంగే ప్రమాదకరం.

పచ్చి వాక్కాయల్ని ఎండిస్తే ఎండు ద్రాక్షలా నల్లగా ఉంటాయి. వగరుగా, తియ్యగా, పులపుల్లగా రాతి ఉసిరి కాయ రుచిలో ఉంటాయి. ఆలస్యంగా అరుగుతాయి. జీర్ణం అయ్యాక ఎసిడిటీని పెంచుతాయి. వాత వ్యాధుల్లో మేలు చేస్తాయి. గుండెకి మంచిది. జీర్ణశక్తిని పెంచి, ఆకలిని కలిగిస్తాయి. నాలుక మీద జిగురు తగ్గించి, అన్నహితవు పుట్టిస్తాయి. పచ్చికాయ తింటే గొంతు నుసగా అనిపిస్తుంది. గొంతుకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు వీటిని తినవద్దు. పండితే ఎక్కువ మేలు చేసే గుణాలున్నాయి. తేలికగా అరుగుతాయి. ఎసిడిటీని కలిగించవు. వాతాన్ని, పైత్యాన్ని, కఫాన్ని తగ్గిస్తాయి. అందుకని సాధ్యమైనంత పండిన వాటినే ఎంచుకోండి.

వాక పండ్లకు వాపుని తగ్గించి, మెదడుకి ఉత్తేజం కలిగించే గుణం, కడుపులో నులిపురుగుల్ని చంపే శక్తి ఉన్నాయని ఆధునిక పరిశోధనలు చెబుతున్నాయి. రక్తపుష్టినిచ్చి, నిస్సత్తువను తగ్గిస్తాయి.

పచ్చి కాయలతో పప్పు, పచ్చడి, చేసుకుంటారు. ఊరుగాయ పచ్చడి కూడా పెట్టుకుంటారు. జామ్, షర్బత్తులు చేసుకోవటానికి వాకపండు ఎక్కువ తోడ్పడుతుంది. బాగా ముదురు ఎరుపు లేదా నలుపుగా ఉండే వాకపండ్లే మేలు చేస్తాయని గుర్తుంచుకోవాలి. లేత పిందెలుగా ఉన్న వాక్కాయలు వగరు, పులుపు రుచి వల్ల మగరు వ్యాధి ఉన్నవారికి అనుకూలం.

వాతహృద్ధచిదం బల్యం హృద్యమ్ అమ్లతరం స్మృతమ్!
రక్తపిత్తకరం చోక్తమకత్యంకార మర్దకమ్!

వాకపండు పానకం వాతాన్ని తక్షణం తగ్గిస్తుంది. ఆకలిని పెంచుతుంది. బలాన్ని, శక్తినీ ఇస్తుంది. కానీ రక్తం పలుచబడేలా చేస్తుంది. బ్లడ్ థిన్నర్లతో సమానంగా పని చేస్తుంది. గుండెకు మేలు చేస్తుంది. రక్తస్రావాలు అవుతున్నప్పుడు దీన్ని తీసుకోకుండా ఉంటేనే మంచిది.

వాక్కాయల్లో ఒక విధమైన జిగురు ఉంటుంది. అదీ మేలు కలిగించేదే. పచ్చికాయ పుల్లగా ఉన్నప్పటికీ దప్పిక తగ్గిస్తుంది. పురుషుల్లో అమితమైన వేడివల్ల వీర్యంలో జీవ కణాలు నశించిపోతుంటాయి. అలాంటి వాళ్లకు ఈ వాక్కాయ షర్బత్తు మంచి ఫలితం ఇస్తుంది. జీవకణాలు పెరుగుతాయి. మన పూర్వులు ప్రకృతిలో ఎన్నిటినో ఆహార యోగ్యంగా మలచుకున్నారు. సీజన్లో దొరికే అన్నిటినీ తినటానికి ప్రయత్నించేవారు. అదే అసలైన జీవన విధానం.

పానకం ఎలాగంటే...

వాక పండుతో పానకం తయారు చేసుకొనే విధానాన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో ఇలా వివరించాడు:

- వాక పండుని శుభ్రపరిచి, ముక్కలుగా తరిగి, మిక్సీ పట్టి గుజ్జులా చేయండి. లోపల గింజ తీసేయండి.
- ఈ గుజ్జుకు ఏడు రెట్లు నీళ్లు కలిపి తగినంత అల్లం, ఉప్పు కూడా వేసి మరోసారి మిక్సీ పట్టండి. ఈ రసం మొత్తం ఏడు కప్పులైతే... దానికి పంచదార ఒక కప్పు కలిపి బాగా చిలకండి.

ఇదే వాకపండు పానకం... లేదా షర్బత్. దీన్ని అప్పటికప్పుడు చేసుకుని తాగటమే ఉత్తమం. ఫ్రిజ్జులో పెట్టుకుని అయినా వాడుకోవచ్చు. ఎక్కువసేపు బయట ఉంటే పులిసిపోతుంది.



● గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



కొన్ని వంటలను తింటే ఆహా.. అంటూ మైమరిచిపోవాల్సిందే. అలాంటి వంటలు కొందరే చేయగలరు. అథెంటిక్ స్టయిల్‌లో వంటలు చేయటంలో ఒకొక్కరిదీ ఒక్కో స్టయిల్. రాజుగారి కోడిపులావ్, పుదీనా పనీర్ వేపుడు, అమృత ఫల్.. డిష్‌లనూ మీరూ సులువుగా చేసుకోవచ్చు ఇలా..

అమృత ఫల్

కావాల్సిన పదార్థాలు

మామిడికాయ- 1, వాటర్ మిలన్- 1 కివీ ఫ్రూట్-1, నానబెట్టిన సబ్జా గింజలు- టేబుల్ స్పూన్

తయారీ విధానం

ముందుగా మామిడికాయ, వాటర్ మిలన్, కివీ పండ్లను వేరువేరుగా ముక్కలు కోసి ప్లేట్‌లో ఉంచుకోవాలి. ఆ ముక్కలను వేరువేరు జార్‌లలో వేసి మిక్సీ పట్టుకుని పక్కన ఉంచుకోవాలి.

మొదట గ్లాసు తీసుకుని అందులో సబ్జా గింజలు వేసి కింద కివీ జ్యూస్ వేసి దాని మీద మామిడి పండు రసం.. చివరగా వాటర్ మిలన్ జ్యూస్ వేయాలి. ఈ మూడు రంగుల అమృత ఫల్ రుచిగా ఉంటుంది.

ఆహా.. ఏమి రుచి!

రాజుగారి కోడిపులావ్

కావాల్సిన పదార్థాలు

చికెన్- ముప్పావు కేజీ, పచ్చిమిర్చి- 6, ఉల్లిపాయ- 1 (పొడవుగా కట్ చేసుకోవాలి), బాస్మతి బియ్యం- 2 కప్పులు, నెయ్యి- 2 టేబుల్ స్పూన్లు, నూనె- 2 టేబుల్ స్పూన్లు, యాలకులు-4, లవంగాలు-4, దాల్చిన చెక్క- రెండు చిన్న ముక్కలు, బిర్యానీ ఆకు-1, జీడిపప్పులు- 12, ఉల్లిపాయ ముక్కలు- 1 కప్పు, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు, పసుపు- చిటికెడు, కారం పొడి- టేబుల్ స్పూన్, గరం మసాలా- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, పెరుగు- మూడు టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- టేబుల్ స్పూన్, పుదీనా- పావు కప్పు



తయారీ విధానం

ముందుగా చికెన్‌ను శుభ్రంగా కడిగి ఉంచుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయను పొడవుగా కట్ చేసుకుని వేయించుకోవాలి. వేయించిన చల్లార్చిన ఉల్లిపాయ మిశ్రమంతో పాటు పచ్చిమిర్చిని జార్‌లో వేసి మిక్సీ పట్టుకోవాలి. ఈ మెత్తటి పేస్ట్‌ను పక్కన ఉంచుకోవాలి.

ఇపుడు బౌల్‌లో బియ్యం వేసి నీళ్లు పోయాలి. ఇరవై నిముషాలు నానబెట్టాలి. ఆ తర్వాత కుక్కర్‌లో నెయ్యి వేసి, నూనె వేసి గరిటెతో కలపాలి. యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు వేసి కలిపాక జీడిపప్పులు, ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయ ముక్కలు బంగారు రంగు వచ్చిన తర్వాత అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత ముందు మిక్సీ పట్టిన పచ్చిమిర్చి పేస్ట్ వేసి కలపాలి. ఇందులో కొద్దిగా పసుపు, కారంపొడి, గరం మసాలా, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. రెండు నిముషాలయ్యాక చికెన్ వేసి కలపాలి. నాలుగు నిముషాల తర్వాత పెరుగు, కొత్తిమీర, పుదీనా వేసి కలిపి ఆరు నిముషాల పాటు కుక్ చేయాలి. ఆ తర్వాత నాలుగు గ్లాసుల వేడి నీళ్లు పోయాలి. కుక్ చేస్తే పొంగు వస్తుంది. చికెన్ ఉడికిన తర్వాత నానబెట్టుకున్న బియ్యం ఇందులో వేయాలి. మంటను తగ్గించి కుక్కర్ మూత ఉంచి ఒక్క విజిల్ వచ్చేంత వరకూ కుక్ చేయాలి. రాజుగారి కోడి పులావ్ రెడీ. వేయించిన ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని వడ్డించుకోవాలి.

పుదీనా పనీర్ వేపుడు

కావాల్సిన పదార్థాలు

పనీర్- 300 గ్రాములు, నూనె- రెండు టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి- 6 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 4 (పొడవుగా సన్నగా కట్ చేసుకోవాలి), క్యాప్సికం- 1 (చతురస్రాకారంలో కట్ చేసుకోవాలి), పుదీనా- కప్పు, కొత్తిమీర- టేబుల్ స్పూన్, ఉప్పు- తగినంత, నల్లమిరియాల పొడి- కొద్దిగా, గరం మసాలా- అర టీస్పూన్, పసుపు- కొద్దిగా, కారంపొడి- 1 టీస్పూన్, చాట్ మసాలా- టీస్పూన్, నిమ్మరసం- అరటీస్పూన్



తయారీ విధానం

ముందుగా పనీర్ ముక్కలను పొడవుగా కట్ చేసుకోవాలి. ఆ తర్వాత వాటిని సగానికి అడ్డంగా కట్ చేయాలి. స్టవ్‌మీద కడాయిని ఉంచి కాస్త వేడయ్యాక నూనె వేయాలి. నిముషం తర్వాత వెల్లుల్లి ముక్కలు, పచ్చిమిర్చి, క్యాప్సికం వేసి రెండు నిముషాల పాటు కలపాలి. శుభ్రంగా కడిగిన పుదీనా, కొత్తిమీర వేసి కలపాలి. నల్లమిరియాల పొడి, ఉప్పు వేసి నిముషం పాటు కలపాలి. గరం మసాలా, పసుపు, కారంపొడి, చాట్ మసాలా వేసి నిముషం పాటు కలిపాక పనీర్ ముక్కలను వేసి కొద్దిగా నిమ్మరసం వేసి నిముషం పాటు కలపాలి.

పనీర్ ముక్కలు పసుపు రంగులోకి మారుతాయి. పుదీనా పనీర్ వేపుడు రెడీ.



చెఫ్ యాదగిరి, 99899 61488
వివాహ భోజనంబు, జూబ్లీహిల్స్, హైదరాబాద్

స్పోర్ట్స్

ఆసియా బిలియర్డ్స్ ఫైనల్లో పంకజ్



రియాద్: స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అద్వానీ ఆసియా బిలియర్డ్స్ టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ టైటిల్ సాధించేం దుకు అడుగుదూరంలో నిలిచాడు. ఈ వెటరన్ ఆటగా డు వరుసగా మూడోసారి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 5-0తో భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారిని చిత్తుగా ఓడించాడు.

క్వార్టర్స్‌లో గాయత్రి జోడీ

రజావత్ కూడా .. కెనడా ఓపెన్

కాల్గరీ (కెనడా): తెలుగమ్మాయి గాయత్రీ గోపీచంద్ కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం రాత్రి జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో గాయత్రి-ట్రీసా జాలీ జంట 17-21, 21-7, 21-8తో ఆంథోనీ సెన్ (డెన్మార్క్)-అలిసా (నెదర్లాండ్స్) జోడీపై గెలిచింది. ఇక, పురుషుల సింగిల్స్‌లో యువ కెరటం ప్రియాన్షు రజావత్ తన జోరు కొనసాగిస్తూ క్వార్టర్స్ చేరాడు. ప్రపంచ 39వ ర్యాంకరైన రజావత్ 21-19, 21-11తో 33వ ర్యాంకర్ టకుమా ఒబయాషి (జపాన్)ని చిత్తు చేశాడు. రజావత్, గాయత్రీ జోడీలు మినహా మిగతా భారత షట్లర్లంతా ప్రీక్వార్టర్స్‌లోనే నిష్క్రమించారు. సింగిల్స్‌లో అనుపమ, తాన్య, డబుల్స్‌లో కృష్ణప్రసాద్-సాయి ప్రతీక్ ద్వయం, మిక్స్‌డ్‌లో రోహన్-రుత్విక జంట పరాజయం పాలయ్యారు.

నా కల నెరవేరింది



మహ్మద్ సిరాజ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీ20 వరల్డ్‌కప్ సాధించిన భారత జట్టు సభ్యుడు, పేసర్ మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్‌లో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సిరాజ్ మాట్లాడుతూ అభిమానుల ప్రేమ, మద్దతు చూస్తుంటే మనసు పులకరిస్తోందన్నాడు. టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించడం గర్వంగా ఉందని, వరల్డ్‌కప్ ముద్దాడాలన్న తన కల నెరవేరినందుకు ఆనందంగా ఉందని చెప్పాడు. అనంతరం మెహిదీపట్నం నుంచి దాదాపు 2 కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. అంతకుముందు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో హెచ్‌సీఏ సీఈఓ సునీల్..సిరాజ్‌కు స్వాగతం పలికాడు.

కుర్రాళ్లకు భలే చాన్స్

జింబాబ్వేతో భారత్ టీ20 సిరీస్ నేటి నుంచి

సాయంత్రం 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



కోచ్ లక్ష్మణ్, కెప్టెన్ గిల్

హరారే: టీ20 ప్రపంచకప్ విజయం ఇంకా తాజాగా ఉండగానే.. భారత జట్టు కొత్త తరం ఆటగాళ్లతో మరో పొట్టి సిరీస్‌కు సిద్ధమైంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో పూర్తిగా యువ ఆటగాళ్లతో కూడిన ఈ టీమ్ నేటి నుంచి జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. రెండేళ్ల తర్వాత ఇరు జట్లు తలపడబోతున్నాయి. అలాగే 2026లో జరిగే మరో టీ20 మెగా టోర్నీ వరకు భారత్ 34 మ్యాచ్‌లు ఆడనుంది. వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జడేజా రిటైర్మెంట్ తర్వాత భారత జట్టు ఆడుతున్న తొలి ద్వైపాక్షిక సిరీస్ ఇదే. దీంతో ఇప్పటినుంచే టీమిండియా తమ భవిష్యత్ స్టార్ల వేటలో పడింది. సీనియర్లందరికీ విశ్రాంతినివ్వడంతో తాజా జట్టులో చాలామంది ఆశావహులకు చోటు దక్కింది. జట్టులో తమ స్థానం సుస్థిరం చేసుకునేందుకు వారికిది సువర్ణావకాశం. ముఖ్యంగా తొలిసారిగా జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న ఐపీఎల్ హీరోలు అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్‌లపై అందరి దృష్టీ నెలకొంది. తొలి టీ20 మ్యాచ్‌లోనూ తుది జట్టులో వీరికి చోటు దక్కే అవకాశం ఉంది. గిల్‌తో అతడి చిన్ననాటి స్నేహితుడు అభిషేక్ శర్మ ఓపెనింగ్ చేయనున్నాడు. సన్‌రైజర్స్ తరఫున అభిషేక్ మెరుపు ఆరంభాలను అందించిన విషయం తెలిసిందే. ఇక, రుతురాజ్ వన్‌డౌన్‌లో దిగుతాడు. పరాగ్ నాలుగు, రింకూ ఐదో స్థానాల్లో మిడిలార్డర్‌లో ఇన్నింగ్స్‌ను కదం తొక్కించగలరు. వికెట్ కీపర్‌గా జితేశ్, జురెల్ మధ్య పోటీ ఉంది. ప్రస్తుతం భారత్‌లో ఉన్న దూబే, జైస్వాల్, శాంసన్ మూడో మ్యాచ్‌నుంచి అందుబాటులో ఉంటారు. వీరి రాకకు ముందే పలువురు యువ ఆటగాళ్లు తమ నైపుణ్యాన్ని పరీక్షించుకునే చాన్స్ ఉంటుంది. అవేశ్, ఖలీల్, ముకేశ్‌లతో కూడిన పేస్ త్రయం సవాల్‌గా మారనున్నారు. మరోవైపు స్టార్ ఆల్‌రౌండర్ సికందర్ రజా కెప్టెన్సీలో జింబాబ్వే సంచలన ఫలితం కోసం ఎదురుచూస్తోంది. రజా ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు ఆడినవాడే కావడంతో భారత ఆటగాళ్లపై అవగాహన ఉంటుంది. చటారా, మసకద్జ, మధెవెరె, క్యాంప్‌బెల్ ఇతర కీలక ఆటగాళ్లు. ఇప్పటిదాకా ఇరు జట్ల మధ్య 8 మ్యాచ్‌లు జరగగా, 6-2తో భారత్ ఆధిక్యంలో ఉంది.



జింబాబ్వే సారథి సికందర్

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), అభిషేక్, రుతురాజ్, పరాగ్, రింకూ సింగ్, జురెల్, సుందర్, బిష్ణోయ్, అవేశ్, ఖలీల్, ముకేశ్.

జింబాబ్వే: సికందర్ రజా (కెప్టెన్), మరుమని, ఇన్నోసెంట్, బ్రియాన్, మధెవెరె, మడండె, క్యాంప్‌బెల్, జోంగ్వే, మసకద్జ, ఎన్‌గరవ, ముజరబాని.

ప్రజ్ఞానంద, గుకేశ్‌లకు తప్పని డ్రా

బుఖారెస్ట్ (రొమేనియా): సూపర్ బెట్ క్లాసిక్ చెస్ టోర్నమెంట్ ఎనిమిదో రౌండ్లోనూ డ్రాల పరంపరే కొనసాగింది. ఒక్క గేమ్‌లో కూడా ఫలితం రాలేదు. ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన ఎనిమిదో రౌండ్‌ను ప్రజ్ఞానంద్ల డ్రాగా ముగించాడు. అనీష్ గిరి (నెదర్లాండ్స్)తో గేమ్‌ను గుకేశ్ డ్రా చేసుకున్నాడు. అలీరెజాతో నెపోమ్నియాచి, నోదిర్‌బెక్‌తో డీక్ బోగ్డాన్, మాగ్జిమ్‌తో వెస్లీ పాయింట్ పంచుకున్నారు. మరొక్క రౌండ్ మిగిలున్న టోర్నీలో కరువానా (5) టాప్‌లో కొనసాగుతుండగా, ప్రజ్ఞానంద, గుకేశ్, అలీరెజా తలా 4.5 పాయింట్లతో సంయుక్తంగా రెండోస్థానంలో ఉన్నారు.

సెమీస్‌లో స్పెయిన్

జర్మనీపై 2-1తో గెలుపు ● యూరో కప్

హాంబర్గ్: యూరో కప్ ఫుట్‌బాల్ సమరంలో స్పెయిన్ సత్తా చాటింది. జర్మనీపై మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం ఉత్కంఠగా సాగిన క్వార్టర్‌ఫైనల్ పోరులో స్పెయిన్ 2-1తో జర్మనీపై గెలుపొందింది. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. స్పెయిన్ తరఫున డాని ఓల్మో (51వ), జర్మనీ నుంచి ఫ్లోరియన్ (89వ) చెరో గోల్ కొట్టారు. దీంతో ఫలితం కోసం దారితీసిన ఎక్స్‌ట్రా టైమ్‌లో మికెల్ మెరినో 119వ నిమిషంలో గోల్ సాధించి స్పెయిన్‌కు విజయాన్ని అందించాడు. శనివారం జరిగే క్వార్టర్‌ఫైనల్స్‌లో ఇంగ్లండ్‌తో స్విట్జర్లాండ్ (రా. 9.30 నుంచి), నెదర్లాండ్స్‌తో టర్కీ (అర్ధరాత్రి 12.30 నుంచి) తలపడనున్నాయి.

సఫారీల బోణీ

తొలి టీ20లో భారత్ ఓటమి

పోరాడిన జెమీమా, మంధాన



బ్రిట్స్ (81)

చెన్నై: భారత పర్యటనలో దక్షిణాఫ్రికా మహిళల జట్టు ఎట్టకేలకు విజయం రుచి చూసింది. శుక్రవారం జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో సఫారీలు ఆల్‌రౌండ్‌షోతో భారత్‌పై 12 పరుగుల తేడాతో నెగ్గారు. ఇంతకుముందు మూడు వన్డేలు, ఓ టెస్టులో పర్యాటక జట్టు చిత్తయిన విషయం తెలిసిందే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్లకు 189 పరుగులు చేసింది. ఓపెనర్ తజ్‌మిన్ బ్రిట్స్ (81) కీలక ఇన్నింగ్స్‌తో ఆఖరి బంతికి వెనుదిరిగింది. మరో ఓపెనర్, కెప్టెన్ వోల్వార్ట్ (33) వేగంగా ఆడడంతో తొలి వికెట్‌కు 50 రన్స్ జత చేరాయి. ఆ తర్వాత బ్రిట్స్‌కు మరిజానె కాప్ (57) జత కట్టడంతో భారత బౌలర్లు వికెట్ కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. 30 బంతుల్లో కాప్, 40 బంతుల్లో బ్రిట్స్ అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. రెండో వికెట్‌కు 90 పరుగులు జత చేశాక 17వ ఓవర్‌లో కాప్‌ను రాధా యాదవ్ అవుట్ చేసింది. అదే ఓవర్‌లో బ్రిట్స్ రెండు సిక్సర్లు, తర్వాతి ఓవర్‌లో రెండు ఫోర్లతో మొత్తం 32 రన్స్ రాబట్టింది. కానీ చివరి రెండు ఓవర్లలో భారత బౌలర్లు 12 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీయడం విశేషం. పూజా వస్త్రాకర్, రాధా యాదవ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

జెమీమా పోరాటం: ఛేదనలో భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 177 పరుగులు చేసి ఓడింది. స్మృతి మంధాన (46) మెరుపు ఆటతీరుకు జట్టు పవర్‌ప్లేలోనే 61 రన్స్ చేసినా మధ్య ఓవర్లలో తడబడింది. 7-14 ఓవర్ల మధ్యలో 49 పరుగులే చేయడం దెబ్బతీసింది. ఆఖర్లో జెమీమా రోడ్రిగ్స్ (53 నాటౌట్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (35) నాలుగో వికెట్‌కు 90 రన్స్ జోడించారు.

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 189/4 (తజ్‌మిన్ బ్రిట్స్ 81, కాప్ 57, వోల్వార్ట్ 33; పూజా వస్త్రాకర్ 2/23, రాధా యాదవ్ 2/40).
భారత్: 20 ఓవర్లలో 177/4 (జెమీమా 53 నాటౌట్, మంధాన 46, హర్మన్ 35; డి క్లార్క్ 1/30, మలబ 1/32).

జాస్మిన్.. అదిరెన్!

ప్రీక్వార్టర్స్‌కు అల్కారజ్, గాఫ్, కీస్



వింబుల్డన్

జాస్మిన్

లండన్: వింబుల్డన్‌లో సీడెడ్ ప్లేయర్ల జోరు కొనసాగుతోంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్, 12వ సీడ్ టామీ పాల్, 10వ సీడ్ దిమిత్రోవ్, మహిళల్లో 2వ సీడ్ కొకొ గాఫ్, 7వ సీడ్ జాస్మిన్ పావొలిని, 12వ సీడ్ మాడిసన్ కీస్, 19వ సీడ్ ఎమ్మా నవారో ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించారు. ఐదుసెట్ల పాటు ఉత్కంఠగా సాగిన మూడోరౌండ్ పోరులో మూడోసీడ్ అల్కారజ్ 5-7, 6-2, 4-6, 7-6(2), 6-2తో అమెరికాకు చెందిన 29వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోపై విజయం సాధించాడు. అల్కారజ్ రెండుసెట్లు కోల్పోయినా, కీలక సమయాల్లో పాయింట్లు రాబట్టి ప్రత్యర్థిపై పైచేయి సాధించాడు. పాల్ 6-3, 6-4, 6-2తో బబ్లిక్ (కజకిస్థాన్)ను, దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-3తో మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్)ను ఓడించారు. ఇక, తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోనున్న జర్మన్ స్టార్, 4వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-2, 6-1, 6-4తో మార్కోస్ గిరోన్ (అమెరికా)పై గెలిచి మూడోరౌండ్ చేరాడు. మహిళల మూడోరౌండ్లో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనలిస్టు జాస్మిన్ (ఇటలీ) 7-6(4), 6-1తో బియాంక ఆండ్రెస్క్యూపై, గాఫ్ (అమెరికా) 6-4, 6-0తో సోనే కర్తల్ (ఇంగ్లండ్)పై, కీస్ (అమెరికా) 6-4, 6-3తో 18వ సీడ్ మార్టా కొస్త్యుక్ (ఉక్రెయిన్)పై, నవారో (అమెరికా) 2-6, 6-3, 6-4తో ష్నిదెర్ (రష్యా)పై నెగ్గగా.. అన్‌సీడెడ్ పౌలా బడోసా (స్పెయిన్) 7-6(6), 4-6, 6-4తో 14వ సీడ్ కసత్కినా (రష్యా)కు షాకిచ్చింది.

యుకీ జోడీ అవుట్: వింబుల్డన్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ పోరాటం ముగిసింది పురుషుల డబుల్స్ రెండోరౌండ్లో యుకీ-అల్బానో (ఫ్రాన్స్) జోడీ 6-4, 4-6, 3-6తో జర్మనీకి చెందిన 8వ సీడ్ ద్వయం టిమ్-కెవిన్ జంట చేతిలో ఓటమిపాలైంది. ఇక, సోదరుడు జేమీ మర్రేతో కలిసి డబుల్స్ బరిలోకి దిగిన లోకల్ స్టార్ ఆండీ మర్రేకు నిరాశే ఎదురైంది. ముర్రే సోదర ద్వయం 6-7(8), 4-6తో రింకీ హిజికట-జాన్ పీర్స్ జంట చేతిలో ఓడింది. మర్రే ఆశలన్నీ మిక్స్‌డ్ డబుల్స్‌పైనే. రదుకానుతో కలిసి మిక్స్‌డ్‌లో ఆడనున్నాడు.

టీమిండియాకు 'మహా' నజరానా రూ. 11 కోట్లు

ముంబై: టీ20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే రూ. 11 కోట్లు నజరానా ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం విధానసభలో జరిగిన కార్యక్రమంలో తమ రాష్ట్రానికి చెందిన విజేత జట్టులోని సభ్యులు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్‌లను షిండే సత్కరించారు.

జియో నుంచి బాహుబలి ఐపీఓ!

రూ.55,500 కోట్ల సమీకరణ.. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏజీఎంలో స్పష్టత



రూ.11.11 లక్షల కోట్ల వాల్యుయేషన్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్‌ఐఎల్) అధినేత ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో భారీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది మార్కెట్‌కు వచ్చే ఈ ఐపీఓ సైజు ఎంత లేదన్నా రూ.55,500 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా. దేశ ఐపీఓ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు మరే కంపెనీ ఇంత భారీ ఐపీఓ జారీ చేయలేదు. 2022లో మార్కెట్‌కు వచ్చిన రూ.21,000 కోట్ల ఎల్‌ఐసీ పబ్లిక్ ఇష్యూనే ఇప్పటి వరకు మన దేశ ఐపీఓ చరిత్రలో అతి పెద్ద ఐపీఓ. రిలయన్స్ జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ వచ్చే నెలలో జరిగే రిలయన్స్ ఇండస్ట్రీస్ అసాధారణ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఒక ప్రకటన చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

సంకేతాలు ఇవే: జియో ఇటీవలే టారిఫ్‌లను 11 నుంచి 27 శాతం వరకు పెంచింది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వెంటనే ఈ విషయంలో జియోను అనుసరించాయి. 5జీ పెట్టుబడులను సొమ్ము చేసుకునేందుకు జియో ప్రయత్నిస్తోంది. వీటికి తోడు జియో వచ్చే ఏడాది ప్రారంభంలో మరోసారి టారిఫ్‌లు పెంచుతుందని అంచనా. ఇవన్నీ జియో ఐపీఓకు సిద్ధమవుతోందనేందుకు సంకేతాలని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చర్యలతో జియో ఏఆర్‌పీయూ మరింత పెరిగి.. ఐపీఓకి పెద్దఎత్తున మదుపరులను ఆకర్షించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

జెఫ్రీస్ సంస్థ అంచనాల ప్రకారం ప్రస్తుతం రిలయన్స్ జియో విలువ 13,300 కోట్ల డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం ఇది దాదాపు రూ.11.11 లక్షల కోట్లకు సమానం. సెబీ నిబంధనల ప్రకారం రూ.లక్ష కోట్ల కంటే అధిక విలువ ఉన్న కంపెనీలు ఐపీఓకు వస్తే కనీసం 5 శాతం ఈక్విటీని జారీ చేయాలి. రూ.11.11 లక్షల కోట్ల వాల్యుయేషన్‌ని ప్రాతిపదికగా తీసుకుంటే జియో తన ఈక్విటీలో ఐదు శాతాన్ని పబ్లిక్ ఇష్యూ ద్వారా జారీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత వాల్యుయేషన్ ప్రకారం అప్పుడు జియో ఐపీఓ విలువ రూ.55,500 కోట్ల వరకు ఉంటుందని మార్కెట్ వర్గాల అంచనా.

బిజినెస్



స్టీల్ రంగానికి మంచి భవిష్యత్

చైనా దిగుమతులను కట్టడి చేయాలి

సెయిల్ చైర్మన్ అమరేందు ప్రకాశ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత్‌లో స్టీల్ రంగానికి మంచి భవిష్యత్ ఉందని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) చైర్మన్ అమరేందు ప్రకాశ్ అన్నారు. ఇండియన్ స్టీల్ అసోసియేషన్ (ఐఎస్‌ఏ) శుక్రవారం నాడిక్కడ నిర్వహించిన 'స్టీల్ ఇన్‌ఫ్రాబిల్డ్ సదస్సు'లో ఆయన ఈ విషయం చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పట్టణ, నగర ప్రాంతాల్లో స్టీల్ వినియోగం ఎక్కువగానే ఉన్నా, ఈ రెండు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్టీల్ వినియోగాన్ని మరింత పెంచాల్సి ఉందన్నారు. ఇందుకోసం సివిల్ ఇంజనీర్లతో పాటు తాపీ పని వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పలు మౌలిక సదుపాయాల కంపెనీలకు కేంద్రంగా మారిన హైదరాబాద్.. స్టీల్ పరిశ్రమకు అత్యంత కీలకమైనదని ప్రకాశ్ తెలిపారు.

స్టీల్ సగటు వినియోగం 97 కిలోలే: సదస్సు అనంతరం సెయిల్ చైర్మన్ ప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ.. మన దేశంలో స్టీల్ పరిశ్రమ భవిష్యత్‌కు ఢోకా లేదన్నారు. ప్రపంచ వార్షిక తలసరి సగటు స్టీల్ వినియోగం ప్రస్తుతం 220 కిలోలు ఉంటే, మన దేశంలో ఇది 97 కిలోలు మాత్రమేనన్నారు. 2030 నాటికి ఇది 120 కిలోలకు చేరే అవకాశం ఉందన్నారు. మౌలిక ప్రాజెక్టులు, నిర్మాణ రంగం జోరందుకోవడంతో గత పదేళ్లలో దేశంలో స్టీల్ వినియోగం రెట్టింపైన విషయాన్ని సెయిల్ చైర్మన్ గుర్తు చేశారు. 2030 నాటికి దేశంలో 30 కోట్ల టన్నుల వార్షిక స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాధ్యమేనని తెలిపారు. ఇందుకు అవసరమైన ఇనుప ఖనిజం నిల్వలూ మన దేశంలో పుష్కలంగా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మరో కీలక ముడి పదార్థమైన మెటలర్జికల్, కోకింగ్ కోల్ విషయంలోనే దిగుమతులపై ఆధారపడాల్సి ఉంటుందని ప్రకాశ్ చెప్పారు.

చైనా దిగుమతులకు చెక్ చెప్పాల్సిందే: ఉత్పత్తి వ్యయం కంటే తక్కువ ధరకు వచ్చిపడుతున్న చైనా స్టీల్ దిగుమతులను కట్టడి చేయడం తప్పనిసరని ప్రకాశ్ అన్నారు. లేకపోతే దేశీయ స్టీల్ పరిశ్రమ మనుగడే ప్రమాదంలో పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. చౌకగా వచ్చిపడుతున్న చైనా స్టీల్ దిగుమతులపై అమెరికా, ఈయూ దేశాలతో పాటు మలేషియా, ఇండోనేషియా దేశాలూ ఇప్పటికే దిగుమతి సుంకాలు భారీగా పెంచిన విషయాన్ని ప్రకాశ్ గుర్తు చేశారు. కాగా ఈ కార్యక్రమంలో జిందాల్ స్టీల్ చైర్మన్, ఐఎస్‌ఏ ప్రెసిడెంట్ నవీన్ జిందాల్, ఉక్కు శాఖ కార్యదర్శి నాగేంద్ర నాథ్ మిశ్రా పాల్గొన్నారు.

డిమాండ్‌కు ఢోకా లేదు

2034 నాటికి 27.5 కోట్ల టన్నుల స్టీల్ వినియోగం

తెలంగాణలో జోరుగా డిమాండ్ : డెలాయిట్

దేశంలో స్టీల్ డిమాండ్‌కు ఢోకా లేదని ప్రముఖ కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్ ఒక నివేదికలో తెలిపింది. 'స్టీల్ ఇన్‌ఫ్రాబిల్డ్ సదస్సు' సందర్భంగా సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం 2033-34 ఆర్థిక సంవత్సరం చివరికి దేశంలో స్టీల్ డిమాండ్ 22.1 కోట్ల టన్నుల నుంచి 27.5 కోట్ల టన్నుల మధ్య ఉంటుందని అంచనా. మౌలిక ప్రాజెక్టుల్లో పెరుగుతున్న ప్రభుత్వ పెట్టుబడులు ఇందుకు ప్రధానంగా దోహదం చేయనున్నాయి. వచ్చే పదేళ్లలో దేశంలో స్టీల్ డిమాండ్ ఏటా సగటున 5 నుంచి 7.3% పెరుగుతుందని నివేదిక తెలిపింది. కాగా ప్రస్తుతం దేశంలో వార్షిక తలసరి సగటు స్టీల్ వినియోగం 93 నుంచి 95 కిలోలుగా ఉండగా తెలంగాణలో మాత్రం ఇది 156.43 కిలోల వరకు ఉందని తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో 54.8 లక్షల టన్నుల స్టీల్ వినియోగమైంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 15.75 శాతం ఎక్కువ. పారిశ్రామికీకరణతో పాటు వేగంగా పెరుగుతున్న ఆర్థిక వృద్ధి భవిష్యత్‌లోనూ తెలంగాణలో స్టీల్ డిమాండ్‌ను మరింత పెంచుతుందని అంచనా వేసింది.

విశాఖ ఉక్కుపై ప్రతిపాదనేదీ రాలేదు..

రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌ఐఎన్‌ఎల్, వైజాగ్ స్టీల్)ను విలీనం చేసుకోవడంపైనా సెయిల్ చైర్మన్ ప్రకాశ్ స్పందించారు. ప్రస్తుతమైతే ఇప్పటి వరకు దీనిపై తమకు స్పష్టమైన ప్రతిపాదన ఏదీ రాలేదన్నారు. పీకల్లోతు నష్టాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వైజాగ్ స్టీల్ ప్లాంటుని ప్రైవేటీకరించే బదులు, ప్రభుత్వ రంగంలోని సెయిల్‌లో విలీనం చేయాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సెయిల్ చైర్మన్ తాజా ప్రకటనను బట్టి చూస్తుంటే, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రతిపాదన వస్తే విశాఖ ఉక్కును సెయిల్ విలీనం చేసుకునేందుకు సిద్ధంగానే ఉన్నట్టు అర్థమవుతోంది.

కొత్త శిఖరంపై నిఫ్టీ

ఆటుపోట్ల మార్కెట్లో నష్టాల్లో సెన్సెక్స్

ముంబై: స్టాక్ మార్కెట్ శుక్రవారం తీవ్ర ఆటుపోట్లతో ట్రేడయినప్పటికీ నిఫ్టీ మాత్రం ఒత్తిడిని తట్టుకుని మరో జీవితకాల రికార్డు స్థాయిలో ముగిసింది. అయితే సెన్సెక్స్ మాత్రం రికార్డు స్థాయిల నుంచి దిగజారి 80,000 పాయింట్ల కన్నా దిగువన క్లోజయింది. ఇది మార్కెట్లో అనిశ్చిత స్థితిని తెలియచేస్తోంది. వరుసగా మూడో రోజు కూడా లాభపడిన నిఫ్టీ 21.70 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 24,323.85 వద్ద ముగిసింది. నిఫ్టీ షేర్లలో 34 లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ మాత్రం 53.07 పాయింట్లు నష్టపోయి 79,996.60 వద్ద ముగిసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 963.87 పాయింట్లు, నిఫ్టీ 313.25 పాయింట్లు లాభపడ్డాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.75 శాతం లాభపడ్డాయి.

- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 3 శాతం లాభపడి 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.3197.65 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో అత్యంత విలువైనదిగా గుర్తింపు పొందిన ఈ షేరు మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.48,723.54 కోట్లు లాభపడి రూ.21,51,562.56 కోట్ల వద్ద క్లోజయింది.
- రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని వేరు చేయనున్నట్టు చేసిన ప్రకటనతో రేమండ్ షేరు 10 శాతం మేరకు దూసుకుపోయింది. ఎన్ఎస్ఈలో ఈ షేరు 9.97 శాతం లాభపడి రూ.3233.05 వద్ద ముగియగా బీఎస్ఈలో 9.68 శాతం లాభపడి రూ.3226.70 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది.

స్టీల్ పాత్రలపై బీఐఎస్ ముద్ర ఉండాల్సిందే

వంట గదుల్లో వాడే స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం పాత్రలపై నాణ్యతా ప్రమాణాలకు చిహ్నమైన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ముద్ర ఉండాల్సిందేనని ప్రభుత్వం అధికారిక ప్రకటన జారీ చేసింది. వినియోగదారుల భద్రత, ఉత్పత్తుల నాణ్యతను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు అనుబంధంగా పని చేస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య శాఖ (డీపీఐఐటీ) మార్చి 14వ తేదీన ఈ నాణ్యతా ప్రమాణ ఉత్తర్వును జారీ చేసింది. బీఐఎస్ ప్రమాణ చిహ్నం లేని స్టెయిన్‌లెస్ స్టీల్, అల్యూమినియం పాత్రల తయారీ, దిగుమతి, విక్రయం, పంపిణీ, నిల్వ, ప్రదర్శన అన్నింటినీ ఈ ఉత్తర్వు నిషేధించింది.

విదేశీ మారక నిల్వలు డౌన్

దేశంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు జూన్ 28వ తేదీతో ముగిసిన వారంలో 171.3 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 65,199.7 కోట్ల డాలర్లకు క్షీణించాయి. జూన్ 7వ తేదీతో ముగిసిన వారంలో ఇవి చారిత్రక గరిష్ఠ స్థాయి 65,581.7 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు 42.7 కోట్ల డాలర్ల మేరకు దిగజారి 5,652.8 కోట్ల డాలర్ల వద్ద స్థిరపడ్డాయి.

సిగ్నిటీలో మరో 17 శాతం వాటా కొనుగోలు

డీల్ విలువ రూ.645 కోట్లు

కోఫోర్జ్

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సిగ్నిటీ టెక్నాలజీస్‌లో మరో 17 శాతం వాటాను రూ.645 కోట్లకు ఐటీ కంపెనీ కోఫోర్జ్ చేజిక్కించుకుంది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సిగ్నిటీలో 16.9 శాతం వాటాకు సమానమైన 46,18,199 షేర్లను కంపెనీ కొనుగోలు చేసింది. ఒక్కో షేరును సగటున రూ. 1,398.50కి కొనుగోలు చేసింది. సిగ్నిటీ వాటాదారులైన కుకునూరు మాధవ లక్ష్మీ, కుకునూరు కుమార్ బాపూజీ సహా కంపెనీ ప్రమోటర్లయిన స్వప్న పీ, వెంకట సుబ్రమణ్యం చక్కిలం నుంచి కోఫోర్జ్ ఈ వాటాలను కొనుగోలు చేసినట్లు బీఎస్ఈ గణాంకాలు వెల్లడించాయి. ఈ ఏడాది మే నెలలో సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 54 శాతం వాటాలను కోఫోర్జ్ చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. గురువారం కూడా కోఫోర్జ్.. సిగ్నిటీ టెక్నాలజీస్‌లో 11 శాతం వాటాను రూ.426 కోట్లకు కొనుగోలు చేసింది.

ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇళ్లకు గిరాకీ

ప్రాప్ఈక్విటీ

జాబితాలో విజయవాడ, గుంటూరు, వైజాగ్

న్యూఢిల్లీ: దేశంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఇళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలోని 30 ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇళ్ల అమ్మకాలు 2.07 లక్షలకు చేరాయి. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువని రియల్టీ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్ఈక్విటీ తెలిపింది. ఈ సంస్థ విడుదల చేసిన ఈ 30 ద్వితీయ శ్రేణి నగరాల జాబితాలో అహ్మదాబాద్, వడోదర, సూరత్, నాసిక్, గాంధీనగర్, జైపూర్, నాగపూర్, భువనేశ్వర్, మొహాలీతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు కూడా ఉన్నాయి. ఈ 30 చిన్న నగరాల్లో గత ఆర్థిక సంవత్సరం అమ్ముడైన ఇళ్లలో 80 శాతం (1.68 లక్షలు).. టాప్-10 నగరాల్లో అమ్ముడైనట్టు ప్రాప్ఈక్విటీ తెలిపింది. మధ్య తరగతికి సైతం అందుబాటు ధరల్లో ఇళ్లు లభించటం, ఈ నగరాల్లో మౌలిక సదుపాయాలు పెరగటంతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతుండడం, పెద్దఎత్తున ఎస్ఎంఈలు ఏర్పాటవుతుండటం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,100 ▲	67,100 ▲	97,700 ▲
ముంబై	72,640 ▲	66,538 ▲	90,709 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	540
చిత్తూరు	573	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	123
వరంగల్	114	గుంటూరు	123
కరీంనగర్	114	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	125
కర్నూలు	114	నెల్లూరు	125
విశాఖపట్నం	124	అనంతపురం	123
గోదావరి	123		



ఐటీ విభాగం సమీక్షలో మంత్రి నారా లోకేశ్, అధికారులు

నాయకుడు ఇలా.. ప్రతినాయకుడు అలా!

» మంత్రి నారా లోకేశ్ ఆసక్తికర పోస్టు

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'నాయకుడు-ప్రతినాయకుడు' అంటూ సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్‌ని ఉద్దేశించి.. మంత్రి నారా లోకేశ్ శుక్రవారం 'ఎక్స్'లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సీఎం చంద్రబాబు తొలి ఢిల్లీ పర్యటనలో అధికారులు, ఎంపీలు, రాష్ట్ర మంత్రులతో కలిసి.. కేంద్ర మంత్రులతో సమావేశం. రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులు, నిధులపై చర్చ. ప్రతినాయకుడి తొలి జిల్లా పర్యటన.. పల్నాడును రావణ కాష్టం చేసి, నెల్లూరు జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ. ఎన్నికల ఫలితాల తర్వాత మాజీ సీఎం పెట్టుకున్న తొలి పర్యటన నెల్లూరు జిల్లా జైలు. ఏపీ సీఎం మలి పర్యటన.. తెలంగాణ సీఎంతో భేటీ. విభజన చట్టంలో సమస్యల పరిష్కారంపై ప్రయత్నం. 1+6+4 సీట్లు వచ్చిన పార్టీ అధ్యక్షుడి మలి పర్యటన.. బాలికలను లైంగికంగా వేధించి, అరెస్టయి కర్నూలు జైలులో ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ" అని నారా లోకేశ్ పోస్టు చేశారు.

ఐటీ, ఎలక్ట్రానిక్స్‌కు కొత్త పాలసీలు: లోకేశ్

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను నెలకొల్పడానికి ఆసక్తి చూపించే వారికి ప్రభుత్వం అన్నివిధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తుందనే నమ్మకం కలిగించేలా చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడుల పర్యవేక్షణ కోసం గతంలో(2019కి ముందు) టీడీపీ ప్రభుత్వం రూపొందించిన ఇన్వెస్ట్‌మెంట్ పోర్టల్‌ను మళ్లీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దానిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని సూచించారు. పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

జగన్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు: పల్లా



అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'జగన్ తీరు మారడం లేదు. ప్రజలే మళ్లీ బుద్ధి చెబుతారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పార్టీ జాతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'జగన్ విధ్వంసకారులను వెనకేసుకొస్తున్నారు. బాబాయి చనిపోతే పట్టించుకోని జగన్.. రూ.25 లక్షలు ఖర్చుపెట్టి జైల్లో ఉన్న ఖైదీని కలవడం సిగ్గుచేటు. జగన్ తీరుతో బీసీలు 16 వేల మంది రాజ్యాధికారం కోల్పోయారు. నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే తీసుకుంటాం. అవాకులు చవాకులు పేలితే ఊరుకోం. 2029లో కూడా ప్రజల మన్ననలతో మళ్లీ కూటమి అధికారంలోకి వస్తుంది. క్రిస్టియన్, మైనారిటీల భూముల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం. వైసీపీ నేతల కబంధ హస్తాల నుంచి వాటిని విడిపిస్తాం' అని పల్లా ప్రకటించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విడిగా మాట్లాడుతూ, సంఘ విద్రోహక శక్తి పిన్నెల్లిని మంచివాడు అని చెప్పడం జగన్‌కే చెల్లుతుందని విమర్శించారు.

పిన్నెల్లి ఈవీఎం పగలకొట్టారని జగనే చెప్పారు

» ఇక చర్యలు తీసుకోవాలి: మంత్రి ఆనం

నెల్లూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం పగలకొట్టింది వాస్తవమని జగన్మోహన్‌రెడ్డే స్వయంగా ఒప్పుకున్నారు. కాబట్టి ఇక ఎలాంటి విచారణ లేకుండా పిన్నెల్లిపై చర్యలు తీసుకోవాలి' అని రాష్ట్ర దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా అభివృద్ధిపై మరో మంత్రి పొంగూరు నారాయణతో శుక్రవారం నెల్లూరులోని తన నివాసంలో ఆనం భేటీ అయ్యారు. వారు మీడియాతో మాట్లాడుతూ.. 'పిన్నెల్లిని పరామర్శించడానికి జగన్ నెల్లూరు వచ్చారా? లేక దొరికిపోయేలా సాక్ష్యం చెప్పడానికి వచ్చారా?' అని ఆనం ఎద్దేవా చేశారు. భవిష్యత్‌లో వైసీపీ మనుగడ సాధించలేదన్న విషయం జగన్ మాటల ద్వారా స్పష్టమైందని ఆనం వ్యాఖ్యానించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'చట్ట ప్రకారం, స్వేచ్ఛగా ఎవరు వ్యాపారం చేసుకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. నెల్లూరు, కడప జిల్లాల్లో జరిగిన లేఅవుట్ల అక్రమాలపై విచారణకు కమిటీలు వేశాం' అన్నారు.

పిన్నెల్లి హత్యల వెనుక జగన్: మంత్రి సుభాశ్

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జైలు ముందు జగన్ మాట్లాడిన మాటలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని మంత్రి వాసంశెట్టి సుభాశ్ విమర్శించారు. శుక్రవారం అమరావతిలో మాట్లాడారు. నేరస్థుడిని జగన్ వెనకేసుకురావడాన్ని తప్పుపట్టారు. 'పల్నాడులో తోట చంద్రయ్య అనే వ్యక్తిని పీకకోసి చంపారు. బొండా ఉమాపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. మంజుల అనే మహిళను గొడ్డలితో నరికారు. పిన్నెల్లి ఫ్యాక్షన్ హత్యల వెనుక జగన్ ఉన్నారు. ఆర్థిక నేరస్థుడైన జగన్ జైల్లో ఉన్న ఓ ఫ్యాక్షనిస్టును కలిశారు. ఇక, సజ్జల, ధనుంజయరెడ్డి వంటి వారిని జైళ్లలో పలకరించడానికే జగన్ తన సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది' అన్నారు.

పులివెందుల హౌసింగ్ లే-అవుట్‌లో అక్రమాలు

» ఎమ్మెల్సీ భూమిరెడ్డి ఫిర్యాదుపై విచారణకు ప్రభుత్వ ఆదేశాలు

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని హౌసింగ్ లే-అవుట్‌లో అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జగన్ ప్రభుత్వ హయాంలో 8వేల ఇళ్ల స్థలాలతో ఏర్పాటు చేసిన ఈ లే-అవుట్‌లో అనర్హులకు ఇళ్లు మంజూరు చేశారని, ఎక్కువగా ధనవంతులు, ఇతర ప్రాంతాలవారు, ఉద్యోగులను లబ్ధిదారులుగా ఎంపిక చేసి.. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారంటూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ఇటీవల సీఎం చంద్రబాబుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్సీలుగా రామచంద్రయ్య, హరిప్రసాద్

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): శాసనమండలిలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా టీడీపీ తరఫున సి.రామచంద్రయ్య, జనసేన తరఫున పి.హరిప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి విజయరాజు శుక్రవారం ప్రకటించారు. ఎమ్మెల్యే కోటా కింద ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాల నామినేషన్ల ఉప సంహరణ గడువు శుక్రవారంతో ముగిసింది.

పిన్నెల్లిని జగన్ పరామర్శించడమేంటి?: దుర్గేశ్

తిరుపతి/తిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఈవీఎంను పగలగొట్టిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమాజంలో పౌరుడిగా ఉండేందుకు కూడా పనికిరాడు. అలాంటి వ్యక్తిని మాజీ సీఎం జగన్ పరామర్శించడం హాస్యాస్పదంగా ఉంది' అని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన తిరుమలలో టూరిజం శాఖ ఏర్పాటు చేసిన 'దేవరాగం' హోటల్‌ను ప్రారంభించారు. రుషికొండపై నిర్మాణాలు ఓ పేదోడు రూ.600 కోట్లు వెచ్చించి కట్టుకున్న చిన్న కుటీరాలు అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన మంత్రి వాటిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

పిన్నెల్లికి రెండు రోజుల పోలీసు కస్టడీ

» నెల్లూరు సెంట్రల్ జైలులోనే విచారణ

మాచర్ల టౌన్, జూలై 5: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ విధిస్తూ మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అడిషనల్ న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ తీర్పునిచ్చారు. మే 13న పోలింగ్ రోజు రెంటచింతల మండలం పాలువాయి గేటు 202 పోలింగ్ బూత్‌లో ఈవీఎం ధ్వంసాన్ని అడ్డుకున్న టీడీపీ కార్యకర్త నంబూరి శేషగిరిరావుపై దాడి, 14న కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై దాడి కేసుల్లో పిన్నెల్లిని నెల్లూరు సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుల్లో పిన్నెల్లికి 2 రోజుల పాటు పోలీసు కస్టడీ విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. నెల్లూరు సెంట్రల్ జైలులోనే విచారణ జరపాలని, వీడియో తీయాలని పేర్కొన్నారు.

ఓఎంసీ టైమ్‌లోనే సరిహద్దులు చెరిపేశారు

బళ్లారి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏపీ-కర్ణాటక సరిహద్దులో.. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) అక్రమ తవ్వకాలు జరిపిన సమయంలోనే ఇతర గనుల సరిహద్దులను చెరిపేశారని టీఎస్ఆర్ మైనింగ్ కంపెనీ లీజుదారుడు సెంట్రల్ ఎంపవర్‌మెంట్ కమిటీ(సీఈసీ) అధికారులకు తెలిపారు. బళ్లారి జిల్లా పరిధిలోని ఏడు లీజు గనుల సరిహద్దులను గుర్తించే క్రమంలో.. శుక్రవారం దోణిమలైలో లీజుదారులతో సమావేశం నిర్వహించారు.

అమరావతికి వచ్చేస్తాం..!

రాజధానికి వచ్చేందుకు 80 శాతం సంస్థలు రెడీ

ముందుకొచ్చిన 104 కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు సంస్థలు

వాటికి కేటాయించిన భూములపై యుద్ధప్రాతిపదికన చర్యలు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమైన సీఎం చంద్రబాబు, టీడీపీ ఎంపీలు

విజయవాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో సంస్థల ఏర్పాటు అంశాన్ని సీఆర్‌డీఏ అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోంది. అమరావతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 130 సంస్థలకు భూములు కేటాయించారు. సీఆర్‌డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం వాటి యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతోంది. ఇక్కడ సంస్థను ఎప్పుడు ఏర్పాటు చేస్తారు.. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు.. వంటి అంశాలపై చర్చిస్తోంది. కార్యాలయాల ఏర్పాటుపై శుక్రవారం నాటికి 80శాతం సంస్థల నుంచి సానుకూలత వచ్చిందని సీఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి. ఇంకా 25కుపైగా సంస్థల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. కొన్ని సంస్థలు వైసీపీ ప్రభుత్వ హయాంలో బెదిరింపుల కారణంగా తరలిపోవటంవల్ల వాటినుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. అమరావతిలో సంస్థల ఏర్పాటు నిమిత్తం మొత్తం 130 సంస్థలకు 1,660 ఎకరాలు కేటాయించారు. అప్పట్లో ఆయా సంస్థలకు కొన్ని లీజు ప్రాతిపదికన, మరికొన్ని అవుట్‌రేట్ సేల్ ప్రాతిపదికన రూ.677.10కోట్ల విలువైన భూములు కేటాయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.546కోట్ల మేర ఆయా సంస్థలు చెల్లింపులు చేశాయి. మరో రూ.131కోట్లు చెల్లించాల్సి ఉంది. రాజధానిలో 45 కేంద్ర సంస్థలకు భూములు కేటాయించగా.. వాటిలో తాజాగా 40 సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి 25 సంస్థలకు భూములు కేటాయించగా దాదాపు వాటన్నింటి నుంచీ సానుకూలత వచ్చింది. మరికొన్ని ప్రైవేటు సంస్థలు సానుకూలంగా స్పందించాయి. మొత్తానికి మరో వారం రోజుల్లో అమరావతిలో ఏర్పాటు కాబోయే సంస్థల మీద స్పష్టత వస్తుంది. రెండు నెలల్లో అవి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు.



కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం

భయపడొద్దు.. రండి!

(మొదటి పేజీ తరువాయి)

వివాదాస్పద ప్రశ్నలు వేసినా తడుముకోకుండా చమత్కరిస్తూ సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే ప్రధాన ఎజెండాగా తన రెండ్రోజుల పర్యటన సాగిందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడంతో పాటు మొత్తం రాష్ట్రాన్ని పునర్నిర్మించడమే ధ్యేయంగా ఢిల్లీలో ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రులతో చర్చలు జరిపానని, అందరి నుంచీ సానుకూల స్పందన వ్యక్తమైందని చెప్పారు. గత ఐదేళ్లుగా జరిగిన నష్టం నుంచి బయటకు రావాలని, అందుకు అనుగుణంగా రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు సహకారం అందించాలని కేంద్రాన్ని కోరామని చెప్పారు. ఏపీ గ్లోబల్ లీడర్‌గా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

పదవులు మాకెప్పుడూ ముఖ్యం కాదు..

టీడీపీకి పదవులు ఎప్పుడూ ముఖ్యం కాదని, వాజపేయి హయాంలో కూడా ఏడు మంత్రిపదవులు ఇస్తామన్నా వద్దన్నామని చంద్రబాబు తెలిపారు. ఎన్డీయేతో సత్సంబంధాల కోసమే బలవంతం మీద నాడు లోక్‌సభ స్పీకర్ పదవి తీసుకున్నామని చెప్పారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు మారాయన్నారు. కేంద్రంలో తమకు కేటాయించిన మంత్రి పదవుల పట్ల సంతోషంగా ఉన్నామని తెలిపారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని కూడా కోరుకోవడం లేదని చెప్పారు. కావాలంటే నా తరఫున మీరు అడగండని చమత్కరించారు. బీజేపీ ఎజెండాకు తాము మద్దతిచ్చామని.. తమ ఎజెండాకు వారు మద్దతిచ్చారని.. రెండు పార్టీలు పరస్పర ఎజెండాలకు అనుగుణంగా పనిచేస్తాయని తెలిపారు. 2014లో మోదీతో ఉన్న సంబంధాలకు, ఇప్పటి సంబంధాలకూ తేడా ఏమిటని ప్రశ్నించగా.. ఆయన నేరుగా జవాబివ్వలేదు. 'నేను ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు మీరెలా చూశారు.. ఇప్పుడెలా ట్రీట్ చేస్తున్నారు? పరిస్థితులు మారాయి కదా..! ఇప్పుడు మేం కలిసి పని చేస్తాం' అని తెలిపారు. ఏపీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించామని మోదీ కూడా చెప్పారని గుర్తుచేశారు.

అదో నిరంతర ప్రక్రియ..

రాజధాని నిర్మాణం నిరంతర ప్రక్రియ అని, హైదరాబాద్ కూడా ఇదే విధంగా అభివృద్ధి చెందిందని సీఎం తెలిపారు. శాశ్వత అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి ముఖ్యమైన భవనాలతో సహా అన్ని కార్యాలయాల నిర్మాణాలను పూర్తిచేస్తామని తెలిపారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న అన్ని భవనాలనూ మొదట పూర్తి చేస్తామన్నారు. విశాఖ ఉక్కు మెరుగైన యాజమాన్యం ఆధ్వర్యంలో అభివృద్ధి చెందే దిశగా చర్చలు జరుపుతున్నామని చెప్పారు. తాను ఇన్వెస్టర్లకు అనుకూల సీఎంనని ప్రకటించారు. తన హయాంలోనే అనంతపురంలో కియా వచ్చిందని గుర్తుచేశారు. 'ఈ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమా రాలేదు. ఇప్పుడు మేం మళ్లీ గేట్లు తెరిచాం. పలు విదేశీ సంస్థలు, పరిశ్రమల సీఈవోలు సంప్రదిస్తున్నారు. దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు హాజరవుతా' అని చెప్పారు.

నైపుణ్యాన్ని బట్టి ఉపాధి!

కులగణన బదులు నైపుణ్య గణన చేపట్టాలని భావిస్తున్నామని.. దీనిపై కేబినెట్ లో చర్చించి ఆమోదించామని చంద్రబాబు తెలిపారు. 'మానవ వనరులను మూలధన పెట్టుబడిగా మార్చి సంపదను సృష్టించడమే నా లక్ష్యం. స్వల్ప, మధ్యకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలతో అభివృద్ధి చేపడతాం. నైపుణ్యానికి అనుగుణంగా యువతకు ఉపాధి లభిస్తుంది. ప్రతి కుటుంబంలో నైపుణ్యాలను అంచనా వేసి వారి శక్తి సామర్థ్యాలతోనే తలసరి ఆదాయాన్ని పెంచుతాం. ఇప్పటివరకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) ఉండేది. నేను మరో పీ(పీపుల్)ని కూడా చేర్చా. ప్రజలు కూడా భాగస్వాములు కావాలి. రాష్ట్రంలో కష్టించి పనిచేసే ప్రజలు ఉన్నారు. వారిని గ్లోబల్ లీడర్లుగా తయారు చేయవచ్చు' అని చెప్పారు.

విధ్వంసంపై ప్రజల్లో చైతన్యం

ఏపీలో జరిగిన విధ్వంసంపై ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నామని సీఎం అన్నారు. జగన్ చేసిన అక్రమాలపై చార్జిషీట్ దాఖలు చేస్తారా అని అడుగగా.. ఏం జరిగిందో వివరించి ప్రజల్లో చైతన్యం తేవడమే పరిష్కారమని బదులిచ్చారు. 'రుషికొండ ప్యాలెస్‌ను మీరందరూ వచ్చి చూడండి.. దానిని జగన్ ఎలా నిర్మించాలో తెలుస్తుంది. ప్రజలు కూడా వచ్చి చూసేలా చేస్తాం' అని అన్నారు. రిసార్ట్‌గా మారుస్తారా అని అడిగినప్పుడు.. ఎవరు చెల్లిస్తారని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధికి ఏ అడ్డంకులూ లేవని, దక్షిణాదిలో ఏ రాష్ట్రానికీ లేనన్ని గొప్ప వనరులు ఉన్నాయని చెప్పారు. నదుల అనుసంధానం పూర్తి స్థాయిలో చేపడితే గోదావరి నుంచే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నీటి సరఫరా చేయవచ్చన్నారు. అరకును మార్చివేసిన నాంది ఫౌండేషన్ తన సృష్టేనన్నారు. దానిని తాను అంజిరెడ్డికి అప్పజెబితే ఆయన ఆనంద్ మహీంద్రాకు అప్పగించారని తెలిపారు.

- ఏపీ అభివృద్ధి, పునర్నిర్మాణానికి మొత్తం ఎన్డీయే కట్టుబడి ఉంది. అది దాని బాధ్యత. దేశ, రాష్ట్ర ప్రజలు ఎన్డీయేకే అధికారం ఇచ్చారు. అందరం కలిసి రాష్ట్రాన్ని బాగు చేస్తాం.
- జగన్ ధ్వంసం చేసేశారని నేను పారిపోదలచుకోలేదు. ఈ కష్ట సమయాన్ని తట్టుకుని దశలవారీగా రాష్ట్రాన్ని నిర్మిస్తా. 2014లో కూడా ఇదే విధంగా నిర్మాణం ప్రారంభించా.
- కృష్ణా, గోదావరి నదుల మధ్య ఏపీ అనుసంధానమై ఉంది. ఒక్క గోదావరి నుంచే సుమారు 3వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. దీనిని ఉపయోగించుకుంటే రాష్ట్రంలో అద్భుతాలు సాధించవచ్చు. కరువు అనేదే ఉండదు.
- విభజన సమయంలో నేను తటస్థంగా ఉన్నాను. ఏ పక్షం గురించీ మాట్లాడలేదు. ప్రజలను కన్విన్స్ చేయాలని చెప్పాను. కానీ వారిని ఒప్పించకుండా ఎలా చేశారో అందరికీ తెలుసు. అందుకే సమస్యలు తలెత్తాయి. - చంద్రబాబు

పరస్పర ప్రయోజనాల కోసమే రేవంత్‌తో చర్చలు

శనివారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో జరిగే సమావేశంలో ఇరు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడాలన్నదే తన విధానమని చంద్రబాబు అన్నారు. విభజన సమయంలో కూడా ఇరు రాష్ట్రాలకు సమన్యాయం చేయాలని కోరానని గుర్తుచేశారు. తెలంగాణ సీఎం ఆ రాష్ట్ర ప్రయోజనాలు ఆశించవచ్చని.. కానీ తాను రెండు రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతినకుండా పరస్పర ఆమోదంతో సమస్యలు పరిష్కారం కావాలనే ఉద్దేశంతో చర్చలు జరుపుతానని తెలిపారు. తెలుగువారు కలిసి ఉండాలని, సోదర భావంతో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్పొరేషన్లు, షెడ్యూలు 9, 10 కింద ఉన్న సంస్థల విభజనపై చర్చించాల్సి ఉందన్నారు.

ఆర్థిక పరిస్థితి మెరుగయ్యేదాకా.. చేయూతనివ్వండి

» కేంద్ర ఆర్థిక మంత్రికి చంద్రబాబు వినతి

» ఆర్థిక భరోసాకు నిర్మలా సీతారామన్ హామీ

» రాజ్‌నాథ్, జేపీ నడ్డాలతోనూ సీఎం భేటీ

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆర్థికంగా చేయూతనివ్వాలని కేంద్రప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచాలని అభ్యర్థించారు. గత ఐదేళ్లా జరిగిన విధ్వంసంతో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకపోయినందున తక్షణం సాయం అందించాలని కోరారు. శుక్రవారం ఢిల్లీలో రెండో రోజు కూడా ఆయన పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ ఎంపీలతో కలిసి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, ఆరోగ్య మంత్రి జేపీ నడ్డాను కూడా కలిశారు. రాష్ట్ర ఆర్థిక అవసరాలపై నిర్మలా సీతారామన్‌కు మెమోరాండం అందజేశారు. నిధుల కేటాయింపు పెంచాల్సిన ఆవశ్యకతను అందులో వివరించారు. ప్రాజెక్టులకు నిధులు అందించాలని కోరారు. ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యేంతవరకూ చేయూతనివ్వాలని ఆమెను కోరారు. విభజన తర్వాత రుణాలపై వడ్డీ పేరుకుపోయిందని.. అదనపు రుణాలు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం పూర్తి చేసేందుకు నిధుల మంజూరుకు త్వరలో ఆమోద ముద్ర వేయాలని అభ్యర్థించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నిటిలో 90 శాతం గ్రాంట్ ఇవ్వాలన్నారు. సీఎం వినతులపై ఆమె సానుకూలంగా స్పందించారు. రాష్ట్రానికి ఆర్థిక భరోసా అందించేందుకు హామీ ఇచ్చారు. రాజ్‌నాథ్, జేపీ నడ్డాతో భేటీ సందర్భంగా కూడా పోలవరం నిర్మాణాన్ని పునఃప్రారంభించేందుకు కేంద్రం త్వరగా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు కోరారు. రాజధానిలో మౌలిక వసతులు, ప్రభుత్వ భవన సముదాయాలను పూర్తి చేసేందుకు సాయం అందించాలని కోరారు. జీతాలు, పింఛన్లు, అప్పుల చెల్లింపుల వంటి ఖర్చులు రాష్ట్ర రెవెన్యూ వసూళ్లను మించిపోయాయని వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారు ఆయనకు హామీ ఇచ్చారు. ఏపీలో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డాను కోరారు. నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యాన్ని కూడా చంద్రబాబు కలిసి రాష్ట్ర సమగ్రాభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



కేంద్ర మంత్రి నడ్డాతో సమావేశమైన సీఎం చంద్రబాబు

బందరులో బీపీసీఎల్ రిఫైనరీ

» రూ.60 వేల కోట్ల వ్యయంతో ఏర్పాటు

» సీఎం చంద్రబాబు పట్టుదలతో ఏపీకి చాన్స్

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో బీపీసీఎల్ సంస్థ రిఫైనరీ ఏర్పాటుకు అడ్డంకులు తొలగిపోయాయి. రిఫైనరీ ఏర్పాటు రేసులో ఉన్న ఇతర రాష్ట్రాలను వెనక్కి నెట్టిన ఏపీ ఈ సదవకాశాన్ని అందిపుచ్చుకుంది. పెరుగుతున్న ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బీపీసీఎల్) కొత్తగా బందరులో రిఫైనరీని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఏడాదికి 12 మిలియన్ టన్నుల(ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం సుమారు రూ.60 వేల కోట్లు వరకు బీపీసీఎల్ వ్యయం చేయనుంది. ఈ రిఫైనరీని తమ రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని యూపీ, గుజరాత్ ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. అయితే రిఫైనరీని ఏపీలోనే ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు గట్టి పట్టుదలతో ఉన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన గురువారం పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరిని కలిసిన సమయంలో రిఫైనరీని ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 93(4) ప్రకారం ఏపీలో పెట్రోలియం రిఫైనరీని ఏర్పాటు చేయాల్సి ఉందని గుర్తుచేశారు. దీనిపై కేంద్ర మంత్రి కూడా సానుకూలంగా స్పందించారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఈ మేరకు ప్రకటన వెలువడే అవకాశం ఉంది. దీన్ని నాలుగేళ్లలో పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మచిలీపట్నంలో సుమారు 3 వేల ఎకరాల భూమిని రిఫైనరీ కోసం కేటాయించనున్నారు. దేశీ ఇంధన అవసరాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. 2023 లో 223.021 మిలియన్ టన్నుల డిమాండ్ ఉండగా 2024లో అది 233.276 మిలియన్ టన్నులకు పెరిగింది. పెరుగుతున్న ఇంధన అవసరాల దృష్ట్యా ప్రస్తుతం దేశానికి ఉన్న 252 ఎంఎంటీపీఏ సామర్థ్యాన్ని 2030కి 450 ఎంఎంటీపీకి పెంచుకోవాలని భావిస్తున్నారు. అందులో భాగంగా తొలుత భారీ రిఫైనరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. మహారాష్ట్రలోని రత్నగిరిలో 60 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ రిఫైనరీ పెట్రోకెమికల్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. పర్యావరణ, భూసేకరణ సమస్యలు రావడంతో ఇది పట్టాలెక్కలేదు. దీంతో చిన్న రిఫైనరీల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు. బీపీసీఎల్ సంస్థకు ప్రస్తుతం ముంబై (మహారాష్ట్ర), కొచ్చి (కేరళ), బినా (మధ్యప్రదేశ్)ల్లో మూడు రిఫైనరీలున్నాయి. వీటి వార్షిక సామర్థ్యం 36 ఎంఎంటీపీఏ. 2029 నాటికి తన రిఫైనరీ సామర్థ్యాన్ని 45 ఎంఎంటీపీఏకు పెంచుకునేందుకు బీపీసీఎల్ ప్రయత్నాలు చేస్తోంది. నాలుగో రిఫైనరీని ఏపీలో ఏర్పాటు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి.

ఔటర్, ఇన్నర్.. రైట్ రైట్!

» అమరావతి రింగ్ రోడ్లకు కేంద్రం అంగీకారం

» బెజవాడ తూర్పు బైపాస్‌కు కూడా..

» అత్యాధునిక టెక్నాలజీతో 189 కిమీ ఔటర్!

» ఖర్చు ఎంతైనా రాజధానికి అద్భుత రహదారి

» సీఎం చంద్రబాబుకు గడ్కరీ హామీ

» కేంద్రానికి రాష్ట్రం ప్రతిపాదనలు

» ఎక్కువగా సీసీ రోడ్లకు వెళ్దామన్న కేంద్ర మంత్రి

» టాటా కన్సల్టెన్సీ అధ్యయనం చేస్తోందని వెల్లడి

» రాష్ట్ర రోడ్లపై 20 రోజుల తర్వాత మళ్లీ చర్చ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అమరావతి రాజధానికి మణిహారం లాంటి ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మాణానికి కేంద్రం సానుకూలత వ్యక్తం చేసింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో 189 కిమీ పొడవైన ఓఆర్ఆర్‌ను తానే చేపట్టేందుకు ముందుకొచ్చింది. పెరిగిన ట్రాఫిక్, నూతన వాహనాల తీరును దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక టెక్నాలజీతో ఔటర్ నిర్మాణం చేద్దామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ సీఎం చంద్రబాబుకు స్పష్టమైన హామీఇచ్చారు. ఖర్చు ఎంతైనా అమరావతికి అద్భుతమైన రహదారిని నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఔటర్ నిర్మాణం కోసం ఇప్పటికే భూసేకరణ ప్లాన్‌ను సిద్ధం చేశారు. రూ.18 వేల కోట్లతో దీన్ని నిర్మించాలని 2017-18లోనే ప్రతిపాదించగా కేంద్రం అప్పట్లోనే అంగీకరించింది. అయితే జగన్ వచ్చాక ఈ ప్రాజెక్టును మూలనపడేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ఔటర్ మళ్లీ పట్టాలెక్కనుంది. చంద్రబాబు, రోడ్లు-భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితరులు గురువారం గడ్కరీని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రహదారి ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన రహదారులపై ఆయనకు ప్రతిపాదనలు సమర్పించారు. అమరావతి ఔటర్, ఇన్నర్ రింగ్‌రోడ్డుతోపాటు, విజయవాడలోని కీలక ప్రాంతాలను కలిసే తూర్పు బైపాస్ చేపట్టాలన్న చంద్రబాబు విన్నపానికి గడ్కరీ సానుకూలంగా స్పందించారు. 'ప్రజలకు, మౌలిక రంగం మరింత బలోపేతమయ్యేందుకు అవసరమైన సహకారమందిస్తాం. ఆ 3ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాం' అని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లు రూపొందించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

జాతీయ రహదారులుగా గుర్తించండి..

రాష్ట్రంలో 7 వేల కిమీపైనే జాతీయ రహదారులున్నాయి. ప్రస్తుతం స్టేట్ హైవేలుగాఉన్న 3,200 కిమీ రోడ్లను కూడా జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని గడ్కరీకి చంద్రబాబు ప్రతిపాదించినట్లు తెలిసింది. ఇంకోవైపు జాతీయ, రాష్ట్ర రహ దారులను ఆధునిక టెక్నాలజీతో నిర్మిద్దామని గడ్కరీ ప్రతిపాదించారు. రోడ్లపై ఐదేళ్లకోసారి నిర్వహణ పేరిట కోట్లు ఖర్చుపెట్టడం, వర్షాలకు అవి దెబ్బతినడం జరుగుతోందని, ఇకపై సిమెంట్ (సీసీ) రోడ్లు నిర్మించే ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. ఏపీలో కూడా కొత్తగా చేపట్టే పెద్ద ప్రాజెక్టులు, జాతీయ రహదారులను అవసరాన్ని బట్టి సీసీ టెక్నాలజీతో నిర్మించేలా ప్రతిపాదనలు ఉండాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఆధునిక టెక్నాలజీతో రహదారుల నిర్మాణంపై టాటా కన్సల్టెన్సీతో అధ్యయనం చేయిస్తున్నట్లు ఆయన చంద్రబాబుకు తెలిపారు. నివేదిక త్వరలోనే వస్తుందని, 20 రోజుల తర్వాత మరోసారి సమగ్ర చర్చ చేద్దామన్నారు. రాష్ట్రం నుంచి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, నిపుణులైన ఇంజనీర్లు వస్తే అన్నింటిపై చర్చిద్దామన్నారు.

ఓఆర్ఆర్... రాజధాని ఆర్థిక కారిడార్!!

» సీఆర్‌డీఏ పరిధిలోనే అత్యంత భారీ రోడ్డు ప్రాజెక్టు

» అమరావతితో పాటు పలు పట్టణాల అభివృద్ధికి దోహదం

విజయవాడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రాజెక్టు అమరావతికి ఆర్థిక కారిడార్‌గా మారబోతోంది. ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎకనమిక్ కారిడార్లు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పారిశ్రామిక పార్కులను ఓఆర్ఆర్‌కు అనుసంధానించనుండడంతో రాజధానికే ప్రధానాకర్షణ కానుంది. అమరావతితో పాటు రాజధాని ప్రాంత పరిధిలోని అంతర, బాహ్య పట్టణాలను అనుసంధానించే మెగా ఓఆర్ఆర్‌గా నిలుస్తుంది. రాష్ట్రంలోని పలు ముఖ్యమైన జాతీయ రహదారులన్నీ దీనికి అనుసంధానమవుతాయి. రాజధానిని విధ్వంసం చేసిన జగన్ ప్రభుత్వం.. దాని అభివృద్ధికి దోహదపడే ఏ ప్రాజెక్టునూ వదల్లేదు. ఓఆర్ఆర్‌ను కూడా రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితా నుంచి తప్పించింది. దీంతో ఆర్థిక కారిడార్ ఆశలు ఆవిరయ్యాయి. మళ్లీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం రావడంతో ఓఆర్ఆర్‌కు మార్గం సుగమమైంది.

ఔటర్ స్వరూపం..	
పొడవు	: 189 కిలోమీటర్లు
వెడల్పు	: 150 కిమీ
లేన్	: 6 + 2 కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే
ఏరియా	: సీఆర్‌డీఏ
నిర్మాణం	: 3 దశలు, 11 ప్యాకేజీలు
మండలాలు	: 22
గ్రామాలు	: 87
రోడ్ ఇంటర్ చేంజ్‌లు	: 9
సొరంగాలు	: 3
వంతెనలు	: 14
అండర్ పాస్‌లు	: 78

ఓఆర్ఆర్ పరిధి ఇలా..

మొత్తం 189 కిలోమీటర్ల పొడవున నిర్మించాలన్నది ప్రతిపాదన. రాజధాని ప్రాంత పరిధిలో మొత్తం 22 మండలాల్లోని 87 గ్రామాల గుండా ఇది సాగుతుంది. సీఆర్‌డీఏ పరిధి బయట ఉన్న పట్టణ ప్రాంతాలు.. తెనాలి, ఉయ్యూరు, నందిగామ, గుడివాడ, కైకలూరు, మచిలీపట్నం, రేపల్లె, నిజాంపట్నం, పొన్నూరు, బాపట్ల, చీరాల, ఒంగోలు, అద్దంకి, సత్తెనపల్లి, చిలకలూరిపేట, నరసరావుపేట, పిడుగురాళ్ల, వినుకొండ, ఏలూరు, ద్వారకాతిరుమల, చింతలపూడి, తాడేపల్లిగూడెం, నూజివీడు, తిరువూరు, జగ్గయ్యపేట, తెలంగాణలోని మధిర, ఖమ్మం వంటి పట్టణాలను కూడా పరిగణనలోకి తీసుకుని దీనిని రూపొందించారు. ఈ పట్టణాలు ఓఆర్ఆర్‌కు కనిష్ఠంగా 7 కిలోమీటర్ల నుంచి గరిష్ఠంగా 101 కిలోమీటర్ల వరకు దూరంగా ఉన్నాయి. ఒక్క ఓఆర్ఆర్‌తో దాదాపుగా ఐదారు జిల్లాల పట్టణాలకు ప్రయోజనకరంగా మారనుంది. ఓఆర్ఆర్ పరిధిలోకి వచ్చే పూర్తి మండలాల్లో విజయవాడ ఉత్తరం, తూర్పు, సెంట్రల్, పశ్చిమ, విజయవాడ రూరల్, పెనమలూరు, ఇబ్రహీంపట్నం, తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని, గుంటూరు తూర్పు మండలాలున్నాయి. ఈ ప్రాంతాలన్నీ ఓఆర్ఆర్ పరిధిలోకి రావడంతో పాటు.. బెంగళూరు-విజయవాడ కారిడార్, విజయవాడ-నాగపూర్ కారిడార్, ఎన్‌హెచ్-16, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-30, ఎన్‌హెచ్-216హెచ్, ఎన్‌హెచ్-216, ఎన్‌హెచ్-544, ఎన్‌హెచ్-541జీ వంటివి అనుసంధానమవుతాయి. ఇవే కాకుండా మచిలీపట్నం పోర్టు, విజయవాడ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ), అనేక ఇండస్ట్రియల్ పార్కులూ కలుస్తాయి. ఇవికాక రాష్ట్ర రహదారులు, బైపాస్‌లు, అంతర్గత రహదారులు కూడా అనుసంధానమవుతాయి. ఇవన్నీ ఓఆర్ఆర్ పరిధిలోకి రావటంతో అమరావతి ఆర్థిక కారిడార్‌గా మారుతుంది.

బాబు వచ్చినా 'మారలేదు'!

(మొదటి పేజీ తరువాయి)

అసంతృప్తి,మనోవేదన అనుభవించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. తమకు మంచి రోజులు వస్తాయని, పని చేసే ప్రభుత్వంలో భాగస్వాములై సామర్థ్యం నిరూపించుకుందామని ఎదురు చూస్తున్న చాలామంది అధికారులకు ఇప్పటికీ నిరాశే మిగిలింది.

మాటలకే పరిమితమా...

'తప్పుడు అధికారుల లెక్క తేలుస్తాం' అని చంద్రబాబు... 'రెడ్ బుక్' అంటూ లోకేశ్ ఎన్నికల ముందు ప్రదర్శించిన ఆవేశానికి అర్థముంది. ఎందుకంటే జగన్ హయాంలో అనేక మంది అధికారులు 'బ్లూ' రంగు పులుముకుని మరీ పని చేశారు. 'వైసీపీ చెప్పిందే వేదం' అన్నట్లుగా వ్యవహరించారు. పనిలోపనిగా తామూ విచ్చలవిడిగా అవినీతి చేసి... కోట్లు పోగేసుకున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో వీరందరి పని పడతారని, లెక్కలు తేలుస్తారని అంతా భావించారు. కానీ... అధికారంలోకి రాగానే చంద్రబాబు, లోకేశ్ మాటలన్నీ 'గెలుపు హోరు'లో కొట్టుకుపోయాయి. ముగ్గురు, నలుగురు అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వకుండా నిలిపి ఉంచడం మినహా జరిగిందేమీ లేదు. ఇప్పుడున్న పరిస్థితులు పరిశీలిస్తే జరగబోయేది కూడా ఏమీ లేదనే అనిపిస్తోంది. ఎందుకంటే... కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏదైతే జరగకూడదని అందరూ భావించారో అదే జరుగుతోంది. చంద్రబాబు చుట్టూ కొంత మంది చేరిపోయి వారికి కావాల్సిన అధికారులకు కీలకమైన స్థానాల్లో పోస్టింగ్‌లు వచ్చేలా లాబీయింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చంద్రబాబుకు తప్పుడు సమాచారం ఇస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నిజాయితీగా పని చేసిన వారిపై కూడా చిన్నచిన్న వంకలు చూపించి పోస్టింగ్‌లు రానివ్వకుండా తొక్కిపెడుతున్నారు. జగన్ హయాంలో తీవ్ర ఒత్తిళ్ల మధ్య పనిచేసి, తటస్థంగా వ్యవహరించిన అధికారులు ఇప్పుడు కనీసం చంద్రబాబును కలిసి తమ పరిస్థితి వివరించాలనుకున్నా కుదరడంలేదు. ఇలాంటి వాళ్లను సీఎంవో దరిదాపుల్లోకి కూడా రాకుండా అడ్డుకుంటున్నారు.

ఎంత చిత్రమో...

చంద్రబాబు పేషీలోని అధికారులందరినీ పక్కన పెట్టిన జగన్... సీనియర్ ఐఏఎస్ అధికారి సాయిప్రసాద్‌కు మాత్రం ప్రాధాన్యమిచ్చారు. సీసీఎల్ఏతోపాటు రెవెన్యూ స్పెషల్ సీఎస్‌గా చాలా కాలం పని చేశారు. ఒకే అధికారికి రెండు అత్యంత కీలక పోస్టులను ఇచ్చారంటేనే... జగన్ ఆయనకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. సాయిప్రసాద్ వ్యవహార శైలిపై వచ్చిన ఆరోపణలు అన్నీఇన్నీ కావు. అత్యంత చిత్రంగా... చంద్రబాబు కూడా సాయి ప్రసాద్‌కు పిలిచి పీఠం ఎక్కించారు. ఆయనకు అత్యంత కీలకమైన సాగునీటి శాఖను అప్పగించారు. ఇదే ఒక పెద్ద చిత్రం కాగా... ఆయన నిత్యం సీఎంవోకు వెళ్లి మేనిఫెస్టోలు ఎలా అమలుచేయాలి.. ఏం చేస్తే బాగుంటుందంటూ సలహాలూ సూచనలూ ఇస్తున్నారు.

ఇంకెవరూ లేనట్లు... ప్రద్యుమ్న

2019 ఎన్నికల ముందు తన వద్దకు వచ్చిన చంద్రబాబునే వెయిటింగ్‌లో పెట్టి, ఆ తర్వాత జగన్ సర్కారుతో అంటకాగి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న గోపాలకృష్ణ ద్వివేదికి ఇప్పుడు చంద్రబాబు కార్మిక శాఖ అప్పగించారు. దీనిపై తీవ్ర విమర్శలు తలెత్తడంతో... కొన్నాళ్లకు పక్కన పెట్టారు. కానీ... మరో అధికారి ప్రద్యుమ్న కథే వేరు. అంతకుముందు చంద్రబాబు ప్రభుత్వంలో సీఎంవోలో జాయింట్ సెక్రటరీగా, చిత్తూరు కలెక్టర్‌గా పని చేశా౦. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం ఆయన్ని మరో విధంగా ఉపయోగించుకుంది. ఐఏఎస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ హోదాలో... చంద్రబాబుపైనే ప్రద్యుమ్న విమర్శలు గుప్పించారు. ఆయన సతీమణి శిల్ప వైసీపీ లీగల్ సెల్‌లో భాగస్వామి. ఇప్పుడు అదే ప్రద్యుమ్న బాబుపేషీలో కీలక అధికారిగా చేరిపోయారు.

తిట్టిన వాళ్లకే దీవెనలు...

బుడితి రాజశేఖర్ గత ప్రభుత్వంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి హోదాలో పాఠశాలల విలీనంపై వివాదాస్పదమైన జీవో 117 జారీ చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులు గగ్గోలు పెట్టినా... జీవో రద్దు చేసేది లేదంటూ హేళనగా మాట్లాడారు. 2014-19 మధ్య చంద్రబాబునూ లెక్క చేయకుండా మాట్లాడేవారు. అప్పట్లో పౌరసరఫరాల శాఖలో ఉన్న రాజశేఖర్... 'ఏది పడితే ఆ నిర్ణయం తీసుకుంటే డబ్బులు చంద్రబాబు ఇస్తారా? మీడియా వాళ్లు ఇస్తారా?" అని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అలాంటి అధికారిని చంద్రబాబు ఇప్పుడు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

పోస్టింగ్‌ల్లో లాబీయింగ్‌లు..

విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మికి కీలకమైన గుంటూరు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించడం, కర్నూలు కలెక్టర్‌గా ఉన్న సృజనను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా నియమించడంపైనా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నాగలక్ష్మి విజయనగరం కలెక్టర్‌గా ఉండగా... భోగాపురం ఎయిర్‌పోర్టు చుట్టు పక్కల అసైన్డ్ ల్యాండ్స్‌ను అప్పటి సీఎస్ జవహర్ రెడ్డితో ప్రస్తుతం ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులకు అప్పగించడంలో కీలకపాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. ఇక... సృజన జగన్ హయాంలో ఒక వెలుగు వెలిగారు. విశాఖ కమిషనర్‌గా ఉండగా వైసీపీ ఎంపీ విజయసాయి చెప్పినవన్నీ చేసేశారు. అక్కడ జరిగిన 'రాజకీయ కక్షసాధింపు' కూల్చివేతల్లో కీలకంగా వ్యవహరించారు. ఆమెను చంద్రబాబు.....రాష్ట్ర రాజధానిలాంటి విజయవాడ కేంద్రంగా ఉండే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను చేశారు. ఈస్థానంలోని ఢిల్లీరావుపై ఎలాంటి విమర్శలూ, ఆరోపణలూ లేవు. అయినప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం ఆయనను పక్కనపెట్టేసి...కనీసం పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. దీనికి కారణాలేమిటో కూడా లేదు.

లెక్కతేల్చడం ఇదేనా...

- ప్రజా వేదిక కూల్చాలని ఆదేశించిందే తడవుగా దగ్గరుండి మరీ ఆ పని చేసి... ఎప్పటికప్పుడు జగన్‌కు రిపోర్టు ఇచ్చిన అప్పటి సీఆర్డీయే అదనపు కమిషనర్ విజయను చంద్రబాబు ప్రభుత్వం అనకాపల్లి జిల్లా కలెక్టర్‌గా నియమించి సత్కరించింది.
- ప్రజావేదిక కూల్చివేతను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన నాటి డిప్యూటీ కలెక్టర్ వీరబ్రహ్మాన్ని జగన్ ఆ తర్వాత కీలకమైన టీటీడీ జేఈవోగా నియమించారు. అధికారంలోకి వచ్చి నెలరోజులైనా చంద్రబాబు ప్రభుత్వం వీరబ్రహ్మాన్ని అదే స్థానంలో కొనసాగిస్తోంది.
- ఐఏఎస్ కృష్ణబాబు ఆర్అండ్‌బీ ముఖ్య కార్యదర్శి హోదాలో తాడేపల్లి ప్యాలెస్‌కు భారీగా ప్రజాధనాన్ని ఖర్చుపెట్టారు. బడ్జెట్‌తో సంబంధంలేకుండా ఆ బిల్లులు మంజూరు చేయించారు. ఆ తర్వాత జగన్ ప్రభుత్వం అయనకు వైద్య ఆరోగ్యశాఖ అప్పగించింది. కృష్ణబాబు ఇప్పటికీ అదే శాఖలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను మరో ఏడాది అక్కడే కొనసాగించే ఆలోచనలో ప్రభుత్వం ఉండడం గమనార్హం.
- గత ప్రభుత్వంలో మిషన్ బిల్డ్ ఏపీ, ఏపీఐఐసీ ఎండీ వంటి కీలక విభాగాల్లో పని చేసిన ప్రవీణ్ కుమార్‌కు గనుల శాఖ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీగా బాధ్యతలు అప్పగించింది. ఆయనను తిరుపతి కలెక్టర్‌గా తొలగించి మంచి నిర్ణయం తీసుకుందనేలోపే గనుల శాఖను అప్పగించేశారు.
- రైతులకు ఇచ్చే పట్టాలపై జగన్ ఫొటోలు ముద్రించి, అయనను ప్రసన్నం చేసుకున్న అధికారి సిద్ధార్థ జైన్! సర్వే రాళ్లపై జగన్ బొమ్మలు చెక్కించిన ఘనత కూడా ఆయనదే. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని కేంద్రం పలుసార్లు తిరస్కరించినా... ఢిల్లీకి వెళ్లి లాబీయింగ్ చేసి మరీ ఆమోద ముద్ర పొందారు. అలాంటి అధికారికి ప్రభుత్వం కీలకమైన పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది.

నారాయణపై పగపట్టినా...

గత ప్రభుత్వంలో పాఠశాల విద్య కమిషనర్‌గా ఉన్న సురేశ్ కుమార్ అప్పటి ప్రభుత్వం ఏం చెబితే అది గుడ్డిగా అమలు చేశారు. పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ పేరుతో నారాయణ విద్యా సంస్థల అధినేత, ప్రస్తుత మంత్రి నారాయణపై తీవ్ర అభియోగాలు మోపారు. ఇప్పుడు అదే సురేశ్ కుమార్‌ను చంద్రబాబు ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీగా నియమించింది. ఆయన ఇతర ఐఏఎస్‌లపై చంద్రబాబుకు నివేదికలు ఇస్తున్నారు. ఇందులోనూ గోల్‌మాల్ చేస్తున్నారని... జగన్ ప్రభుత్వానికి వత్తాసు పలికిన ఐఏఎస్‌లకు కీలక పోస్టులు దక్కేలా రిపోర్టులు ఇస్తున్నారని తెలుస్తోంది.

పెద్దిరెడ్డితో అంటకాగినా...

ఐఏఎస్ అధికారి షణ్మోహన్‌ది మరో కథ. చిత్తూరు కలెక్టర్‌గా పెద్దిరెడ్డి చెప్పిందల్లా చేశారు. కొత్త ప్రభుత్వంలో ఆయనకు పోస్టింగ్ కూడా దక్కదని అంతా భావించారు. కానీ... ఆయనకు కాకినాడ కలెక్టర్‌గా అవకాశం ఇచ్చారు. తిరుపతి కలెక్టర్‌గా బదిలీ అయిన వెంకటేశ్వర్ కూడా పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడే. ఉమ్మడి చిత్తూరు జిల్లా హౌసింగ్ జాయింట్ కలెక్టర్‌గా ఆయన 928 ఎకరాల వివాదాస్పద భూములను సింగిల్ సంతకంతో పెద్దిరెడ్డికి ధారాదత్తం చేశారన్న ఆరోపణలున్నాయి. అలాంటి వ్యక్తికి చంద్రబాబు తిరుపతి కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

చుట్టూ.. గనుల గజదొంగలే

(మొదటి పేజీ తరువాయి)

జరిగినప్పుడు, ఆ తర్వాత జేపీ వెంచర్స్‌కు ఇచ్చినప్పుడు అటు గనుల శాఖ, ఇటు ఏపీఎండీసీలో ఐదుగురు అధికారులు చక్రం తిప్పారు. రవాణా చార్జీలు, ఇతర మార్గాల్లో లెక్కలేనంత అవినీతికి పాల్పడ్డారు. జేపీ వెంచర్స్‌కు టెండర్ ఇచ్చాక ఆ సంస్థ అక్రమ తవ్వకాలు జరిపినా గనుల శాఖ అధికారులు పట్టించుకోలేదు. జేపీ వెంచర్స్ పేరిట వైసీపీ నేతలు ఇసుక అమ్ముకున్నా ఎక్కడా అడ్డుకోలేదు. అక్రమాలకు విజిలెన్స్, సెబ్ అధికారులు పూర్తిగా సహకరించారు. ప్రజల ఫిర్యాదులు బుట్టదాఖలు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాల లాభాల్లో 50 శాతం తాడేపల్లికి చేరగా, మిగిలిన 50 శాతం వైసీపీ నేతలకు చేరింది. ఈ అక్రమాలు వెలుగులోకి రావాలంటే నిజాలను బయటకు తీసే నిఖార్సయిన అధికారులు అవసరం. అలాంటి వారు గనుల శాఖ, ఎండీసీలో ఉన్నారు. కానీ వారి కంటే పై స్థాయిలో వైసీపీ సైన్యం ఉంది. నాటి మంత్రి పెద్దిరెడ్డి, గనుల శాఖ అధికారి వెంకటరెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి తెచ్చిపెట్టుకున్న సొంత మనుషులున్నారు. వారు అక్రమాలకు కాపలా ఉన్నంత వరకు నిజాలు బయటకు వచ్చే అవకాశమే లేదని సీనియర్ అధికారులు చెబుతున్నారు. దొంగకు బాధ్యతలు ఇచ్చి నిజాలు బయటకు తీయమంటే ఎలా ఉంటుంది? దొంగ నివేదికే ఇస్తారు.

పెద్దిరెడ్డి మనిషి వెనక్కి...

గతంలో పెద్దిరెడ్డి దగ్గర ఐదేళ్లు పనిచేసిన ఓ అధికారి ఇప్పుడు మళ్లీ వెనక్కి వచ్చారు. ఎండీసీలో కీలక స్థానంలో ఉన్నారు. గత ప్రభుత్వ తప్పులేవీ బయటకు రాకుండా అప్పుడే ఆయన మంత్రాంగం మొదలు పెట్టారు. గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ చుట్టూ ఆయన ఓ వలయంలా అల్లుకుపోతున్నారు.

సమాచారం బయటకు?

వెంకటరెడ్డికి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన ఓ జూనియర్ అధికారి ఇప్పుడు కొత్తగా వచ్చిన డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ సేవలో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఫైళ్ల మాయం చేయడం, కీలక ఆధారాలు ధ్వంసం చేయడంలో అతడి పాత్ర ఉందని గనుల శాఖ వర్గాలు బహిరంగంగా చెబుతున్నాయి. అయినా కొత్త అధికారి ఆయన సేవలనే వాడుకుంటున్నారు. గనుల శాఖ, ఎండీసీలో ఎప్పుడు ఏం జరుగుతుందో, ఏ నివేదికలు తయారు చేస్తున్నారో, ఎప్పటికిప్పుడు ఆయన సమాచారం బయటకు మోస్తున్నట్లు అధికార వర్గాలే చెబుతున్నాయి.

ఎన్నికల తర్వాతా అక్రమాలు

మరో ఇద్దరు అధికారులపై ఇసుక రవాణా చార్జీల గోల్‌మాల్ ఆరోపణలు ఉన్నాయి. బిల్లుల చెల్లింపులో తీవ్రస్థాయిలో వసూళ్లకు పాల్పడిన అధికారి ఇంకా ఎండీసీలోనే ఉన్నారు. ఆర్థిక విభాగాన్ని గుప్పిటపట్టారు. మొన్నటి వరకు తన సోదరుడి (జగన్ ప్రభుత్వంలో కీలక అధికారి) అండతో రెచ్చిపోయిన ఆయన ఇప్పుడు ఆర్థిక పరమైన అంశాల ఫైళ్లు బయటకు రాకుండా తొక్కిపెట్టినట్లు తెలిసింది. ఎన్నికల తర్వాత అనేక జిల్లాల్లో ఖనిజాల తవ్వకాలకు సంబంధించి లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్ఓఐ)లు ఇచ్చారు. తెరవెనక కోట్ల రూపాయలు వసూలు చేశారన్న ఫిర్యాదులున్నాయి. పాత తేదీలతో సంతకాలు చేసి, వాట్సప్‌లో ఉత్తర్వులు ఇచ్చినట్లుగా గుర్తించారు.

నిజాలు నిగ్గుతేల్చాలంటే..

గనుల శాఖ డైరెక్టరేట్, ఏపీఎండీసీల పరిధిలో జరిగిన అనేకానేక అక్రమాలు, దారుణాలు బయటకు రావాలంటే ఆరోపణలున్న అధికారులను తప్పించాలని, విచారణ బాధ్యతల్లో అక్రమార్కులు ఉండకూడదని అధికార వర్గాలు చెబుతున్నాయి. మాట వినలేదని గతప్రభుత్వంలో దారుణంగా వేధింపులకు గురైన అధికారులను కూడా నిజాలను వెలికితీసే కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని చెబుతున్నారు.

కీలక స్థానాల్లో ఆ ఇద్దరూ..

అదానీకి బొగ్గు తవ్వకం, అమ్మకం టెండర్లు కట్టబెట్టడంలో గతంలో ఇద్దరు అధికారులు కీలకపాత్ర వహించారు. వారిద్దరూ ఇప్పటికీ ఎండీసీలో కీలక స్థానాల్లో ఉన్నారు. బొగ్గు తవ్వకం టెండర్‌లో సెక్యూరిటీ డిపాజిట్‌కు బదులు పెర్‌ఫార్మెన్స్ డిపాజిట్ విధానం తీసుకొచ్చారు. ఫలితంగా ప్రతి నెలా అదానీకి ఎండీసీనే వడ్డీతో సహా సొమ్ము చెల్లించేలా వ్యవహరించారు. బీచ్ శాండ్ టెండర్‌ను దొడ్డిదారిన అదానీ కంపెనీకి కట్టబెట్టాలని వీరే సకల ప్రయత్నాలు చేశారు. కేంద్ర మార్గదర్శకాలకు విరుద్ధంగా టెండర్ డాక్యుమెంట్ రూపొందించారు. చివరకు హైకోర్టు ఆదేశాలతో టెండర్ నిలిచిపోయింది.

చిత్తూరు కార్పొరేషన్ కూటమి వశం!

- మేయర్, డిప్యూటీ మేయర్ సహా టీడీపీలోకి 18 మంది వైసీపీ కార్పొరేటర్లు
- ఇప్పటికే జనసేనలో చేరిన నలుగురు
- నగర పాలన కూటమి చేతికి

చిత్తూరు సిటీ, జూలై 5: చిత్తూరులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నగర పాలన కూటమి పార్టీల చేతికి దక్కింది. వైసీపీకి చెందిన మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేశ్ కుమార్‌రెడ్డి సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకొన్నారు. కొన్నాళ్ల కిందట నలుగురు కార్పొరేటర్లు జనసేనలో చేరారు. దీంతో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ పాలన కూటమి చేతికి వచ్చింది. చిత్తూరు నగరపాలక సంస్థలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. 37 చోట్ల వైసీపీ అక్రమంగా ఏకగ్రీవాలు చేసుకోగా, మిగిలిన వాటికి ఎన్నికలు జరిగాయి. వాటిలో 3 చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. తాజాగా మేయర్, డిప్యూటీ మేయర్ సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో కార్పొరేషన్‌లో ఆ పార్టీ సభ్యుల సంఖ్య 21కి చేరింది. జనసేనలో చేరిన నలుగురు కార్పొరేటర్లను కలుపుకొంటే కూటమికి 25 మంది సభ్యులు ఉన్నట్టయింది. ఇక, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. దీంతో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమికి ఆధిక్యత వచ్చింది. వైసీపీకి చెందిన మరికొందరు కార్పొరేటర్లు సైతం పార్టీ మారే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇదిలావుంటే, 22 మంది కార్పొరేటర్లను, ఇద్దరు కోఆప్షన్ మెంబర్లను వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ సస్పెండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Veduruppavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోన్న కేంద్ర ప్రభుత్వం

- మేధాపాట్కర్‌కు జైలుశిక్ష విధించడంపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ స్పందించాలి: సీపీఐ నేత కె.రామకృష్ణ

ధర్నాచౌక్, జూలై 5: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రాజ్యాంగ వ్యవస్థలను ప్రభావితం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వ దమన కాండను అన్ని రాజకీయపార్టీలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. ఇతర పార్టీల మద్దతుతో అధికారంలోకి వచ్చినప్పటికి మోదీ తన వైఖరిని మార్చుకోలేదని ఆయన విమర్శించారు. ప్రముఖ పర్యావరణవేత్త, నర్మద బచావో ఉద్యమ నాయకురాలు మేధాపాట్కర్‌కు జైలుశిక్ష విధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అణగారినవర్గాల హక్కుల కోసం పోరాడిన మేధాపాట్కర్‌కు జైలు శిక్ష, భారీ జరిమానా విధించడం సరికాదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. 22 ఏళ్ల క్రితం ఆమె మాట్లాడినందుకు ఇప్పుడు శిక్ష వేయడం అప్రజాస్వామికమన్నారు. అభివృద్ధి పేరుతో చేస్తున్న పర్యావరణ విధ్వంసం, ఆదీవాసీల హక్కుల పరిరక్షణ కోసం మేధాపాట్కర్ రాజీలేని పోరాటం చేశారన్నారు. మేధాపాట్కర్‌ను శిక్షించడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమేనని సీపీఎం నేత వైవీ రావు అన్నారు. నర్మద సరోవర్ నిర్వాసితుల పక్షాన పోరాడిన ఆమెకు శిక్ష విధించడం నిర్వాసితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. ఇఫ్టూ నేత కె.పొలారి, పీడీఎస్‌యూ నేత ఎ.రవిచంద్ర, రైతుకూలీ సంఘం నాయకురాలు ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజలాల వృథాను అరికట్టండి

- చెక్‌డ్యామ్‌లు నిర్మించండి
- చంద్రబాబును కోరిన పేరం శివనాగేశ్వరరావు

ధర్నాచౌక్, జూలై 5: కృష్ణాజలాల వృథాను అరికట్టేందుకు చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సీఎం చంద్రబాబును రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు కోరారు. సీఎం ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర సామాజికన్యాయ మంత్రి రాందాస్ అథవాలేను శుక్రవారం మర్యాదకపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నీటి ఆవశ్యకత, వృథా అవుతున్న నీటిని అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలను చంద్రబాబుకు శివనాగేశ్వరరావు వివరించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి లక్షల క్యూసెక్కుల కృష్ణాజలాలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని, వాటిని నిలుపుదల చేసేలా ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం కేంద్రప్రభుత్వం భరించేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వివరించారు.

పిన్నెల్లిపై అక్రమ కేసులు పెట్టారనడం

జగన్ మూర్ఖత్వానికి నిదర్శనం

- ఐదేళ్లుగా వైసీపీ పెట్టిన అక్రమ కేసులపై ఓ పుస్తకమే రాయొచ్చు: టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు


విద్యాధరపురం, జూలై 5: "మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ ఏజెంట్ నంబూరు శేషగిరిరావుపై మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హత్యాయత్నం చేశారు. కారంపూడి సీఐపై దాడి చేశారు. ఈ కేసుల్లో పిన్నెల్లి అరెస్టయ్యారు. కానీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి మాత్రం పిన్నెల్లిపై అక్రమ కేసులు పెట్టారంటున్నారు. ఈ వ్యాఖ్యలు ఆయన మూర్ఖత్వానికి నిదర్శనం." అని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్ర వారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన దారుణాలు, అకృత్యాలు, టీడీపీ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై ఏకంగా ఓ పుస్తకమే రాయొచ్చని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతి ఒక్కరినీ వెంబడించి సీఐడీ పోలీసులు వేధించిన ఉందతాలెన్నో ఉన్నా యన్నారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్రలపై పెట్టిన కేసులు, బీసీ జనార్దనరెడ్డిని జిల్లా మార్చి వేరే జైలుకు పంపిన ఘటనలను జగన్ ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిచేస్తే ఏ ఒక్కరిపైనా చర్యలు లేవన్నారు. ఏడు పదులు దాటిన చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి రాజమండ్రి జైలులో 52 రోజులు ఉంచితే అప్పుడు జగన్‌రెడ్డికి బాధ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌పై ఫర్నిచర్ దొంగతనం కేసు పెట్టి వేధించారని, ఆయన మృతికి కారణమయ్యారని ఆ బాధలు జగన్‌కు తెలియవా అని ప్రశ్నించారు. చట్టాన్ని అతిక్రమిస్తే న్యాయస్థానాలు శిక్షలు వేస్తాయని అధికారం ఉన్నప్పుడు ఒకలా లేనప్పుడు ఇంకోలా వ్యవహరించడం సరికాదని జగన్‌కు ఆయన హితవు పలికారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ నాయకులు కామాదేవరాజ్, ఇత్తడి చార్లెస్, జయరాజు, బాపట్ల శ్రీనివాస్, మరియన్న పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి సూర్యనాయక్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కృష్ణలంక, జూలై 5: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య సిబ్బందికి ఎన్టీఆర్ జిల్లా మలేరియా అధికారి సూర్యనాయక్ సూచిం చారు. కృష్ణలంకలోని జ్వరాలు ప్రబలే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిం చి శుక్రవారం సిబ్బందితో డోర్ టు డోర్ సర్వే చేయించారు. వైద్య, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేశామని, కలరా, మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి, రోడ్డు పక్క డ్రెయినేజీ కాలువల్లో యాంటీ లార్వా ఆపరేషన్లు చేపడుతున్నామని సూర్యనాయక్ తెలిపారు. కృష్ణలంకలోని యూపీహెచ్‌సీ మలేరియా పీడీపీ సిబ్బందిని అప్రమత్తం చేశామని, అనుమానం ఉన్నవారి నుంచి ఏఎన్ఎంలు, మలేరియా సిబ్బంది రక్తనమూనాలు సేకరించి పరీక్షల అనంతరం ఎమర్జెన్సీ వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్య సమస్యలొస్తే సమీపంలోని పీహెచ్‌సీకి గాని, వైద్య ఆరోగ్య కేంద్రానికి గాని వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని, కాచి, చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. సబ్ యూనిట్-2 అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఎంపీఎల్ కాంతారావును సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మరింత విస్తృతంగా జెమ్స్ లయన్స్ సేవలు

ఆటోనగర్, జూలై 5: జవహర్ ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేస్తామని క్లబ్ ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, పూర్వ ప్రెసిడెంట్ మహ్మద్ ఇస్మాయిల్, క్లబ్ ఫౌండర్లు బెవర నాగేశ్వరరావు, ఎంపీఎల్ కాంతారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆటోనగర్ సమీపంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఫౌండర్ ఎంపీఎల్ కాంతారావు జన్మదిన వేడుకల్లో వారు మాట్లాడారు. కాంతారావును క్లబ్ సభ్యులు సత్కరించారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, సెక్రటరీ అన్నే శివనాగేశ్వరరావు, డాక్టర్ అబ్దుల్ కలాం, కత్తిక నాగేశ్వరరావు, సుంకాని వెంకట త్రినాథ్, కొమ్మిడి శ్రీనివాసరెడ్డి, క్లబ్ కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి సాయన రాము పాల్గొన్నారు.





విజయవాడ రూరల్ మండలం కొత్తూరులో సర్వే నంబర్ 135లో, తాడేపల్లిలో సర్వే నంబర్ 248లో జరిపిన తవ్వకాలు

మైనింగ్ అక్రమాలపై

ఫిర్యాదుకు సిద్ధం

కొల్లు రవీంద్రకు సోమవారం ఫిర్యాదు చేయనున్న విజయవాడ రూరల్ మండల ప్రజలు

- మాజీ మంత్రులు అంబటి, జోగి, మాజీ ఎంపీ నందిగం సురేశ్ అనుచరుల అక్రమాలపై..
- ఎన్జీటీ ఆదేశాలను అమలుచేయని మైనింగ్, రెవెన్యూ, పోలీసు, ఫారెస్ట్ అధికారులపైనా ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రూరల్ మండల పరిధిలో వైసీపీ హయాంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయటానికి రంగం సిద్ధమవుతోంది. మండలం పరిధిలో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్, మాజీ ఎంపీ నందిగం సురేశ్ అనుచరులు సాగించిన మైనింగ్ దోపిడీపై ఫిర్యాదు చేసేందుకు విజయవాడ రూరల్ మండల ప్రజలు సిద్ధమవుతున్నారు. గనుల శాఖ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు సోమవారం విజయవాడ రూరల్ మండలం పరిధిలో జరిగిన అక్రమ తవ్వకాలపై స్థానిక టీడీపీ నేత మెండెం జమలయ్య నేతృత్వంలోని బృందం ఫిర్యాదు చేయనుంది. మండలం పరిధిలో పోలవరం కాలువ గట్టు, కొత్తూరు, తాడేపల్లిలోని కొండలు, ఫారెస్ట్ భూములు, అసైన్డ్ భూముల్లో పెద్ద ఎత్తున జరిపిన మైనింగ్ దోపిడీపై సాక్ష్యాధారాలతో ఫిర్యాదు చేయబోతున్నారు. వైసీపీ ప్రభుత్వ పెద్దల అండదండలతో ఉమ్మడి జిల్లా మైనింగ్ అధికారులు మైనింగ్ మాఫియాకు సహకరిం చటం, ఫారెస్ట్, రెవెన్యూ యంత్రాంగాలు కూడా వారి సేవలో నిమగ్నం కావటంపైనా ఫిర్యాదు చేయనున్నారు. సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేసినా ఏ శాఖ కూడా అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదని వివరించనున్నారు.

ఎన్జీటీ ఆదేశాలు బేఖాతరు

విజయవాడ రూరల్ మండలం పరిధిలో జరిగిన అక్రమ మైనింగ్‌పై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్జీటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణం అక్రమ క్వారీయింగ్‌ను నిలుపుదల చేయటంతో పాటు, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించింది. మైనింగ్ జరగకుండా ఉండేందుకు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయమని నిర్దేశించింది. ఎన్జీటీ ఆదేశాల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోవటం గమనార్హం. అప్పటి సబ్ కలెక్టర్ అదితిసింగ్ మైనింగ్ ప్రాంతానికి రాకుండా డొంక మార్గాలను కూడా తవ్వేశారు. మైనింగ్ మాఫియా ఆటలు సాగనీయటం లేదని ఆమెను బదిలీపై పంపించారు. స్థానిక తహసీల్దార్ జాహ్నవిని కూడా బదిలీ చేయించారు. కలెక్టర్ ఢిల్లీరావు రంగంలోకి దిగి క్వారీలను పరిశీలించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని స్వయంగా అప్పటి పోలీసు కమిషనర్ కాంతిరాణాకు లేఖ రాశారు. అయినా అక్రమార్కులపై చర్యలు లేవు. కొత్తూరు, తాడేపల్లి, జక్కంపూడి, పాతపాడులో కొండలు, గట్టులు, గుట్టలను తవ్వేశారు. పోలవరం మట్టిని కూడా తవ్వేసుకున్నారు. ఏ స్థాయిలో మైనింగ్ దోపిడీ జరిగిందో కరిగిన కొండలే నిదర్శనంగా ఉన్నాయి. ఈ అంశాలన్నింటికి సంబంధించిన సాక్ష్యాలను గనుల శాఖ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రకు అందచేయనున్నారు. మైనింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారుల అవినీతి కార్యాలపైనా ఫిర్యాదు చేయనున్నారు.



వణుకూరు జగనన్న లే అవుట్‌లో వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు చెబుతున్న కాలనీవాసులు

అవినీతికి పరాకాష్ట జగనన్న లే అవుట్లు

- వణుకూరు పేదల కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, జూలై 5: అవినీతికి జగనన్న లే అవుట్లు పరాకాష్ట అని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలంలోని వణుకూరు గ్రామంలోని జగనన్న లే అవుట్ ఫేస్-4లో శుక్రవారం ఆయన పర్యటించారు. బోడె ప్రసాద్ వచ్చారని తెలుసుకున్న కాలనీవాసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, మౌలికవసతులు కల్పించలేదని, ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న కాలనీ వల్ల పరిసర ప్రాంతాల్లోని పంటపొలాలు నీట మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో పంట పొలాలు కొని కాలనీలు ఏర్పాటు చేశారని, చిన్న వర్షం కురిస్తే మోకాళ్ల లోతులో నీళ్లు నిలిచిపోతున్నాయని బోడె ప్రసాద్ అన్నారు. 15 అడుగుల రోడ్డులో ఇరువైపులా విద్యుత్ స్తంభాలు, సరిగా డ్రెయినేజీ కూడా నిర్మించకుండా వదిలేశారన్నారు. విద్యుత్ సదుపాయాన్ని కల్పించాలని, రోడ్లను నిర్మించాలని అధికారులను ఆదేశించానని తెలిపారు. జగనన్న కాలనీ కారణంగా కాలనీ పరిసర ప్రాంతాల్లోని 1000 ఎకరాలు నీట మునిగాయని రైతులు తన దృష్టికి తెచ్చారని, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ముంపు సమస్యను పరిష్కరిస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్‌ప్రసాద్, కొమ్మినేని శ్రీనివాసరావు, పిడికిటి శ్రీనివాసరావు, వల్లె నరసింహారావు, రావి సురేష్, ప్రశాంత్, ఉయ్యూరు మహేష్, ఆట్లూరి విష్ణువర్ధనరావు, కొల్లి కృష్ణారావు పాల్గొన్నారు.



కొత్తచట్టాలపై వర్క్‌షాపులో పాల్గొన్న ఆకాశవాణి ప్రాంతీయ వార్తావిభాగం న్యూస్ ఎడిటర్ ఎ.మురళి, ఆకాశవాణి విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎమ్.సోమేశ్వరరావు, డీసీపీ ఆదిరాజ్ సింగ్ రాణా

ప్రజలకు సత్వర న్యాయం చట్టాల లక్ష్యం

- డీసీపీ ఆదిరాజ్ సింగ్ రాణా

విజయవాడ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సత్వరన్యాయం అందించడమే చట్టాల లక్ష్యమని డీసీపీ ఆదిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఈనెల 1 నుంచి అమలులోకి వచ్చిన కొత్తచట్టాలపై శుక్రవారం ఆకాశవాణి విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అవసరాలకు అనుగుణంగా చట్టాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మారుతున్న కాలంతో పాటు చట్టాలలో మార్పులు తీసుకురావడం వల్ల ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. మారిన చట్టాలపై భైరా రామకోటేశ్వరరావు ఆకాశవాణి ప్రతినిధులకు అవగాహన కల్పించారు. నూతన చట్టాల పట్ల ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించే బాధ్యత పాత్రికేయులపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం డైరెక్టర్ సాయి వెంపటి, న్యూస్ ఎడిటర్ అల్లు మురళి, అన్ని జిల్లాల ఆకాశవాణి వార్తా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిలుపుదల చేసిన అలవెన్సులు చెల్లించాలి

- ప్రజా రవాణా సంస్థకు ఈయూ వినతి

బస్సుస్టేషన్, జూలై 5: కండక్టర్లు, డ్రైవర్లు, నిర్వహణ సిబ్బందికి చెల్లించే నెలవారీ ప్రోత్సాహకాలు, నైట్‌హాల్ట్ డ్యూటీలకు వెళ్లే వారికి ఇచ్చే నైట్ అవుట్ అలవెన్సులు, రన్నింగ్ స్టాఫ్‌కు ఇచ్చే రోజువారీ ప్రోత్సాహకాలు, 2019 నుంచి నిలుపుదల చేసిన యూనిఫాం, షూ అలవెన్సులను ప్రభుత్వ అనుమతి తీసుకుని ప్రతి నెలా జీతంతో పాటు చెల్లించాలని ప్రజా రవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య శుక్రవారం ఒక లేఖలో యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. 2019లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత నుంచి ప్రోత్సాహకాలను నిలిపివేశారన్నారు. ఆర్టీసీ ఎండీగా పనిచేసిన ద్వారకా తిరుమలరావు జీవో 114 మేరకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ఆర్టీసీ ఉద్యోగులకు కూడా నైట్‌అవుట్ అలవెన్సులు ఇవ్వడాన్ని ప్రారంభించారన్నారు అయితే కొన్నిచోట్ల ట్రెజరీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. 60శాతం డిపోల్లో మాత్రమే నైట్‌అవుట్ అలవెన్సులు ఇస్తున్నారని తెలిపారు. గతంలో పీఆర్సీ అమలు సమయంలో 46 రోజుల ఓవర్‌టైం డ్యూటీ అలవెన్స్ కూడా పెండింగులో ఉందని తెలిపారు. విధుల్లో ఉద్యోగి ప్రమాదానికి గురై సిక్‌లో ఉంటే ఆకాలానికి ఇంజర్డ్ ఆన్ డ్యూటీగా పరిగణించి జీతం చెల్లించాల్సి ఉండగా, విలీనం అనంతరం చెల్లింపులు నిలుపుదల చేశారన్నారు. క్లయిమ్ చేసిన ఉద్యోగులకు చెల్లింపులు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

వీఎంసీలో ఉద్యోగులకు పదోన్నతులు

- సీనియర్ అసిస్టెంట్లుగా 10 మంది జూనియర్ అసిస్టెంట్లు
- జూనియర్ అసిస్టెంట్లుగా ఏడుగురు క్లాస్-4 ఉద్యోగులు

చిట్టినగర్, జూలై 5: వీఎంసీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 10 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి అంతర్గత బదిలీ చేస్తూ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. సర్కిల్-2 రెవెన్యూ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బి.అనంతలక్ష్మిని సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి సెక్రటరీ సెల్‌కు బదిలీ చేశారు. ఎస్టాబ్లిషన్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.సూర్యప్రకాషరావును సీనియర్ అసిస్టెంట్‌గా అదే సెక్షన్‌లో ఉంచారు. అకౌంట్స్ సెక్షన్‌లో టైపిస్ట్‌గా పని చేస్తున్న కె.విశాలక్ష్మిని సీనియర్ అసిస్టెంట్‌గా జీరో ఒన్ జీరో సెల్‌కు బదిలీ చేశారు. మేయర్ చాంబర్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఐ.జగదీశ్వరప్రసాద్‌ను అదే సెక్షన్‌కు సీనియ్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. పట్టణ ప్రణాళిక విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న టి.వీరభద్రప్రసాద్‌ను ప్రత్యేక వార్డు సెక్రటరీసెల్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. అకౌంట్స్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పీవీఎస్ మురళీకృష్ణను అదే సెక్షన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఎస్టేట్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.అజయ్‌కుమార్‌ను సర్కిల్-3 రెవిన్యూ విభాగం సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. సీ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎ.ఉషారాణిని అకౌంట్స్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. ఎస్టాబ్లిషన్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వీవీ రోజారమణిని అదే సెక్షనలో సీనియర్ అసిస్టెంట్‌గా, వాయిస్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావును అకౌంట్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. ఏడుగురు క్లాస్-4 ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. టౌన్ ప్లానింగ్‌లో చైన్‌మెన్‌గా పని చేస్తున్న ఎం.సాయికిరణ్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి సర్కిల్-2 రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. సర్కిల్-2లో ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న డి.శివ వెంకటసాయినాయక్‌ను సర్కిల్-3 రెవెన్యూ విభాగానికి జూనియర్ అసిస్టెంట్‌గా పంపారు. సర్కిల్-2 బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న బి.నాగరాజును జూనియర్ అసిస్టెంట్‌గా పట్టణ ప్రణాళిక విభాగానికి బదిలీ చేశారు. ఎడ్యుకేషన్‌సెల్‌లో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.రాజును జూనియర్ అసిస్టెంట్‌గా పబ్లిక్ హెల్త్ సెక్షన్‌కు బదిలీ చేశారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో ఎంఎన్‌వోగా పని చేస్తున్న వి.నిర్మలను జూనియర్ అసిస్టెంట్‌గా సర్కిల్-1 రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. పదోన్నతి పొంది పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న జి.శివరామకృష్ణను సీ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్‌గా, ఎడ్యుకేషన్ విభాగంలో క్లాస్- 4గా పని చేస్తున్న ఆర్.విద్యాధరిని జూనియర్ అసిస్టెంట్‌గా అదే విభాగంలో పదోన్నతి కల్పించారు. ఉద్యోగుల పదోన్నతికి కృషి చేసిన ఎ.అజయ్‌కుమార్, ప్రభావతికి పదోన్నతి పొందిన ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు.

దుర్గగుడిలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, జూలై 5: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవో కేఎస్ రామారావు, అధికారులు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అమ్మవారి దర్శనం కల్పించారు. మల్లేశ్వరస్వామి అభిషేకం, అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతి కల్యాణం తదితర ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై శుక్రవారం సాయంత్రం ఎస్.వేదవతి భాగవతారిణితో శివలీలలు అంశంపై హరికథాగానం జరిగింది.

గర్భాలయ గోపురం స్వర్ణతాపడానికి రూ.1,01,116 విరాళం

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం గర్భాలయ గోపుర స్వర్ణతాపడానికి శుక్రవారం హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన ముత్యాల బాల్‌రెడ్డి దంపతులు రూ.1,01,116 విరాళాన్ని ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాతకు వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



కరెన్సీనగర్ ఆయుష్ హాస్పిటల్ రోడ్డులో ప్రారంభం కానున్న విజేత సూపర్ మార్కెట్

విజేత సూపర్ మార్కెట్ 113వ స్టోర్ ప్రారంభం నేడు

భారతీనగర్, జూలై 5: పాతికేళ్లగా ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందిస్తూ అందరి అదరణను పొందుతున్న విజేత సూపర్ మార్కెట్ 113వ స్టోర్‌ను కరెన్సీనగర్ ఆయుష్ హాస్పిటల్ రోడ్డులో శనివారం ఘనంగా ప్రారంభిస్తున్నామని విజేత సూపర్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అమ్మ హాస్పిటల్ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ ఎ.లోకేశ్వరరావు విచ్చేస్తారని, సూపర్ మార్కెట్‌ను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

నా హత్యకు పథకం రచించారు

- పోలీసులకు సెల్‌ఫోన్ స్పేర్‌పార్ట్స్ వ్యాపారి ఫిర్యాదు
- రాజీకి ఒత్తిడి చేస్తున్నారని పోలీసులపై ఆరోపణ

వన్‌టౌన్, జూలై 5: గవర్నర్‌పేటలో అద్దెకు దుకాణాన్ని తీసుకుని సెల్‌ఫోన్ విడిభాగాల వ్యాపారం చేస్తున్న తనను షాపు ఖాళీ చేయలేదని హత్య చేయడానికి దుకాణ యజమాని బంధువులు పథకం రచించారని నిర్వాహకుడు గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన దొడ్డా కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను ఇచ్చిన ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేయకుండా రాజీ చేసుకోమంటూ పోలీసులు తనపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. "గవర్నరుపేట ఎన్టీఆర్ కాంప్లెక్సు వెనుక ఓ షాపును అద్దెకు తీసుకుని సెల్ ఫోన్ విడిభాగాల వ్యాపారం చేస్తున్నా. యజమాని అర్ధంతరంగా షాపు ఖాళీ చేయమన్నారు. కొంతసమయం కావాలని కోరా. అయినా యజమాని అంగీకరించలేదు. దీంతో కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఉత్తర్వులు పొందా. విషయం తెలుసుకున్న షాపు యజమాని బంధువు ప్రకాశ్, అతని స్నేహితులు మరో ఐదుగురు కలిసి ఐదో నెంబరు రూట్‌లో ఒక బార్‌లో కూర్చుని మద్యం తాగుతూ నన్ను హత్య చేయడానికి పథకం వేశారు. ఈనెల 3వతేదీ సాయంత్రం 6.40గంటలకు ప్రకాశ్, రాంబాబు నాగమణి మరికొందరు మద్యం తాగి నా షాపు వద్దకు వచ్చారు. నేను లేకపోవడంతో పనివారిని దూషించారు. నన్ను చంపేస్తామంటూ నానాయాగీ చేశారు. ఈ సంభాషణలు, సంఘటన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి." అని కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం దీనిపై కృష్ణారెడ్డి గవర్నరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రకాశ్ పలువురు రౌడీలతో తిరుగుతాడని, అతనితో ప్రాణహాని ఉందని చెప్పినా పోలీసులకు చెప్పినా ఓ అధికారి, మహిళా ఏఎస్సై కేసు నమోదుచేయకుండా రాజీచేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించాడు.

పల్లా శ్రీనివాస్‌కు అభినందన

చిట్టినగర్, జూలై 5: మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాలతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను శుక్రవారం పార్టీ మంగళగిరి కేంద్ర కార్యాలయంలో తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీమ్ బేగ్ కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు సిరాజుద్దీన్, మస్తాన్, రహ్మతుల్లా, తస్లీమ్ బేగ్ తదితరులు ఉన్నారు.



పల్లా శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు చెబుతున్న డాక్టర్ హసీమ్ బేగ్

'రాబిన్' బృందం కొనసాగింపు

- ఇక, పార్టీ బలోపేతానికి వ్యూహాలు.. పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ
- ఎప్పటికప్పుడు అధినేతకు నివేదికలు.. రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన 'ఐప్యాక్'

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వ్యూహకర్త రాబిన్ శర్మ బృందాన్ని కొనసాగించాలని టీడీపీ నిర్ణయించింది. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి ఈ బృందం సేవలను వినియోగించుకోవాలని, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడానికి కూడా ఈ బృందాన్ని వాడుకోవాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. టీడీపీ విపక్షంలో ఉండగా రాబిన్ శర్మ బృందం పార్టీకి ఎన్నికల వ్యూహకర్త బాధ్యతలు చేపట్టింది. గతంలో ప్రశాంత్ కిశోర్ బృందంలో పనిచేసిన రాబిన్.. తర్వాత సొంతంగా షో టైం గ్రూప్(ఎస్‌టీజీ) సంస్థను నెలకొల్పారు. ఈ సంస్థే టీడీపీకి పనిచేసింది. ఏపీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయంతో ఎస్‌టీజీ బృందానికి దేశవ్యాప్తంగా మంచి పేరు వచ్చింది. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో సేవలందించేందుకు ఈ సంస్థనే అక్కడి సీఎం ఏక్‌నాథ్ శిండే నాయకత్వంలోని శివసేన పార్టీ ఎంపిక చేసుకొంది. ఇక్కడ ఫలితాలు వెలువడిన కొన్ని రోజులకు రాబిన్ శర్మ మహారాష్ట్ర ఎన్నికల్లో పనిచేయడానికి ముంబైకి వెళ్లిపోయారు. ఎస్‌టీజీలో ఆయన తర్వాత కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న శంతన్ మాత్రం ఏపీలో తమ బృందానికి అప్పగించిన బాధ్యతల కోసం ఉండిపోయారు. రాబిన్ బృందానికి ఏపీలో ఆయనే నాయకత్వం వహిస్తున్నారు. ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాజకీయపరమైన విధుల కోసం ఈ బృందాన్ని వినియోగించుకోవాలని టీడీపీ నాయకత్వం నిర్ణయించింది. ఈ బృందం కొద్ది రోజుల కిందట టీడీపీ అధినేత చంద్రబాబుతో సమావేశమైంది. రాబోయే రోజుల్లో ఈ బృందం ఏం చేయాలన్న విషయంపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఎన్నికలకు ముందు ఎస్‌టీజీ తరఫున వందల సంఖ్యలో ఉద్యోగులు పనిచేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత వారిలో అధిక శాతం మందిని ఈ గ్రూప్ ఉపసంహరించింది. ప్రస్తుతం పరిమిత సిబ్బందే ఈ బృందంలో పనిచేస్తున్నారు.

ఇవీ విధులు..

- ఎస్‌టీజీ బృందం క్షేత్రస్థాయిలో టీడీపీ పనితీరుపై దృష్టి పెడుతుంది.
- పార్టీ పరంగా ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సూచనలు చేస్తుంది.
- పార్టీ బలోపేతానికి ప్రణాళిక రూపొందిస్తుంది.
- ఈ ప్రణాళిక అమలు చేస్తూనే.. ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటుంది.
- ప్రజాభిప్రాయ అధ్యయన నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీకి అందిస్తుంది.

ఐప్యాక్‌కి వైసీపీ గుడ్‌బై

ప్రతిపక్షం వైసీపీకి ఎన్నికల వ్యూహకర్తగా పనిచేసిన ఐప్యాక్ బృందం ఆ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకొంది. తాజా ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చవిచూ సిన విషయం తెలిసిందే. ఐప్యాక్ బృందాన్ని వైసీపీ తీసేసినట్లు సమాచారం. ఆ బృందం కోసం పనిచేసిన వారంతా రాష్ట్రం నుంచి వెళ్లిపోయారని తెలిసింది.

వ్యాధుల నుంచి పశువుల్ని కాపాడుకోవాలి: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు, పశువుల పెంపకందారులు జూనోసిస్ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని, ఈ వ్యాధుల నుంచి పశువుల్ని కాపాడుకోవాలని వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా పశువైద్యశాల్లో యాంటీ రేబిస్ టీకాలు వేసే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఓ ప్రకటన చేస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 5.72లక్షల టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసుల్లోసిస్ వ్యాధులు ప్రాణాంకమని, ఈ వ్యాధుల నుంచి పశువుల్ని కాపాడుకునేందుకు సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలని అచ్చెన్న సూచించారు.

11వ పీఆర్సీలో మోసం చేసినందుకే జగన్‌కు 11 సీట్లు

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

అమలాపురం టౌన్, జూలై 5: ప్రాథమిక విద్యా రంగాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ విమర్శించారు. జగన్ తుగ్లక్ పాలనతో మొత్తం విద్యారంగమే నిర్వీర్యమైందన్నారు. 11వ పీఆర్సీలో ఉద్యోగులు, ఉపాధ్యాయులను మోసం చేసిన జగన్‌కు రాష్ట్ర ప్రజలు 11 సీట్లే కేటాయించారని ఎద్దేవా చేశారు. ఎస్టీయూ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.117 విద్యారంగానికి తీరని నష్టం చేకూర్చిందన్నారు. దానిని వెంటనే రద్దు చేయాలన్నారు.

పవన్ వారాహి దీక్ష విరమణ



అమరావతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమాజ సంక్షేమాన్ని, దేశ సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి ఏకాదశ దిన దీక్ష.. వారాహి అమ్మవారి ఆరాధన, కలశోద్వాసన క్రతువుతో పరిసమాప్తమైంది. ప్రదోష కాలాన వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ దీక్షాబద్ధులైన పవన్ కల్యాణ్ వారాహి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏక హారతితో పాటు నక్షత్ర హారతులు అమ్మవారికి సమర్పించారు. చివరిగా హారతితో వారాహి ఏకాదశ దిన ఆరాధన సంపూర్ణం అయింది. వేద పండితులు బ్రహ్మశ్రీ కోసిగంటి సుధీర్ శర్మ, హరనాథ్ శర్మ, వేణుగోపాల శర్మ పూజాక్రతువు పూర్తి చేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఇకపై పవన్ కల్యాణ్ చాతుర్మాస దీక్ష చేయనున్నారు. గృహస్థాచారరీతిలో ఈ దీక్షను తలపెడుతున్నారు. అధికార కార్యకలాపాలను కొనసాగిస్తూనే శుభతిథుల్లో మాత్రం దీక్షా వస్త్రాలు ధరిస్తారు.

సర్టిఫైడ్ కాపీల జారీలో జాప్యమెందుకు?

- రెండు రోజుల్లో మాజీ జడ్జి రామకృష్ణకు అవి ఇవ్వాలి
- చిత్తూరు ఎస్సీ, ఎస్టీ కోర్టు పీవోకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ మాజీ జడ్జి ఎస్.రామకృష్ణ వేసిన ప్రైవేటు ఫిర్యాదులో ట్రయల్ కోర్టు ఉత్తర్వులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలను ఆయనకు ఇవ్వకపోవడంపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. రెండ్రోజుల్లో ఆ కాపీలను పిటిషనర్‌కు అందజేయాలని చిత్తూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారిని ఆదేశించింది. జారీలో జాప్యంపై వివరణ ఇస్తూ నివేదికను తమ ముందుంచాలని సంబంధిత కోర్టు ప్రిసైడింగ్ అధికారికి స్పష్టం చేసింది. విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఎన్.జయసూర్యతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెద్దిరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని కోరుతూ ఎస్.రామకృష్ణ 2021లో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో 2023 ఆగస్టు 18న న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వుల సర్టిఫైడ్ కాపీలు తనకివ్వాలని ఆయన కోర్టుకు దరఖాస్తు చేసుకున్నారు. నిర్దిష్ట ఫీజు కూడా చెల్లించారు. అయినా కాపీలు ఇవ్వకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

9న సికింద్రాబాద్ నుంచి మరో భారత్ గౌరవ్ రైలు

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి మరో భారత్ గౌరవ్ రైలు ప్రారంభం కానుంది. అయోధ్య, కాశీ, గయ, ప్రయాగరాజ్ తదితర పుణ్యక్షేత్రాలను కలిపేలా ఈ టూరిస్ట్ రైలు నడపనున్నారు. మార్గమధ్యంలో తెలంగాణలోని సికింద్రాబాద్, ఖాజీపేట(వరంగల్), ఖమ్మం, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట్, వైజాగ్(పెందుర్తి), విజయనగరం టిట్లాగఢ్(ఒడిశా) స్టేషన్లలో ప్రయాణీకులకు ఎక్కే/దిగే సౌకర్యాన్ని ఉంటుంది. మొత్తం 9 రోజుల పాటు సాగే ఈ దివ్య పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా ప్రయాణీకులకు కొత్తగా నిర్మించిన రామజన్మభూమి, జ్యోతిర్లింగాలలో ఒకటైన కాశీ విశ్వనాథుని ఆలయాన్ని దర్శించుకునే అవకాశం దక్కుతుంది. భారత్ గౌరవ్ రైలు యాత్రకు స్లీపర్ టికెట్ ధర రూ.15,510, కంఫర్ట్ కేటగిరీ ధర రూ.31,500 గా నిర్ణయించారు. దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భారత్ గౌరవ్ టూరిస్ట్ సర్క్యూట్ రైలు గొప్ప అవకాశమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు.

ఆత్మ ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాల్లేవ్..!

- కేంద్రం నిధులిచ్చినా.. రాష్ట్ర వాటా విడుదల కాని వైనం

అమరావతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలోని ఆత్మ ప్రాజెక్ట్ ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఆత్మ ప్రాజెక్ట్‌లో పనిచేసే ఉద్యోగులకు జీతాలు కూడా సంయుక్తంగానే భరిస్తాయి. కేంద్రం వాటా నిధులు వచ్చినా.. రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఉద్యోగులకు జీతాలు అందలేదు. ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసే కొందరు ఉద్యోగులను గత ప్రభుత్వంఆర్బీకేలు, సమీకృత రైతు సమాచార కేంద్రాల్లో నియమించింది. దీంతో వారికి జీతాలు రావట్లేదని చెప్తున్నారు. ఆత్మ ప్రాజెక్ట్‌లో దాదాపు 120 మంది పనిచేస్తుండగా, ఎవరికీ జీతాలు పడట్లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా జీతాలివ్వాలని వారు కోరుతున్నారు.

పుట్టుకతోనే ఎవరూ క్రిమినల్స్ కారు: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 5: పుట్టుకతోనే ఎవరూ క్రిమినల్స్ కాదని, పరిస్థితులే వారిని నేరస్తులుగా మార్చుతాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పలు కారణాల ప్రభావంతో వారు నేరాలు చేస్తారని, వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని మానవత్వంతో విచారణ జరపాల్సి ఉంటుందని పేర్కొంది. విచారణ ప్రారంభం కాకపోవడంతో నాలుగేళ్లుగా జైలులో ఉన్న నకిలీ కరెన్సీ కేసు నిందితునికి బెయిల్ మంజూరు చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. పాకిస్థాన్ నుంచి నకిలీ రూ.2000 కరెన్సీ నోట్లు తీసుకొచ్చాడన్న ఆరోపణ మీద ముంబయికి చెందిన ఓ వ్యక్తిని 2020 ఫిబ్రవరిలో పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 1193 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి కస్టడీలో ఉన్న అతనికి బెయిల్ ఇచ్చేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో బాంబే హైకోర్టు నిరాకరించింది. దాంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

క్రమశిక్షణ కోసం కొడితే టీచరుపై కేసు పెట్టొద్దు

కోచి, జూలై 5: క్రమశిక్షణ పెంపొందించాలన్న సదుద్దేశంలో విద్యార్థులను కొట్టే ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు పెట్టకూడదని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. తోత్తువలోని సెయింట్ జోసఫ్ స్కూల్ ప్రిన్సిపాల్, అక్కడి ఇంగ్లిష్ టీచరు జోమీపై పెట్టిన కేసులను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ పాఠశాలలో 8వ తరగతి చదివే 13 ఏళ్ల విద్యార్థినికి మంచి మార్కులు రాకపోవడంతో ఆమెను టీచరు జోమీ కొట్టారు. దాంతో తల్లిదండ్రులు ఆమెపైనా, పాఠశాల ప్రిన్సిపాల్‌పైనా కొడనాడ్ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 75 కింద నేరం చేసినట్టు పేర్కొన్నారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. ఆ బాలికను దండించడంలో ఎలాంటి దురుద్దేశాలు లేవని తెలిపారు. ఈ వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు.

'ఆధార్'..పౌరసత్వ ధ్రువ పత్రం కాదు: ఉడాయ్

కోల్‌కతా, జూలై 5: ఆధార్ కార్డు పౌరసత్వాన్ని నిరూపించే ధ్రువపత్రం కాదని వాటిని మంజూరు చేసే విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) తెలిపింది. శాశ్వత నివాసానికి రుజువు కూడా కాదని పేర్కొంది. కేవలం ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు పొందేందుకు ఉద్దేశించిన ఏర్పాటు అని స్పష్టం చేసింది. ఆధార్ చట్టంలో విదేశీయులకు ఉద్దేశించిన 28ఏ నిబంధనను కొట్టివేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై కలకత్తా హైకోర్టులో విచారణ సందర్భంగా ఈ స్పష్టతనిచ్చింది. భారత్‌లో కనీసం 182 రోజుల పాటు నివాసం ఉండే వారికి ఆధార్ కార్డు మంజూరు చేస్తారని తెలిపింది.

నిశ్శబ్ద హంతకి కొలెస్ట్రాల్

- అదుపునకు సీఎస్ఐ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూలై 5: రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయుల అసాధారణ హెచ్చుతగ్గులను(డిస్లిపిడెమియా) నివారించేందుకు కార్డియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) గురువారం మార్గదర్శకాలను విడుదల చేసింది. డిస్లిపిడెమియా నిశ్శబ్ద హంతకి వంటిదని సీఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ చంద్ర రథ్ తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యల తరహాలో దీని లక్షణాలు ముందుగా బయటపడవని చెప్పారు. పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధులకు దారితీస్తుందన్నారు. సీఎస్ఐ మార్గదర్శకాల ప్రకారం..గుండె జబ్బులు వంశపారంపర్యంగా వస్తున్న కుటుంబాలకు చెందినవారు తొలి లిపిడ్ ప్రొఫైల్‌ను 18 ఏళ్లు లేదా అంతకుంటే తక్కువ వయస్సులోనే చేయించుకోవాలి. సాధారణ ప్రజలు, ముప్పు తక్కువగా ఉన్నవారు ఎల్‌డీఎల్(చెడు కొలెస్ట్రాల్)-సీ స్థాయులను 100 ఎంజీ/డీఎల్‌కు, నాన్-హెచ్‌డీఎల్(మంచి కొలెస్ట్రాల్)-సీ స్థాయులను 130 ఎంజీ/డీఎల్‌కు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఉన్నవార) ఎల్‌డీఎల్-సీ స్థాయులు 70 ఎంజీ/డీఎల్‌కు, నాన్-హెచ్‌డీఎల్-సీ స్థాయులు 100 ఎంజీ/డీఎల్‌కు లోపు ఉండేలా జాగ్రత్త వహించాలి. ఆహారంలో చక్కెర, కార్బొహైడ్రేట్‌లను తక్కువగా తీసుకోవాలి. గుండె ఆరోగ్యాన్ని కాపాడే యోగా, వ్యాయామం వంటివి చేయాలి.

క్లస్టర్ వర్సిటీపై కక్ష!

మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన అరాచకం.. రిజిస్ట్రార్ సంతకం ఫోర్జరీ... 46కోట్లు మళ్లింపు

- ప్రశ్నించినందుకు వీసీపై కక్షసాధింపు చర్యలు
- ఏడాదిగా బడ్జెట్, జీతాలివ్వకుండా వేధింపులు
- సీఐడీ విచారణ కోరుతూ సీఎంకు వీసీ లేఖ

కర్నూలు(అర్బన్): కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీపై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కక్షసాధింపులకు పాల్పడ్డారు. కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టుపై 50ఎకరాల్లో వర్సిటీ భవనాల నిర్మాణం కోసం 2021లో కేంద్రం రూ.80.50 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు మంత్రి తనకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు. అయితే బుగ్గననే కాంట్రాక్టర్‌గా మారి బినామీ పేరుతో పనులు నిర్వహిస్తున్నారని అప్పట్లో దుమారం రేగింది. పనులు సక్రమంగా చేయకపోగా ఇష్టారీతిన వ్యవహరించారన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే 2023లో నిర్మాణాలకు సంబంధించి రూ.46కోట్ల బిల్లులను వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీనివాసులు సంతకం ఫోర్జరీ చేసి కాంట్రాక్టర్ ఖాతాలోకి మళ్లించారు. దీనికి సంబంధించి ఎం.బుక్, రికార్డ్స్‌లో సంతకాలు పెట్టాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది. ఇందుకు వీసీ ససేమిరా అనడంతో పాటు నిర్మాణాల్లో జరుగుతున్న అక్రమాలపై అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. దీనిపై బుగ్గనతో మాట్లాడిన బొత్స, విషయాన్ని నాటి సీఎస్ జవహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

ఉపకులపతిపై రుసరుసలు!

వర్సిటీ నిర్మాణాల్లో జరుగుతున్న అక్రమాలను బొత్స దృష్టికి తీసుకెళ్లడాన్ని జీర్ణించుకోలేని బుగ్గన.. 'నాపైనే ఫిర్యాదు చేస్తావా..' అంటూ వీసీ సాయిగోపాల్‌పై రుసరుసలాడటంతో పాటు బెదిరింపులకు సైతం దిగినట్టు సమాచారం. అలాగే రిజిస్ట్రార్ శ్రీనివాసులు డిప్యుటేషన్‌ను రద్దుచేసి, ఎస్వీ వర్సిటీకి రీకాల్ చేయాలని ఆదేశించారు. మరోవైపు విద్యార్థి సంఘాలతో రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేయించారు. అయితే రిజిస్ట్రార్ డిప్యుటేషన్ రద్దుకు వీసీ అంగీకరించకపోవడంతో ఏడాదిగా వర్సిటీకి బడ్జెట్‌తో పాటు జీతాలు కూడా నిలిపివేయించారు. అప్పటి విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్యామలరావు, సీఎస్ కూడా ఈ విషయంలో దోబూచులాడారు. ట్రెజరీకి 5 నెలల జీతాన్ని సిఫారసు చేస్తూనే దానిపై బుగ్గనకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన కర్నూలు ట్రెజరీలో ఉపకులపతి అకౌంట్‌కు జీతం బదిలీ అయ్యే సమయానికి వాటిని నిలిపివేయించారు. నేటి వరకూ జీతాలు అందని పరిస్థితి నెలకొంది.

'పోలా' మోకాలడ్డు

ఈ వర్సిటీకి సంబంధించి బోధన, బోధనేతర పోస్టులు మంజూరైనా నేటికీ భర్తీ కాలేదు. ఇందుకు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అడ్డుతగులుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీసీ తనకు అనుకూలంగా వ్యవహరించరనే ఉద్దేశంతోనే పోస్టుల భర్తీకి కమిషనర్ అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. వీసీని ఇబ్బందులకు గురిచేసి దారికి తెచ్చుకోవడంలో భాగంగా అనేక సమస్యలు సృష్టించినట్టు సమాచారం. వర్సిటీకి అనుసంధానం కావాల్సిన కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, సిల్వర్ జూబ్లీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వీసీ మధ్య నిత్యం వివాదాలు సృష్టించారన్న విమర్శలు ఉన్నాయి. అంతేగాకుండా ఆయా కళాశాలల్లో బదిలీలు, అంతర్గత బదిలీలు, పాలనా వ్యవహారాల్లో అన్ని తానై నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. 2021 నుంచి పోస్టులు భర్తీ చేయకపోవడంతో కేవలం వీసీ, రిజిస్ట్రార్‌లే మిగిలారు. అటెండర్, ఇతర విధులకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను బతిమాలి డిపుటేషన్‌పై తెచ్చుకున్న ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు.



కర్నూలు నగర శివారులోని క్లస్టర్ యూనివర్సిటీ

సీఎంకు లేఖ రాశా

క్లస్టర్ వర్సిటీకి సంబంధించి జరుగుతున్న అక్రమాలపై సీబీసీఐడీ, సీఐడీ దర్యాప్తునకు ఆదేశించాలని సీఎం, సీఎస్‌కు లేఖ రాశాను. రిజిస్ట్రార్ సంతకం ఫోర్జరీ చేసి కళాశాల నిర్మాణాలకు సంబంధించిన రూ.46కోట్లు కాజేశారు. ప్రశ్నించినందుకు ఏడాదిగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తూ వచ్చారు. దీనికితోడు వర్సిటీకి బడ్జెట్ కూడా కేటాయించకుండా నిలిపివేశారు.

- ప్రొఫెసర్ డాక్టర్ సాయిగోపాల్, వీసీ, క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు

మామను నరికి చంపిన అల్లుడు

- అనంతపురం జిల్లాలో దారుణం

గుంతకల్లు టౌన్, జూలై 5: భార్యను కాపురానికి పంపకపోవడం, పెద్ద మనుషుల పంచాయితీలో దూషించడంతో కక్ష పెంచుకున్న అల్లుడు దారి కాచి మామను నరికేశాడు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం నల్లదాసరిపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. నల్లదాసరిపల్లికి చెందిన ఆవుల లక్ష్మన్న(52), క్రిష్ణవేణి దంపతుల రెండో కుమార్తె లలితను కర్నూలు జిల్లా చిప్పగిరి మండలానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి 2021లో వివాహం చేశారు. తాగుడుకు బానిస అయిన చంద్రశేఖర్, పుట్టింటి నుంచి డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. ఈ కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. లలిత గర్భం దాల్చడంతో ఆరు నెలల కింద పుట్టింటికి తీసుకువచ్చారు. అల్లుడి ప్రవర్తన నచ్చక.. ఆమెను తల్లిదండ్రులు కాపురానికి పంపలేదు. దీంతో చంద్రశేఖర్ పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టాడు. కాపురానికి రాకపోతే కుమార్తెను తానే పెంచుకుంటానని చెప్పాడు. 'పాలుతాగే పసిబిడ్డను ఎలా తీసుకెళతావు..? బుద్ధి లేదా?' అని అల్లుడిని లక్ష్మన్న మందలించాడు. ఇలా పంచాయితీలో అవమానం జరిగిందని మామ మీద చంద్రశేఖర్ కక్ష పెంచుకున్నాడు. అతన్ని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో లక్ష్మన్న గురువారం పనిమీద గుంతకల్లుకు వెళ్లాడు. బైక్ మీద స్వగ్రామానికి వస్తుండగా, మారమధ్యలో తిమ్మాపురంలో మాటువేసిన చంద్రశేఖర్, అతని అన్న రాజశేఖర్, అన్న స్నేహితుడు సతీష్ కత్తులతో విచక్షణా రహితంగా నరికి పారిపోయారు. చీకటి పడినా లక్ష్మన్న ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గుంతకల్లు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సెల్‌ఫోన్ లొకేషన్ తిమ్మాపురం వద్ద చూపించడంతో ఎస్ఐ కె.సురేష్ అక్కడికి చేరుకుని పరిశీలించేసరికి లక్ష్మన్న మృతిచెందాడు. కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వచ్చిన చంద్రశేఖర్.. లక్ష్మన్న వైసీపీ వర్గీయుడు కావడంతో టీడీపీ వారే హత్య చేసి ఉంటారని చెప్పాడు. పోలీసులు క్లూస్‌టీం, జాగిలాలను రప్పించారు. జాగిలాలు అక్కడే ఉన్న చంద్రశేఖర్ వద్దకు వెళ్లి ఆగిపోవడంతో అతన్ని ప్రశ్నించడంతో నిజం ఒప్పుకొన్నాడు.


లక్ష్మన్న

హీరో రాజ్ తరుణ్ మోసం చేశాడు

- నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో లావణ్య అనే మహిళ ఫిర్యాదు
- ఆరోపణలను కొట్టిపారేసిన రాజ్‌తరుణ్


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న లావణ్య

నార్సింగ్, జూలై 5(ఆంధ్రజ్యోతి): హీరో రాజ్‌తరుణ్ ప్రేమ పేరుతో తనను మోసం చేశాడంటూ లావణ్య అనే మహిళ నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. 2012 నుంచి తమ ఇద్దరి మధ్య అనుబంధం ఉందని.. 2014 మే 11 నుంచి ఒకే ఇంట్లో ఉంటూ సహజీవనం చేస్తున్నామని ఆమె పేర్కొంది. పదకొండేళ్లుగా అదే ఇంట్లో ఉంటున్నామని.. ఇద్దరం శారీరకంగా, మానసికంగా దగ్గరై చాలా ఆనందంగా ఉండేవారమని వివరించింది. "అయితే.. రాజ్‌తరుణ్ ఈ మధ్య హీరోయిన్ మాల్వి మల్హోత్రాతో కలిసి తిరుగుతున్నాడని తెలిసింది. 'తిరగబడర సామి' సినిమా షూటింగ్ నుంచి వారిద్దరి మధ్య ఎఫైర్ మొదలైంది. వారిద్దరూ ఇక్కడ ఒక డైరెక్టర్ ఇంట్లో కలిసేవారు. ఇద్దరూ కలిసి గోవా, చెన్నై, పాండిచ్చేరి తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. ఈ విషయం నాకు తెలిసి నిలదీసినప్పటి నుంచీ అంతా మారిపోయింది. రాజ్ నన్ను తిట్టడం మొదలుపెట్టాడు. ఆమె కూడా నన్ను టార్గెట్ చేసింది. రాజ్‌ను వదిలేయాలంటూ మాల్వి కుటుంబ సభ్యులంతా నన్ను బెదిరించారు. 'కొంత డబ్బిస్తా రాజ్‌తో బ్రేకప్ చేసుకో' అని ఆమె తండ్రి నన్ను హెచ్చరించాడు. రాజ్‌ను వదిలేయకపోతే నన్ను జైలుకు పంపిస్తానని.. చంపేస్తానని.. మాల్వి సోదరుడు నన్ను బెదిరించాడు. ఇదంతా జరుగుతుండగానే.. నాకు సంబంధం లేని ఒక కేసులో బలవంతంగా ఇరికించారు. ఆ కేసులో 43 రోజులు నేను జైల్లో ఉన్నా. బయటకు వచ్చేసరికి అంతా మారిపోయింది. రాజ్ మేమున్న ఇంటిని వదిలేసి వెళ్లిపోయాడు. మేమిద్దరం త్వరలో పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నాం. కానీ.. ఇంతలోనే ఇలా జరిగింది. ఇంతకుముందు రాజ్ ఇలా ఉండేవాడు కాదు. నాపట్ల అతడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది" అని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, తనపై ఫిర్యాదు చేసిన లావణ్యతో ఒకప్పుడు తాను రిలేషన్‌లో ఉన్న మాట నిజమేగానీ.. ప్రస్తుతం ఆమె మస్తాన్ సాయి అనే వ్యక్తితో రిలేషన్‌లో ఉందని హీరో రాజ్‌తరుణ్ చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం మీడియాతో మాట్లాడిన ఆయన.. లావణ్య తనపై చేసిన ఆరోపణలను తోసిపుచ్చారు. 2017 తర్వాత తమ మధ్య ఎలాంటి శారీరక సంబంధం లేదని తేల్చిచెప్పారు. "నా ఇంట్లో నేను కింది అంతస్తులో ఉంటే ఆమె మస్తాన్‌సాయి అనే వ్యక్తితో రెండో అంతస్తులో ఉండేది. ఆమె డ్రగ్స్‌కు అలవాటు పడింది. ఆమెపై గతంలో డ్రగ్స్ కేసు కూడా నమోదైంది. ఆవిడకు బేసిగ్గా నా దగ్గర నుంచి డబ్బులు కావాలి. అయితే.. నేను ఇటీవలే లావణ్య గురించి డీసీపీతో మాట్లాడాను. అప్పట్నుంచి.. నేను తనను ఎక్కడ ఇల్లు ఖాళీ చేయిస్తానో అనే భయంతో ఆమె ఇలా రచ్చ చేస్తోంది. ఇదంతా నా మంచికే. జనాలకు అంతా తెలిసింది. నేను కూడా ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా. నాకు ఆమెతో పెళ్లి కాలేదు. పెళ్లి చేసుకుంటానంటూ నేనెప్పుడూ ఆమెను మోసం చేయలేదు" అని రాజ్‌తరుణ్ వివరణ ఇచ్చారు.

టీడీఆర్ గోల్‌మాల్‌లో మహిళా ఐఏఎస్

- తాడేపల్లిగూడెంలో బాండ్ల జారీకి సహకరించినందుకు 1.70 కోట్ల ముడుపులు
- స్థానిక వైసీపీ నేతకు రూ.5 కోట్లు
- మధ్యవర్తి, బిల్డర్‌కూ వాటాలు
- స్థల యజమానులకు మాత్రం సున్నా

భీమవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో టీడీఆర్ బాండ్ల కుంభకోణం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రస్థాయిలో కీలక పదవి చేపట్టిన మహిళా ఐఏఎస్ అధికారి అండదండలతో ఈ బాండ్లు జారీచేశారు. తాడేపల్లిగూడెంలో వైసీపీ నేత ఇందుకు వ్యూహం రచించారు. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయలు చేతులు మారాయి. వైసీపీ నేత రూ.5 కోట్లు తీసుకున్నారు. బాండ్ల జారీ కోసం సహకరించిన మహిళా ఐఏఎస్ అధికారికి రూ.1.70 కోట్లు ముట్టజెప్పారు. బాండ్ల జారీలో మధ్యవర్తిగా ఉన్న భీమవరం పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి రూ.2.50 కోట్లు లబ్ధి చేకూరింది. బిల్డర్‌కు రూ.2.50 కోట్లు మిగిలింది. మున్సిపల్ అధికారులకు రూ.30 లక్షలు ఖర్చు పెట్టారు. అసలు స్థల యజమానులకు మాత్రం ఒక్క పైసా ప్రయోజనం లేకుండా, వారికి తెలియకుండా బాండ్లు జారీ అయిపోయాయి. తాడేపల్లిగూడెం పట్టణంలోని తాళ్లముదునూరుపాడు ప్రాంతంలో భీమవరం రహదారికి ఆనుకుని స్థలం ఉంది. మాస్టర్ ప్లాన్‌లో అది వంద అడుగుల రహదారి. ఇప్పటికే 80 అడుగుల రహదారిని విస్తరించారు. ఇంకా విస్తరించే అవకాశం లేదు. దాదాపు నాలుగు కిలోమీటర్ల పొడవు రహదారి ఉంది. ఇరువైపులా మార్కెట్ దుకాణాలు ఉన్నాయి. రహదారి వెడల్పు చేస్తే మార్కెట్ దెబ్బ తింటుంది. దీంతో వెడల్పు చేసే అవకాశమే లేదు. కానీ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా ఆ స్థలానికి మారుగా బాండ్లు జారీ చేశారు. భారీ మొత్తంలో సొమ్ములు చేతులు మారాయి.

అపార్ట్‌మెంట్ కట్టకుండానే...

తాళ్లముదునూరుపాడులో 3,308 గజాల స్థలాన్ని అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం స్థల యజమానులు వెలగల పార్వతి, గుడిమెట్ల హిమబిందు, చింతా శ్రీలతలు శివశక్తి కన్‌స్ట్రక్షన్ యజమాని అకిరి నాగభూషణరావుతో ఒప్పందం చేసుకున్నారు. అందులో 2,140 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టేలా, మిగిలిన స్థలంలో సెట్ బ్యాక్‌లు, మాస్టర్ ప్లాన్ రహదారి(100 అడుగుల రోడ్డు) కోసం విడిచిపెట్టేలా ఒప్పందం కుదిరింది. ఇందుకోసం స్థల యజమానులకు అపార్ట్‌మెంట్‌లో 40 శాతం ప్లాట్‌లు బిల్డర్ ఇవ్వాలి. అయితే అదే ఒప్పందంతో మున్సిపాలిటీకి బిల్డర్ మాస్టర్‌ప్లాన్ రహదారిలో ఉన్న స్థలాన్ని 1,200 చదరపు గజాలు రిజిస్ట్రేషన్ చేసేశారు. ఇందుకోసం మున్సిపాలిటీ 4,800 చదరపు గజాలకు సరిపడా టీడీఆర్ బాండ్లు జారీ చేసింది. ఇక్కడ చదరపు గజం స్థలం విలువ రూ.55 వేలు. నిబంధనల మేరకు స్థల యజమానులకు నాలుగు రెట్లు విలువైన బాండ్లు జారీ చేయాలి. అయితే ఇక్కడ బిల్డర్ పేరుతో మాస్టర్ ప్లాన్ స్థలానికి రూ.31 కోట్ల విలువైన బాండ్లు జారీ చేసింది. అవే బాండ్లను మార్కెట్‌లో రూ.12 కోట్లకు విక్రయించి పంచుకున్నారు. అసలు స్థల యజమానులకు ఒక్క పైసా ప్రయోజనం లేకపోయింది. మరోవైపు స్థల యజమానులతో శివశక్తి కన్‌స్ట్రక్షన్ యజమాని రెండో ఒప్పందం చే సుకున్నారు. మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ స్థలానికి లభించిన టీడీఆర్ బాండ్లలను అదే అపార్ట్‌మెంట్ నిర్మాణంలో ఉపయోగించుకుంటామని ఒప్పందంలో స్పష్టం చేశారు. కానీ అందుకు విరుద్ధంగా బయట విక్రయించుకుని లబ్ధి పొందారు. అక్కడ అపార్ట్‌మెంట్ నిర్మాణం మాత్రం జరగలేదు. దీంతో స్థల యజమానులు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పుడు దీనిపై కూటమి నేతలు దృష్టి పెట్టారు. విచారణ దిశగా పావులు కదుపుతున్నారు. అయితే లబ్ధిపొందిన వైసీపీ నేత మున్సిపల్ అధికారులతో సంప్రదించి వివరాలు ఇవ్వకూడదంటూ ఒత్తిడి చేస్తున్నారు.

ఒక్కరోజులో ఎలా సాధ్యం?

మున్సిపాలిటీకి 2022 జూన్ 16న మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రహదారి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తే ఆ మరుసటి రోజున అంటే.. 17న బాండ్లు జారీ చేసేశారు. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత ఏ విషయాన్ని పరిశీలించకుండా ఒక్క రోజులోనే బాండ్లు జారీ చేశారు. మహిళా ఐఏఎస్ అధికారి సహకారంతో ముందుగానే సంప్రదించి పక్కా వ్యూహంతో వ్యవహరించారు. సదరు వైసీపీ నేత మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణంలో ఉన్న మాస్టర్ ప్లాన్ రహదారుల్లో ఉన్న స్థలాలన్నింటికీ టీడీఆర్ బాండ్లు జారీ చేసేలా ప్రణాళిక వేసుకున్నారు. ప్రభుత్వం మారిపోవడంతో బాండ్ల కుంభకోణం వెలుగులోకి వస్తోంది.


జాంజ్‌గీర్ జిల్లాలో ఐదుగురిని మింగిన బావి ఇదే

మృత్యుబావులు

- ఛత్తీస్‌గఢ్‌లో 9మందిని మింగేసిన రెండు బావులు
- జాంజ్‌గీర్ జిల్లాలో ఐదుగురు.. కోర్బాలో నలుగురు దుర్మరణం

చర్ల/కోర్బా, జూలై 5: ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గీర్-చంపా జిల్లా కికిర్దా గ్రామానికి చెందిన రామచంద్ర జైశ్వాల్(60) ఇంటికి ఆనుకొని 30 అడుగుల లోతైన బావి ఉంది. ఇంటి అవసరాల కోసం బోర్ వేయించడంతో కొన్ని నెలల క్రితం కర్ర చెక్కలతో ఆ బావిని మూసేశారు. ఇటీవల ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలు, బలమైన గాలుల కారణంగా బావిపై ఉన్న కర్రచెక్కల్లో ఒకటి అందులో పడిపోయింది. దాన్ని తీయడానికి శుక్రవారం ఉదయం రామచంద్ర ఆ బావిలోకి దిగాడు. మధ్యలోకి వెళ్లగానే స్పృహ తప్పి బావిలో పడిపోయాడు. అది చూసి అతని భార్య అరవడంతో.. పక్కనే ఉంటున్న రమేశ్ పటేల్(50) అతని ఇద్దరు కుమారులు జితేంద్ర(25), రాజేంద్ర(20) పరుగెత్తుకుంటూ వచ్చి బావిలోకి దిగారు. వారు కూడా బావిలోని నీళ్లలో పడిపోయారు. నలుగురూ బయటకు రాకపోవడంతో టీకేశ్వర్ చంద్ర(25) అనే మరో వ్యక్తి వారిని కాపాడటానికి బావి లోపలికి వెళ్లాడు. అతను కూడా ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీంతో భయపడిపోయిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఎస్‌డీఆర్ఎఫ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. బావిని మూసివేయడం వల్ల అందులో విషవాయువు తయారై ఉంటుందని, దాన్ని పీల్చడం వల్లే ఐదుగురూ చనిపోయి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. మరణాలకు గల కచ్చితమైన కారణం పోస్టుమార్టం తర్వాత తెలుస్తుందన్నారు. బావిలో ఐదడుగుల మేర నీళ్లు ఉన్నాయని తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో కోర్బా జిల్లాలోని జూరాలి గ్రామంలో కూడా ఇదే తరహా ఘటన జరిగింది. గ్రామానికి చెందిన జుహ్రా పటేల్(60) శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ పనుల్లో ఉండగా ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయాడు. అతన్ని కాపడానికి కూతురు సపినా(16) బావిలోకి దిగింది. ఆ తర్వాత వారిద్దరి కోసం అదే కుటుంబానికి చెందిన శివ్‌చరణ్(45), మన్‌బోధ్(57) బావిలోకి వెళ్లారు. నలుగురూ బావిలోనే చనిపోయారు. ఈ ఘటనలో కూడా మరణాలకు విషవాయువే కారణం కావొచ్చని అనుమానిస్తున్నారు. రెండు ఘటనలపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జాంజ్‌గీర్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున, జూరాలి గ్రామ మృతుల కుటుంబాలకు రూ.4లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

కేశవరావు రాజీనామా ఆమోదం

- ఎంపీలుగా అమృత్‌పాల్‌సింగ్, 'రషీద్ ప్రమాణం

న్యూఢిల్లీ, జూలై 5: రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ శుక్రవారం కె. కేశవరావు రాజీనామాను ఆమోదించారు. బీఆర్ఎస్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కేశవరావు ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. అనంతరం నైతిక బాధ్యత వహిస్తూ గురువారం తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. కేశవరావు రాజీనామాతో రాజ్యసభలో 16 సీట్లు ఖాళీ అయ్యాయి. మరోవైపు జైలు నుంచి లోక్‌సభ ఎన్నికలకు పోటీ చేసి గెలుపొందిన అమృత్‌పాల్‌సింగ్, ఇంజనీర్ రషీద్ శుక్రవారం ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. పెరోల్‌పై బయటకు వచ్చిన వారు లోక్‌సభలో భారీ భద్రత నడుమ ప్రమాణం చేశారు. అమృత్‌పాల్ సింగ్ పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందగా, ఇంజనీర్ రషీద్ జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగి విజయం సాధించారు. ఖలిస్థాన్ సానుభూతిపరుడైన అమృత్‌పాల్ సింగ్ 2023 ఏప్రిల్ నుంచి అస్సాం జైల్లో ఉండగా, ఇంజనీర్ రషీద్ ఉగ్రవాదులకు నిధులను సమకూరుస్తున్నారనే ఆరోపణలతో 2017లో అరెస్టయి 2019 నుంచి తిహార్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు.

న్యాయమూర్తులు భయపడుతున్నారు

- అందుకే విపక్ష నేతలకు బెయిలు ఇవ్వట్లే: మొహువా మొయిత్రా



న్యూఢిల్లీ, జూలై 5: ప్రతిపక్ష నేతల కేసుల్లో న్యాయమూర్తులు న్యాయం చేయడానికి భయపడుతున్నారని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా అన్నారు. ప్రభుత్వానికి ఎక్కడ కోపం వస్తుందేమోనన్న భయంతో బెయిలు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. మూడు రోజుల క్రితం లోక్‌సభ సమావేశాల చివరి రోజు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడుతూ మహువా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అవి సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతున్నాయి. న్యాయమూర్తులు దేవుళ్లు కారని, ప్రజల పట్ల సహానుభూతితో పని చేయాలని ఇటీవల సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను మొయిత్రా ప్రస్తావించారు. ఎక్కడా సగం గర్భం ఉండదని, అయితే కడుపుతో ఉన్నారని లేదా లేరని మాత్రమే అంటారని అన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయం కూడా సంపూర్ణమైనదిగా ఉండాలని స్పష్టం చేశారు. కొద్దిగానే ప్రభావవంతంగా ఉంటానంటే కుదరదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేఖా శర్మపై మహువా శుక్రవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హత్రాస్ తొక్కిసలాట జరిగిన సంఘటన స్థలాన్ని రేఖా శర్మ శుక్రవారం సందర్శించారు. అక్కడ బంట్రోతు గొడుగు పట్టుకొని రేఖాశర్మ వెనుక నడుస్తున్న వీడియో వైరల్ అయ్యింది. రేఖకు అంత అధికార దర్పం ఎందుకని విమర్శలు వెల్లువెత్తాయి. ఛైర్‌పర్సన్ తన గొడుగు తాను పట్టుకొని నడవలేరా? అని ఎవరో వేసిన ప్రశ్నకు మొహువా మొయిత్రా సమాధానం ఇస్తూ.. ఆమె తన బాస్(మోదీ) పరువు కాపాడే పనిలో బిజీగా ఉన్నారనే అర్థం వచ్చేలా పోస్టు చేశారు. మహువా వ్యాఖ్యను తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్ 3రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 6 జూలై 2024
diksuchi@andhrajyothy.com



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'టీజీ ఈఏపీ సెట్ 2024 (ఎంపీసీ స్ట్రీమ్) కౌన్సెలింగ్' ప్రక్రియ ప్రారంభమైంది. ఈ కౌన్సెలింగ్ ద్వారా బీఈ/బీటెక్/ఫార్మసీ కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు టీజీ ఈఏపీ సెట్ 2024లో సాధించిన ర్యాంక్ ఆధారంగా సీట్ల అలాట్‌మెంట్ ఉంటుంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్స్ ప్రక్రియలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కౌన్సెలింగ్ ప్రక్రియను మూడు విడతల్లో నిర్వహిస్తారు. చివరలో స్పాట్ అడ్మిషన్స్ ఉంటాయి.

తెలంగాణ ఈఏపీసెట్ కౌన్సెలింగ్

అర్హత: అభ్యర్థులు గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు కనీసం 45 శాతం, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ టీజీ ఈఏపీ సెట్ 2024(ఎంపీసీ స్ట్రీమ్) అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సులకు 16 ఏళ్లు; ఫార్మాడీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) కోర్సుకు 17 ఏళ్లు నిండి ఉండాలి. స్కాలర్‌షిప్ పొందాలంటే 2024 జూలై 1 నాటికి జనరల్ అభ్యర్థులకు 25 ఏళ్లు, రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు 29 ఏళ్లు మించకూడదు.

స్లాట్ బుకింగ్: వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'పేమెంట్ ఆఫ్ ప్రాసెసింగ్ ఫీ' లింక్‌పై క్లిక్ చేయాలి. టీజీ ఈఏపీసెట్ 2024 హాల్‌టికెట్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్, ఇంటర్ హాల్ టికెట్ నెంబర్ ఎంటర్ చేయాలి. తరవాత ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర సమాచారం ఎంటర్ చేయాలి. ప్రాసెసింగ్ ఫీజు కింద జనరల్, బీసీ అభ్యర్థులు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600 చెల్లించాలి. తరవాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం దగ్గరలోని హెల్ప్ లైన్ సెంటర్, డేట్, టైమ్ సెలెక్ట్ చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా 36 హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. వీటి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.

- దివ్యాంగులు, ఎన్‌సీసీ అభ్యర్థులు, క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులు, ఆంగ్లో ఇండియన్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు మాత్రం హైదరాబాద్-మాసబ్‌ట్యాంక్ వద్దగల గవర్నమెంట్ పాలిటెక్నిక్ సెంటర్‌ను ఎంచుకోవాలి. ఈ కేటగిరీలకు నిర్దేశించిన తేదీల ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది.
- క్రీడాకారులు, సీఏపీ అభ్యర్థులకు జూలై 6 నుంచి 8 వరకు; ఎన్‌సీసీ అభ్యర్థులకు జూలై 9 నుంచి 12 వరకు; దివ్యాంగులు, ఆంగ్లో ఇండియన్ అభ్యర్థులకు జూలై 13న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్: హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లే అభ్యర్థులు తమ వెంట టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ కార్డ్, హాల్ టికెట్; ఆధార్ కార్డ్; పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మెమో-పాస్ సర్టిఫికెట్, ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ; 2024 జనవరి 1న గానీ ఆ తరవాత గానీ తీసిన ఇన్‌కం సర్టిఫికెట్; వ్యాలిడ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్; కులం, స్థానికత, వైకల్యం, ఎన్‌సీసీ, క్రీడలు తదితర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాలి.

- సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తరవాత అధికారులు ఇచ్చిన ఆర్‌ఓసీని చెక్ చేసుకోవాలి. తరవాత అభ్యర్థుల మొబైల్‌కు లాగిన్ ఐడీ పంపుతారు. ఈ ఐడీ వచ్చిన తరవాతనే హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి బయటకు రావాలి. దీని ద్వారా అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు.

ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 నుంచి 23 వరకు

సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 26
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 27
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 27 నుంచి 28 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 28
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 31
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 8
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** ఆగస్టు 9
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 9 నుంచి 10 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** ఆగస్టు 10
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 13
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 13 నుంచి 15 వరకు

సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లయిడింగ్ షెడ్యూల్
- **వెబ్ ఆప్షన్స్:** ఆగస్టు 21 నుంచి 22 వరకు
- **ఫ్రీజింగ్ ఆప్షన్స్:** ఆగస్టు 22
- **సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 26
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** ఆగస్టు 27 నుంచి 28 వరకు
- **స్పాట్ అడ్మిషన్స్ గైడ్‌లైన్స్ విడుదల:** ఆగస్టు 28

వెబ్‌సైట్: tgeapcet.nic.in



ఐఐపీలో ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లు

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్)2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫయిడ్ ప్యాకేజింగ్ ఇంజనీర్ కోర్సును కూడా అందిస్తున్నారు. దీని వ్యవధి ఏడాది. ఈ కోర్సులో ప్రవేశానికి ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. కోర్సులు పూర్తయ్యే నాటికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు.

సీట్లు
- **పీజీ డిప్లొమా:** ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు, అహ్మదాబాద్ క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- **ఎంఎస్:** హైదరాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి.
- **సీపీఈ:** చెన్నై క్యాంపస్‌లో 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్: ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, అప్లయిడ్ మెకానిక్స్, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజం, ప్రిన్సిపల్స్ ఆఫ్ ప్యాకేజింగ్, పేపర్ అండ్ పేపర్ బోర్డ్, గ్లాస్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్, పాలిమర్స్, ఇంజనీరింగ్ డ్రాయింగ్, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్, ప్రింటింగ్ టెక్నాలజీ, ప్రొడక్షన్/ఫైనాన్షియల్/మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్యాకేజింగ్ మెషినరీ, ప్యాకేజింగ్ లాస్, టూలింగ్ అండ్ డిజైన్, ప్యాకేజింగ్ డిజైన్స్, అప్లికేషన్ ఆఫ్ కంప్యూటర్స్, ఆటోక్యాడ్ తదితర సబ్జెక్టుల్లో తరగతులు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రాక్టికల్ సెషన్స్, రీసెర్చ్ యాక్టివిటీస్, ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ సంబంధిత శిక్షణ ఉంటాయి.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది. ఇందులో ప్యాకేజింగ్ మెటీరియల్స్, ప్యాకేజ్ డెవలప్‌మెంట్, ప్యాకేజ్ ప్రింటింగ్ టెక్నాలజీ, మెటీరియల్ టెస్టింగ్, ప్యాకేజ్ ఫినిషింగ్ ఆపరేషన్స్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ఫార్మాస్యూటికల్ అండ్ మెడికల్ డివైజ్ ప్యాకేజింగ్, ఇండస్ట్రియల్ ప్రొడక్ట్ ప్యాకేజింగ్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ మెషినరీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్-మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ డిజైన్ తదితర అంశాలు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ల్యాబొరేటరీ సెషన్స్, ఇండివిడ్యువల్ ప్రాజెక్ట్ వర్క్‌లు, కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ రిపోర్ట్ రైటింగ్ ట్రెయినింగ్, అయిదు నెలల ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

సీపీఈ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: ఈ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో మూడు సెమిస్టర్లు ఉంటాయి. వీటిలో ప్యాకేజింగ్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ స్టడీస్ సంబంధిత సెషన్స్ నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ అండ్ రిపోర్ట్, డిజర్టేషన్, ప్రజంటేషన్ తదితరాలు ఉంటాయి.

అర్హత: పీజీడీపీ ప్రోగ్రామ్‌నకు గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/మైక్రోబయాలజీ/బయో కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అగ్రికల్చర్/ఫుడ్ సైన్స్/పాలిమర్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ డిగ్రీ అభ్యర్థులు కూడా అర్హులే. ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్/నాలుగేళ్ల డిగ్రీ ఇన్ ఇంటిగ్రేటెడ్ సైన్సెస్ ఉత్తీర్ణులై ఉండాలి. సీపీఈ ప్రోగ్రామ్‌నకు బీఈ/బీటెక్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసిన/రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైం డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. పీజీడీపీ, ఎంఎస్ ప్రోగ్రామ్‌లకు అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. సీపీఈ ప్రోగ్రామ్‌నకు వయోపరిమితి నిబంధనలు లేవు.

ఐఐపీ సెట్ 2024: ఇది ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

ఎంపిక: సంస్థ నిర్ణయించిన ప్రకారం కటాఫ్ మార్కులు సాధించిన వారిని షార్ట్‌లిస్ట్ చేసి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పదోతరగతి మార్కులకు 10 శాతం, ఇంటర్/పన్నెండో తరగతి మార్కులకు 10 శాతం, డిగ్రీ మార్కులకు 30 శాతం, రాత పరీక్ష స్కోరుకు 30 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 10
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూలై 14
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూలై 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూలై 18, 19
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 22
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్‌ఆర్‌ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్‌ఆర్‌ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్‌ఆర్‌ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్‌ఆర్‌ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఏఐఏఎస్‌ఎల్‌లో కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లు

మొత్తం ఖాళీలు 1049

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్... ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మూడేళ్ల కాలపరిమితికి గాను ముంబయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **343 పోస్టులు**
2. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: **706 పోస్టులు**

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 33 ఏళ్లు, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు

జీతం: నెలకు సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.28,605. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.27,450.

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థుల ఫీజు చెల్లింపు మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ గూగుల్ ఫాం ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 14

వెబ్‌సైట్: https://www.aiasl.in/Recruitment

ఐఐసీటీ హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ పోస్టులు

మొత్తం ఖాళీలు 23

హైదరాబాద్‌లోని సీఎస్‌ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. రీసెర్చ్ అసోసియేట్-1: **1 పోస్టు**
2. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: **3 పోస్టులు**
3. రీసెర్చ్ అసోసియేట్: **1 పోస్టు**
4. జూనియర్ రీసెర్చ్ ఫెలో/ప్రాజెక్ట్ అసోసియేట్-1: **1 పోస్టు**
5. ప్రాజెక్ట్ అసోసియేట్-2: **3 పోస్టులు**
6. ప్రాజెక్ట్ అసోసియేట్-1, 2: **1 పోస్టు**
7. ప్రాజెక్ట్ అసోసియేట్-1: **11 పోస్టులు**
8. ప్రాజెక్ట్ అసిస్టెంట్: **1 పోస్టు**
9. సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు నెట్/గేట్ స్కోర్, పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: రీసెర్చ్ అసోసియేట్, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ అసిస్టెంట్, సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టులకు 50 ఏళ్లు, ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.



ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: జూలై 16

వేదిక: సీఎస్‌ఐఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.iict.res.in/


లిటిల్స్




గడ్డంలో గడ్డిపరక

మహేంద్రుడనే రాజు దగ్గర ఆనందుడనే తెలివైన మంత్రి ఉండేవాడు. అతరు ఎన్నో సమస్యలకు సులువుగా చిటికెలో పరిష్కారాలు చెప్పేవాడు. ఒకరోజు మహారాజుకు ఇష్టమైన రత్నాలహారం కనిపించకుండా పోయింది. దాన్ని ఎవరు దొంగిలించినా కఠిన శిక్ష తప్పదు అనుకున్నారు అంతా. రాజుగారి కొలువుఓ పనిచేసే అందరు పనివారిని ఒకరోజు ఒకే దగ్గరకు పిలిచాడు మంత్రి, రాజుగారి నగల పెట్టె లోకి చూసి, మహారాజా.. మీ నగ ఎవరు దొంగిలించారో నాకు మీ నగల పెట్టె ఆనవాలు చెప్పింది. మీ నగ తీసుకున్న వ్యక్తి గడ్డంలో ఒక గడ్డి పరక ఉంటుందని నగల పెట్టె అంటోంది అన్నాడు గట్టిగా. అక్కడ ఉన్నర పనివారిలో ఒకడు తన గడ్డం పదేపదే తడుముకుని కంగారు పడటం గమనించిన మంత్రి మహారాజా ఇదిగో మీ హారం తీసుకున్న దొంగ అన్నాడు. ఆ పనివాడు బెదిరిపోయి, తప్పు ఒప్పుకుని, దొంగిలించిన నగను తెచ్చి రాజుకు ఇచ్చేశాడు. అందరూ మంత్రి సమయ స్ఫూర్తిని, తెలివి తేటలని మెచ్చుకున్నారు.

దారి కనుక్కోండి




6 తేడాలు గుర్తించండి!





సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 351

3		5		2	1			
9			8					
	1		7			8		
				7	5		8	6
7	5		9	4				
		4			6		7	
					7			5
			5	3		2		1

సుడోకు - 350 సమాధానం

8	9	5	1	6	4	2	7	3
3	4	2	7	8	9	6	1	5
1	7	6	2	5	3	4	9	8
5	6	3	4	9	7	1	8	2
9	8	4	5	2	1	7	3	6
7	2	1	6	3	8	9	5	4
2	1	8	9	4	5	3	6	7
4	3	7	8	1	6	5	2	9
6	5	9	3	7	2	8	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.